ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

ఆదివారం 1, జూన్ 2025

అంతా.. మొక్కుబడి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వెంకాయమ్మ

జిల్లాలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి దిశానిర్దేశం చేయాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఏదో సమావేశం పెట్టాలి కాబట్టి ఏర్పాటు చేశామన్నట్లు ఉందే తప్ప తక్షణ ప్రజా సమస్యల ప్రస్తావనే కరువైంది. ఈ సమావేశంలో ఆరు ప్రధాన శాఖలకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చినా ప్రయోజనం లేదు. ఏదో మొక్కుబడిగా చర్చ నడిపి మమ అనిపించారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యను మాత్రమే ఏడెనిమిది మంది సభ్యులు ప్రస్తావించగా... మిగిలిన అంశాలపై పెద్దగా మాట్లాడిన పరిస్థితి లేకుండాపోయింది. ప్రస్తుతం జిల్లాలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. దానిపై సమావేశంలో చర్చ అంతంతమాత్రంగానే జరిగింది.

సాదాసీదాగా జిల్లా పరిషత్ సమావేశం

అజెండాపై తూతూమంత్రంగా చర్చ

- తాగునీటి ఎద్దడిపైనే కొంతమేర ప్రస్తావన
- ఇతర అంశాలపై అంతంతమాత్రమే



జడ్పీ సమావేశానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎంతో కీలకమైన జిల్లా పరిషత్ సమావేశం మొక్కుబడిగా సాగింది. స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో శనివారం చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన ఇది జరిగింది. ఉదయం 11.15 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1.45 గంటలకు ముగిసింది. సుమారు రెండున్నర గంటలపాటు జరిగినా అందులో 45 నిమిషాలు తాగునీటి సమస్యపై చర్చ నడిచింది. మిగిలిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తాము చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అడపాదడపా శాసనసభ్యులు ఆయా అంశాలపై ప్రశ్నించడం మినహా మిగిలిన సభ్యులు తమ ప్రాంత సమస్యలపై గొంతెత్తిన పరిస్థితి లేకుండాపోయింది. మరోవైపు ఆయా సమస్యల పరిష్కారానికి వేదికైన జడ్పీ సమావేశానికి ప్రజాప్రతినిధుల హాజరు పలుచగానే ఉంది. కలెక్టర్ అన్సారియా సెలవులో ఉండటంతో జేసీ గోపాలకృష్ణ హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కనిగిరి, సంతనూతలపాడు, దర్శి ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొనగా

మిగతా 6వ పేజీలో

పేదల సేవలో..

ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ

- చిలంకూరులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- పలుచోట్ల కీలక ప్రజాప్రతినిధులు హాజరు
- ఒకరోజు ముందుగానే అందజేత



చిలంకూరులో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ శనివారం పండుగ వాతావరణంలో సాగింది. 'పేదల సేవలో ప్రభుత్వం' పేరుతో ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు వాటిని పంపిణీ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం కాగా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన సొంత నియోజకవర్గంలోని మర్రిపూడి మండలం చిలంకూరులో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నగదు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పేదలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పది గంటలకే 75శాతం పూర్తి

జిల్లాలో మొత్తం 2,81,384 మంది పింఛన్ లబ్ధిదారులకు జూన్ నెలకు రూ.123.36 కోట్లు మంజూరయ్యాయి. ప్రతినెలా 1వతేదీన పంపిణీ చేస్తుండగా ఈసారి 1వతేదీ ఆదివారం వచ్చింది. దీంతో ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేశారు. అత్యధిక ప్రాంతాల్లో ఉదయం 7 గంటల

మిగతా 6వ పేజీలో

నగర అభివృద్ధికి సహకరించండి!

- కమిషనర్ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి
- ట్రంక్‌రోడ్డు దుకాణదారులతో సమావేశం
- పూర్వీకుల ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని పలువురు ఆవేదన
- రోడ్డు విస్తరణ పనులను కొంతకాలం వాయిదా వేయాలని కోరిన కొందరు
- భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసిన వ్యాపారులు

6లో



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, వేదికపై మేయర్ గంగాడ సుజాత

ఒంగోలులో రెండు కొవిడ్ కేసులు?

- జీజీహెచ్‌లో రెండ్రోజుల క్రితం వైద్యపరీక్షలు
- పాజిటివ్‌గా నిర్ధారణ

వివరాలు మెయిన్‌లో..

పీఎస్ హెచ్‌ఎంలుగా 509 మంది

- స్కూల్ అసిస్టెంట్ల నియామకం
- సర్వీసులో జూనియర్లపై పిడుగు



ఒంగోలు విద్య, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా ఆవిర్భవించిన మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా 509 మంది స్కూలు అసిస్టెంట్లు నియమితులు కానున్నారు. ఈమేరకు చురుగ్గా ప్రక్రియ సాగుతోంది. తొలుత టీచర్ల పునర్విభజనలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో స్కూలు అసిస్టెంట్ తెలుగు 115 మంది, హిందీ 23 మంది, ఇంగ్లీషు 139 మంది, గణితం 134 మంది, సోషల్ స్టడీస్ 90మంది, బయోలాజికల్ సైన్స్ ముగ్గురు, ఉర్దూ ముగ్గురు, సంస్కృతం ఇద్దరు మిగులుగా తేలినట్లు నిర్ధారించారు. దీంతో వీరందరినీ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమించేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మిగులుగా తేలిన 509 మంది మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా బదిలీల్లో కోరుకోవాల్సి ఉంది.

జూనియర్ల బదిలీ తప్పనిసరి!

స్కూలు అసిస్టెంట్లకు సంబంధించి సర్వీసులో ఆయా సబ్జెక్టుల్లో జూనియర్లు అయిన టీచర్లపై బదిలీ పిడుగు పడనుంది. జూనియర్లు ప్రస్తుతం తాము పనిచేస్తున్న పాఠశాలల్లో మిగులుగా తేలకపోయినా వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని పాఠశాల విద్య కమిషనర్ స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన వెబెక్స్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. హెచ్‌ఎం ఉద్యోగోన్నతులు కోసం ఇటీవల సబ్జెక్టు వారీగా తయారుచేసిన సీనియారిటీ జాబితాల ఆధారంగా ఆయా సబ్జెక్టుల్లో జూనియర్లుగా ఉన్న వారిని గుర్తించి వారిని పీఎస్ హెచ్‌ఎంలుగా పంపించమన్నారు. వారు ఇప్పటికే బదిలీకి దరఖాస్తు చేసుకోకపోతే ఆదివారం వారందరినీ పిలిపించి వారితో దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. పీఎస్ హెచ్‌ఎం/ఎస్‌ఏ పోస్టుకు సీనియర్ టీచర్లు కూడా ఆప్షన్లు ఇవ్వవచ్చు. ఒకవేళ సీనియర్ టీచర్లు పీఎస్ హెచ్‌ఎంలుగా వెళితే వారి దామాషా ప్రకారం జూనియర్ టీచర్లు బదిలీ కాకుండా వారి స్థానాల్లో కొనసాగవచ్చు. జూనియర్ టీచర్లు మాత్రం తప్పనిసరిగా అన్ని పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు ఆప్షన్లు పెట్టుకోవాల్సిందే. బదిలీ పిడుగు పడనుండటంతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

నిబద్ధతతో పనిచేస్తా

- డాక్టర్ కామేపల్లి సీతారామయ్య
- పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సీతారామయ్య

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) నిబద్ధత, నిజాయితీతో పనిచేసి రైతుల్లో టీడీపీ ప్రభుత్వ గౌరవం పెరిగే విధంగా ముందుకెళ్తానని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. శనివారం ఉదయం ఆయన ఒంగోలులోని బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వెళ్లి పర్సన్ ఇన్‌చార్జి (చైర్మన్)గా బాధ్యతలు స్వీకరించారు. ఆ సందర్భంగా తనను కలిసిన ఉద్యోగులు, మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తన తండ్రి రమణారావు ద్వారా ప్రజాసేవకు తాను ఆకర్షితుడినయ్యానని తెలిపారు. డాక్టర్ వృత్తితోపాటు టీడీపీపై ఉన్న అభిమానంతో పార్టీ పటిష్ఠతకు తనవంతు పాటుపడ్డానని

మిగతా 6వ పేజీలో

పడిగాపులకు ఫుల్‌స్టాప్!

పాత విధానంలోనే రేషన్

నేడు జిల్లావ్యాప్తంగా ప్రారంభం

- నాలుగేళ్ల అనంతరం దుకాణాల వద్దే పంపిణీ
- భారీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ షాపుల ద్వారా ఆదివారం నుంచి సరుకుల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని షాపులను ఆన్‌లైన్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో మొబైల్ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ అంటూ ఆర్భాటపు ప్రచారం చేసి కేవలం ఒక ప్రాంతంలోనే ఆ వాహనాలను నిలిపి అందజేసేవారు. దీంతో కార్డుదారులు పనులు మానుకొని ఎదురుచూడాల్సి వచ్చేది. అయితే నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ విధానంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. అనేక లోటుపాట్లు ఉన్నట్లు గుర్తించింది. పాత పద్ధతిలోనే కార్డుదారులకు రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 6,61,206 కార్డులు ఉన్నాయి.

పండుగ వాతావరణంలో ప్రారంభం

పండుగ వాతావరణంలో పాత విధానంలో రేషన్ దుకాణాల వద్ద సరుకుల పంపిణీకి ఇప్పటికే అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని ముఖ్యమైన ప్రజాప్రతినిధుల ద్వారా అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ తమీమ్ అన్సారియా రేషన్ షాపులను పరిశీలించగా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ డీలర్లతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. మరోవైపు డివిజనల్ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు వారి పరిధిలోని రేషన్ షాపులను పరిశీలించి డీలర్లకు సరుకుల పంపిణీపై పలు సూచనలు చేశారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



దొనకొండ మండలం ఒబ్బాపురంలో రేషన్ పంపిణీకి సిద్ధమైన దుకాణం

పొగాకు రైతుల కన్నెర్ర

- వ్యాపారుల తీరుకు నిరసనగా వేలం బహిష్కరణ
- కొండపిలో రాస్తారోకో
- ధరలు పెంచి నోబిడ్‌లు తగ్గించాలని డిమాండ్

కొండపి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు కన్నెర్ర చేశారు. వ్యాపారుల తీరుకు నిరసనగా కొండపిలో కొనుగోళ్లను బహిష్కరించారు. స్థానిక వేలం కేంద్రం వద్ద రాస్తారోకోకు దిగారు. నెన్నూరుపాడు గ్రామానికి చెందిన రైతులు శనివారం పొగాకు బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. మేలిమి రకాన్ని నాణ్యతను బట్టి కిలో రూ.200పైన కొనుగోలు చేయాల్సి ఉండగా ఆ ధర ఇవ్వకుండా అత్యధిక బేళ్లను వ్యాపారులు నోబిడ్ చేశారు. అదేసమయంలో లోగ్రేడ్ రకానికి కిలోకు రూ.200 ఇచ్చారు. దీంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నాణ్యమైన పొగాకును కొనుగోలు చేయకుండా లోగ్రేడ్‌కు అధిక ధరలు ఇవ్వడం ఏమిటని వ్యాపారులను, బోర్డు అధికారులను నిలదీశారు. వేలాన్ని నిలిపివేసి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం వేలం పునఃప్రారంభమైంది. శనివారం వేలం కేంద్రాన్ని రైతుకూలీ సంఘం నాయకులు సందర్శించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సిరిగిరి లలితకుమారి, జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు బెజవాడ శివరామకృష్ణయ్య, గొల్లపల్లి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.



కొండపిలో రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

మా కుమారుడిని బతికించండి..



వ్యాధితో బాధపడుతున్న విక్రాంత్ మోజెస్

- గ్యాంగ్రీనస్ ఇలియోస్టమీ అనే పేగు వ్యాధి బారిన యువకుడు
- వైద్యానికి రూ.15లక్షలు అవసరం
- తమిళనాడులోని రాయవేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న బాధితుడు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు

7లో



37వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ముమ్మరం

- 'ఆంధ్రజ్యోతి' చర్చావేదికలో పలు సమస్యలను ప్రస్తావించిన స్థానికులు
- వాటి పరిష్కారంపై ఎమ్మెల్యే దామచర్ల దృష్టి
- రూ.1.85 కోట్ల పనులు మంజూరు
- కొన్ని ఇప్పటికే పూర్తి, మరికొన్ని ప్రారంభం
- పార్కులో పనులను పరిశీలించిన మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

7లో



అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

● మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, సత్య ప్రత్యేక పూజలు

జరుగుమల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లిలోని గ్రామ సచివాలయం వద్ద శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ శనివారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, ఎంపీపీ బెల్లం నిర్మల, టీడీపీ గ్రామ నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కందులతో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

మైనార్టీ ఏపీఆర్‌జేసీ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి

మార్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో మైనార్టీ విద్యార్థుల కోసం ఏపీఆర్‌జేసీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని మైనార్టీ విభాగం ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కోరారు. స్థానిక జవహగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసిన మైనార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో మైనార్టీ ఏపీఆర్‌జేసీ స్కూల్స్ ఉన్నాయన్నారు. ప్రకాశం జిల్లాలో ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో స్కూల్ అవసరం ఎంతో ఉందన్నారు. మైనార్టీ విద్యార్థులు ప్రాథమిక దశలోనే పాఠశాల విద్యకు దూరమవుతున్నారని అన్నారు. తాను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో మాట్లాడి స్కూల్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద మసీద్ ముతవల్లి మీర్జా సఫ్దార్ అలీబేగ్, మైనార్టీ విభాగం నాయకులు పఠాన్ ఇబ్రహీం, ఎస్‌కే మౌలాలి, షేక్ షెక్షావలి, హుసేన్‌ఖాన్ పాల్గొన్నారు.

పేదల సేవలో..

(5వ పేజీ తరువాయి)

నుంచి పింఛన్ల పంపిణీ చేపట్టగా 10 గంటలకే దాదాపు 75శాతం మందికి అందజేశారు. అలా సాయంత్రం నాలుగు గంటల సమయానికి 88.50శాతం మంది లబ్ధిదారులకు సొమ్ములు అందాయి. రాత్రి వరకు కూడా అందుబాటులో ఉన్న వారికి పింఛన్లను అందజేశారు.

ఉత్సాహంగా పాల్గొన్న నేతలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు గ్రామ, పట్టణ స్థాయి టీడీపీ నేతలు పింఛన్‌ల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రి స్వామి కొండపి నియోజకవర్గంలోని చిలంకూరులో పాల్గొనగా ఆ నియోజకవర్గానికి చెందిన మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య జరుగుమల్లిలో పింఛన్లు పంపిణీ చేశారు. ఒంగోలులోని 15వ డివిజన్‌లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పింఛన్లు పంపిణీ చేయగా మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్‌లో అందజేయగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని శాంతి క్లినిక్ ప్రాంతంలో పంపిణీ చేశారు. దోర్నాల మండలం ఐనముక్కలలో టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు పంపిణీ చేశారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తాళ్లూరు మండలం శివరాంపురంలో అందజేశారు. దర్శి పట్టణంలో అక్కడి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది లబ్ధిని పంపిణీ చేయగా స్థానిక అధికారపార్టీ నాయకులు, అధికారులు భాగస్వాములయాయరు.

భవిష్యత్‌కు ఎన్టీఆర్ భరోసా..!

- భావోద్వేగానికి గురైన మహిళ



భావోద్వేగంలో ఆదిలక్ష్మి

కొన్ని నెలలుగా డయాలసిస్‌తో బాధపడుతూ ఆరోగ్యం కోసం ఆర్థికంగా బాధపడుతున్న ఒంగోలు రామనగర్‌కు చెందిన ఆదిలక్ష్మికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఆసరాగా నిలిచింది. భర్త చంద్రశేఖర్ వృత్తి రీత్యా కార్పెంటర్‌గా పనిచేస్తూ చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ అంతంత మాత్రంగా ఉంది. తనకు రెండు కిడ్నీలు పాడై, డయాలసిస్ చేసుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఎన్టీఆర్ భరోసా కింద రూ. 10వేలు రావడంతో ఆదిలక్ష్మి బావోద్వేగానికి గురైంది.

శనివారం స్థానిక రామనగర్‌లోని 2వ లైనులో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి చేతులమీదుగా రూ.10 వేలు తీసుకుంటూ ఆనందంతో కన్నీటి పర్యంతమైంది. ఈ సందర్భంగా ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నగర అభివృద్ధికి సహకరించాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు

● ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందన్న వ్యాపారులు

● పనులు కొంత కాలం వాయిదా వేయాలన్న పలువురు

● ట్రంక్ రోడ్ విస్తరణపై భిన్నాభిప్రాయాలు

ఒంగోలు, కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : నగర అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న రహదారుల విస్తరణకు వ్యాపారులు సహకరించాలని నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు కోరారు. శనివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ట్రంక్ రోడ్ వ్యాపారులతో కమిషనర్ సమావేశం నిర్వహించి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలోని పలు ప్రధాన రహదారులు విస్తరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే మాస్టర్ ప్లాన్ ప్రకారం ట్రంక్ రోడ్‌ను 100 అడుగులు విస్తరిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కొందరు వ్యాపారులు మాట్లాడుతూ ట్రంక్ రోడ్‌లో కొన్నేళ్లుగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా తమ పూర్వీకుల నుంచి సంక్ర మించిన ఆస్తులను కాపాడుకుంటూ, వ్యాపారాలు సరిగా జరగకపోయినా, వాటినే నమ్ముకుని జీవిస్తున్నామని తెలిపారు. ట్రంక్ రోడ్ విస్తరణ పనులు సరికాదని అధికారులకు వివరించారు. అలాగే గతంలోనూ ఆ రోడ్ విస్తరించాలని ప్రతిపాదించినా, తమకు జరుగుతున్న నష్టాన్ని నాయకులు, అప్పటి అధికారులకు వివరించామని పేర్కొన్నారు. అత్యధిక శాతం దుకాణాలు పూర్తిగా కోల్పోయే అవకాశం ఉందని వారు అధికారులకు వివరించారు. ఇదిలా ఉంచితే ఆ రోడ్‌లో అద్దెకు షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు రోడ్ విస్తరించడం ద్వారా తమ వ్యాపారాలు పూర్తిగా కోల్పోతామని, తాము ఎక్కడికి వెళ్లాలని అన్నారు. కొంత గడువు ఇవ్వాలని కోరారు. వ్యాపారుల అభిప్రాయాలపై కమిషనరు మాట్లాడుతూ రోడ్ విస్తరణలో నష్టపోతున్న భవన యజమానులకు స్థలం మార్కెట్ ధర ప్రకారం టీడీఆర్ బాండ్‌లు 4 రెట్లు ఎక్కువ ధరతో ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని యజమానులు బిల్డర్లకు అమ్ముకోవచ్చని, లేదా సొంతంగా ఇతర ప్రాంతంలో నిర్మించుకునే భవనాలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో 65 శాతం మంది రోడ్ విస్తరణకు అంగీకారం తెలియజేయగా, మరో 35 శాతం మంది సుముఖత చూపలేదు. దీంతో కమిషనరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మరోసారి అందరం కలిసి సమావేశం నిర్వహించుకుని, సమస్యను సానుకూలంగా, అందరికీ ఆమోద యోగ్యంగా పరిష్కరించుకుందామని తెలిపారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం వ్యాపారులు కలిసి రావాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వాయిదాలు వేసుకోవడం ద్వారా అభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతాయని, అటు నగర అభివృద్ధి, ఇటు వ్యాపారులకు నష్టం జగరకుండా అవసరమైన విధంగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ట్రంక్ రోడ్ వ్యాపారులు, భవన యజమానులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ప్లాన్ వివరాలను అధికారులు వ్యాపారులకు వివరించారు.



సమావేశానికి హాజరైన వ్యాపారులు (ఇన్‌సెట్లో) ట్రంక్ రోడ్డు విస్తరణ గురించి మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

అంతా మొక్కుబడి

(5వ పేజీ తరువాయి)

సమావేశం చివర్లో వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ వచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతోపాటు మిగిలిన శాసనసభ్యులు హాజరుకాలేదు.

రామతీర్థం పైపులైన్ దెబ్బతింది

కనిగిరి ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్యను అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. రామతీర్థం జలాశయం నుంచి కనిగిరి ప్రాంతానికి ఏర్పాటుచేసిన పైపులైను దెబ్బతినడంతో నీరు రావడం లేదన్నారు. పైపులైనుకు మరమ్మతులు చేసినా ఇంకోచోట దెబ్బతింటుందన్నారు. ఆ పైపలైను నిర్మాణానికి రూ.3కోట్లు అవసరమని, ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లానని చెప్పారు. జిల్లా పరిషత్ నుంచి కొంతచ ఎంపీ ల్యాడ్స్ నుంచి కొందరు నిధులు కేటాయించాలని కోరారు.

ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరు

ఎంపీ మాగుంట మాట్లాడుతూ ఆ పైపులైన్ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.కోటి కేటాయించనున్నట్లు తెలిపారు. మిగిలిన నిధులను పంచాయతీరాజ్‌శాఖ మంత్రితోపాటు జిల్లా పరిషత్ నుంచి సమకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు అవకాశం లభించిందన్నారు. గత ప్రభుత్వంలో ఆ పనుల నిర్వహణలో తీవ్రజాప్యం జరగడంతో ప్రస్తుతం నీటి సమస్య ఏర్పడిందన్నారు. జలజీవన్ మిషన్ పథకంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకశ్రద్ధ తీసుకొని గడువును పెంచే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. జిల్లాలోని ఆర్వో ప్లాంట్ల నిర్వహణతోపాటు కొత్తగా మంజూరైన ప్లాంట్లను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రామతీర్థంకు నిధులు ఇవ్వాలి

సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ రామతీర్థం జలాశయానికి రూ.20కోట్ల నుంచి రూ.30కోట్లు వ్యయం చేస్తే మరో 1.5 టీఎంసీల నీటిని నిల్వ చేసుకొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. చీమకుర్తి జడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ రామతీర్థం జలాశయానికి వెళ్లే రోడ్లకు మరమ్మతులతోపాటు, జంగిల్ క్లియరెన్స్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చీమకుర్తి మండల పరిషత్ నుంచి ఆ పనులను చేసేందుకు ఎమ్మెల్యే విజయకుమార్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కనిగిరి, హనుమంతునిపాడు, బేస్తవారపేట, త్రిపురాంతకం, వైపాలెం జడ్పీటీసీ సభ్యులు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను ఏకరువు పెట్టారు. ఆర్వో ప్లాంట నిర్వహణ సరిగా లేని కారణంగా పనిచేయడం లేదన్నారు. వాటిని సర్పంచ్‌లకు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)పై జరిగిన చర్చలో దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వివక్ష లేకుండా అందరికీ ఉపాధి పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ముఖ్యమైన అధికారులు లేక పోతే ఎలా?

త్రిపురాంతకం జడ్పీటీసీ సభ్యుడు జాన్‌పాల్ మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో శ్మశానాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వంటి అధికారులు లేకుండా సమావేశం నిర్వహించడం వలన ఏమి ప్రయోజనం అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఉన్నప్పుడే సమావేశం నిర్వహిస్తే తమ సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు లేకుండా ముందుగానే అనుమతి తీసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని సీఈవోను కోరారు. ఇలా ఆయా అంశాలపై అరకొరగానే సభ్యులు మాట్లాడారే తప్ప పూర్తిస్థాయిలో చర్చించిన పరిస్థితి లేకుండాపోయింది. చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అర్థవంతంగా సమావేశం నిర్వహించామని తెలిపారు. జడ్పీ సీఈవో చిరంజీవి రెండు తీర్మానాలను ప్రవేశపెట్టగా వాటిని ఆమోదించారు. జడ్పీ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, అతిథిగృహాన్ని ఆధునికీకరణ చేయాలని తీర్మానించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు అయ్యే విధంగా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పొగాకు పంట కొనుగోళ్లపై తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలి

ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు కొనుగోళ్ల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలోకి దించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపాలని ఎంపీ మాగుంట కోరారు. ఈ ఏడాది పంట ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో కొనుగోళ్లు మందగించాయన్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ అంశాన్ని కూడా తీసుకెళ్లారని తెలిపారు. అందువల్ల జడ్పీలో కూడా తీర్మానం చేసి పంపాలని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వ పథకాలు

త్రిపురాంతకం, మే 31 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని వాటిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్ శాస్త్రవేత్త పి.యాదవ్, కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి టి.వేంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం త్రిపురాంతకం మండలం రామసముద్రం, మిట్టపాలెం గ్రామాల్లో వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు రైతులతో మాట్లాడారు. రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏవిధంగా సమాయత్తం కావాలో వివరించారు. ముందుగానే భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు., లోతుగా దుక్కులు దున్నడం ద్వారా భూమిలో వేరుకుళ్లు తెగుళ్లను ఆశించే పురుగులను నివారించవచ్చని తెలిపారు, ఖాళీగా ఉన్న భూముల్లో అటవీ జాతి లేదా ఉద్యాన పంటల సాగుతో వేసవి తాపాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నీరజ, ఉద్యాన అధికారి ఆదిరెడ్డి పాల్గొన్నారు.



గంజివారిపల్లి పంట పొలాల్లో పులి జాడలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

గంజివారిపల్లిలో పులి సంచారం

● ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చిన ప్రజలు

● జాడలను పరిశీలించిన అధికారులు

● కనిపించలేదు..అయినా అప్రమత్తంగా ఉండాలంటున్న రేంజర్

ఎర్రగొండపాలెం రూరల్ మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంజివారిపల్లి - కొలుకుల గ్రామల మధ్య అటవీ ప్రాంతంలో పులి కనిపించిందంటూ పుకార్లు వచ్చాయి. రెండు గ్రామాల సరిహద్దుల్లో పులి తిరిగినట్లు కొంత మంది ఫారెస్టు అధికారులకు శుక్రవారం సమాచారం ఇచ్చారు. దీంతో గంజివారిపల్లి రేంజర్ సుబ్బారావు, సిబ్బంది శుక్ర, శనివారం రెండు రోజులు ఆ ప్రాంతంలో పులి జాడలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అయితే అటవీ ప్రాంతంలో కానీ, గ్రామ శివారులో గానీ పులి జాడలు ఎక్కడా కనిపించలేదన్నారు. అయినా ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రేంజర్ సూచించారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాలలో పంట పొలాలు దున్ని సాగుకు సిద్ధంగా ఉన్నందున పులి బయటికి వచ్చే ఆవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతాలలో తిరుగుతున్నారని అన్నారు.

నిబద్ధతతో పనిచేస్తా

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. ప్రస్తుతం ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, ఎంపీ మాగుంట, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు స్వామి, రవికుమార్, యావత్ టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల సిఫార్సుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ తనకు పీడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇచ్చారన్నారు. వారి నమ్మకం వమ్ము కాకుండా పనిచేస్తానన్నారు. డాక్టర్ వృత్తికన్నా బ్యాంకు బాధ్యతలకే సమయాన్ని ఎక్కువ కేటాయించి పనిచేస్తానని చెప్పారు. తెలియని విషయాలను తెలుసుకొను తాను మాటపడకుండా, తనకు అవకాశం ఇచ్చిన వారికి మాట రాకుండా రైతు సేవలో ముందుకెళ్తానని స్పష్టం చేశారు. తనను కలిసిన సెంట్రల్ బ్యాంకు అధికారులు, సిబ్బందిని సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీసీవో ఇందిరాదేవి, బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో రాఘవయ్య, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిప్పాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుందురు చిన్న నారాయణరెడ్డి (32) మండలంలోని చింతగుంట్ల గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్ననారాయణరెడ్డి మార్కాపురం నుంచి తన బైక్ పై స్వగ్రామం తిప్పాయపాలెం గ్రామం వెళుతూ చింతగుంట్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో అతని తలకు తీవ్రగాయమైంది. వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. చిన్నానారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనున్న విద్యుత్ ఆఫీసులో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు, ఏఎస్ఐ శ్రీనివాసులు ఘటనను పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సర్వజన వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వైద్యశాలకు వెళ్లి చిన్న నారాయణరెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ

● నిరుపయోగంగా ట్రాక్టర్లు

● మార్చిలో 5 గ్రామ పంచాయతీలకు మంజూరు

● ఇంజన్లు ఇచ్చారు.. ట్రక్కులు మరిచారు

ఎర్రగొండపాలెం రూరల్ మే 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించి స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా రూపుదిద్దాలన్నా సంకల్పం నెరవేరడం లేదు. ప్రభుత్వం అధిక జనబా ఉన్న పంచాయతీలకు రూ. 6లక్షలతో ట్రాక్టర్లు మంజూరు చేసింది. ఎర్రగొండపాలెం మండలంలో 5 పంచాయతీలకు ఈ ట్రాక్టర్లు మంజూరయ్యాయి. వాటిలో అమానిగుడిపాడు, బోయలపల్లి, గుర్రపుశాల, గురిజేపల్లి, కొలుకుల గ్రామాలకు ఈ ఏడాది మార్చిలో వచ్చాయి. పారిశుధ్య నిర్వహణకు వినియోగించేందుకు ట్రాక్టర్ ఇంజన్లు ఇచ్చినా చెత్తను తరలించేందుకు ట్రక్కులు ఇవ్వలేదు. దీంతో రెండు నెలలుగా ట్రాక్టర్ ఇంజన్‌లు మూలనపడ్డాయి. పాత పద్ధతిలోనే రిక్షాలలో చెత్తను సేకరించి తరలిస్తున్నట్లు కార్యదర్శులు చెప్తున్నారు.

ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ

ఐదు పంచాయతీలకు కేటాయించిన ఈ ట్రాక్టర్లు (ఇంజన్లు) ఆయా గ్రామాలలో గ్రామ వార్డు సచివాలయం, పంచాయతీ కార్యాలయం ముందు ఆరు బయట ఉంచారు. అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉన్నాయి. అవి నిరుపయోగంగా పడి ఉండి పాడైపోతాయని సర్పంచ్‌లు అంటున్నారు. ప్రభుత్వం త్వరితగతిన ట్రాక్టరు ట్రక్కులను మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులను అడగ్గా ప్రభుత్వం నుంచి ఇంజన్లు మాత్రమే వచ్చాయని, త్వరలో ట్రక్కులు వస్తాయని ఉన్నతాధికారులు చెప్తున్నట్లు వారు తెలిపారు.



అమానిగుడిపాడులో ఉన్న ట్రాక్టర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి



మృతిచెందిన సుధాకర్‌రావు

సంతనూతలపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హెడ్‌కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు .. మండలంలోని ఎనికపాడు గ్రామానికి చెందిన విక్రం సుధాకర్‌రావు(35) శుక్రవారం సాయంత్రం పశువులను ఇంటికి తోలుకుని వస్తున్నాడు. అయితే అవి చెరువులోకి దిగడంతో వాటిని బయటకు తరిమేందుకు చెరువుగట్టు వద్దకు రాగా దురదృష్టవశాత్తు ఆయన నీటిలో పడ్డాడు. సుధాకర్‌రావుకు ఈత రాకపోవడంతో నీటిమునిగి చనిపోయాడు. అయితే చీకటి పడినా సుధాకరరావు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల విచారించారు. శనివారం ఆయన మృతదేహం చెరువులో పైకి తేలడంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందజేశారు. సుధాకర్‌రావు మృతదేహాన్ని బయటకు తీసుకు పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.22.17లక్షలు

జరుగుమల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లిలో ఉన్న పోలేరమ్మ ఆలయ హుండీని శనివారం లెక్కించారు. ఆరునెలల 12 రోజులకు 22,17,367 రూపాయల ఆదాయం లభించింది. రెండు డాలర్లు కూడా వచ్చాయి. కార్యక్రమాన్ని వల్లూరమ్మ ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.రమేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బైరాగి చౌదరి, కామేపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నగర మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు, కౌన్సిలర్ చెన్నుపాటి వేణుగోపాల్

37వ డివిజన్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

- 'ఆంధ్రజ్యోతి' చర్చావేదికలో పలు సమస్యలను ప్రస్తావించిన స్థానికులు
- వాటి పరిష్కారంపై ఎమ్మెల్యే దామచర్ల దృష్టి
- రూ.1.85 కోట్ల పనులు మంజూరు
- కొన్ని ఇప్పటికే పూర్తి, మరికొన్ని ప్రారంభం
- పార్కులో పనులను పరిశీలించిన మేయర్, కమిషనర్

ఒంగోలు, మే 31(ఆంధ్రజ్యోతి):ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లో మౌలిక సదుపాయాల మెరుగు, ప్రధానమైన ఎన్టీఆర్ పార్కులోని అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు చోట్ల సిమెంటు రోడ్లు, డ్రైన్లు నిర్వహణతోపాటు పార్కులో లెవలింగ్, ట్రాక్ నిర్మాణ పనులను దాదాపు రూ.1.85 కోట్లతో చేపట్టగా కొన్ని పూర్తి కాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఇంకొన్నిటికి టెండర్లు పిలిచారు. ప్రస్తుతం పార్కులో జరుగుతున్న పనులను మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్‌లు శనివారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలలో ప్రజల మౌలిక సదుపాయాల పెంపు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పనులు, సమస్యల పరిష్కారం లక్ష్యంగా 'అక్షరమే అండగా పరిష్కారమే అజెండాగా' పేరుతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థలు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విదితమే. అందులో భాగంగా జనవరి 28వ తేదీన నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ పార్కులో జరిగిన చర్చా వేదికలో స్థానిక ప్రజలు వందల సంఖ్యలో పాల్గొనగా దాదాపు 70 మంది వరకు తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు, సమస్యలు ఏకరువు పెట్టారు. కాగా ఆ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రజలు ప్రస్తావించిన సమస్యలు, అభివృద్ధి పనులపై నిర్దిష్టమైన హామీలు ఇచ్చారు. మొత్తం రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు డివిజన్‌లో పూర్తి చేయనున్నట్లు ప్రకటించిన ఆయన తక్షణం అత్యవసరం అలాగే ప్రత్యేకంగా వందలాదిమంది నిత్యం వాకింగ్ చేసే ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా ఇప్పటి వరకు దాదాపు రూ.1.85కోట్ల విలువైన పలు రకాల పనులను కార్పొరేషన్ అధికారులు మంజూరు చేశారు. ఆయా పనుల పురోగతిపై కమిషనర్ వెంకటేశ్వర రావు ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఇంకొన్నింటికి టెండర్లు పిలువగా, కొన్ని అగ్రిమెంట్లు జరిగి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం రూ 1.85 కోట్ల విలువైన పనులలో సుమారు రూ.9.60 లక్షలతో చేపట్టిన ప్రధానమైన పార్కు దక్షిణం వైపు కాలువ నిర్మాణం పూర్తయింది.



ఎన్టీఆర్ పార్కులో పూర్తయిన కొన్ని పనులు



పార్కులో శరవేగంగా జరుగుతున్న మరికొన్ని పనులు

అలాగే మరో రూ.5.90 లక్షలతో సమతానగర్ 9వ లైన్‌లో చేపట్టిన రోడ్డు, రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ పూర్తయింది. ఇక సుమారు రూ.20.80 లక్షలతో ఎన్టీఆర్ పార్కులో చేపట్టిన లెవలింగ్ రెండు వైపులా ట్రాక్ విస్తరణ, పటిష్టత పనులు పురోగతిలో ఉన్నాయి. ఇటీవల వర్షాలు, మట్టి కొరతతో ఆ పనులు జాప్యం కాగా తిరిగి ప్రారంభించారు. ఆ పనులను శనివారం మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావులు పరిశీలించారు. ట్రాక్‌ల నిర్మాణంతో పాటు బ్యూటిఫికేషన్ కోసం మరికొన్ని పనులను సూచించారు. అలాగే రూ.4 లక్షలతో పిల్లలు ఆడుకొనే క్రీడా సామగ్రి కొత్తవి ఏర్పాటుచేయగా మరో రూ.10 లక్షలతో సోలార్ విద్యుత్ సెట్లు ఏర్పాటు చేయనున్నారు. సోలార్ విద్యుత్ టెండర్ పొందిన ఏజెన్సీ ప్రతినిధులను శనివారం కమిషనర్ పార్కుకు పిలిపించి మాట్లాడి తగు సూచనలు చేశారు. పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను పక్షం రోజులలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఇంజనీరింగ్ సిబ్బందిని, కాంట్రాక్టు ఏజెన్సీలను కమిషనర్ వెంకటేశ్వర రావు ఆదేశించారు.



పోటీల్లో బండ లాగుతున్న ఎడ్లు

సత్తాచాటిన నంద్యాల ఎడ్లు

తర్లుపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని నీలంపాటి లక్ష్మీ అమ్మవారి తిరుణాళ్ల సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా ఎడ్లు సత్తాచాటాయి. మొత్తం 11 జతలు గిత్తలు ఈ పోటీలో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన దీనం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 2,500 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతి రూ.60వేలు గెలుపొందాయి. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరస్వామి ఎడ్లు 2,253 అడుగుల దూరాన్ని లాగి ద్వితీయ బహుమతి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా మిడతూరు మండలం అలగనూరుకు చెందిన మేడం రేణి ఎడ్లు 2,105 అడుగులతో మూడో బహుమతి రూ.40వేలు, నంద్యాల జిల్లా గోశపాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పృత్విక్ రెడ్డి, దినేశ్‌రెడ్డి ఎడ్లు 2,085 అడుగులతో నాలుగో బహుమతి రూ.30వేలు, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన సింగి నక్షత్రారెడ్డి ఎడ్లు 2,050 అడుగుల దూరంతో ఐదో బహుమతిగా రూ.20వేలు, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన శ్రీరాములమ్మ ఎడ్లు 2,020 అడుగులతో ఆరో బహుమతిగా రూ.15వేలు, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం గ్రామానికి లక్కా నాగశివశంకర్ ఎడ్లు 1,847 అడుగుల దూరాన్ని లాగి ఏడో బహుమతిగా రూ.10వేలు, నంద్యాల జిల్లా గడివేముల మండలం పేసరవాయి గ్రామానికి చెందిన సయ్యద్ కలాం బాషా ఎడ్లు 1,845 అడుగుల దూరాన్ని లాగి రూ.8వేలు గెలుపొందాయి. ఎడ్ల పోటీలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పవర్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట

క్రీడలతో మానసికోల్లాసం - ఎంపీ మాగుంట

- రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం, శరీర దృఢత్వం లభిస్తుందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని మినీ స్టేడియంలో 12వ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఎంపీ మాగుంట ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మాగుంట మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఒంగోలులో జరగడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి గుంటి రాజేశ్వరి మాట్లాడుతూ మే 31వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. తొలిరోజు పవర్ లిఫ్టింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, సౌత్ జోన్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు పలువురు పాల్గొన్నారు.

అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు చేతికందొచ్చి తమకు అండగా ఉంటాడనుకొన్నారు ఆ తల్లిదండ్రులు. కానీ విధి ఆ కన్నబిడ్డను ఆసుపత్రి పాలుజేస్తుందనుకోలేదు. పేగు సంబంధ వ్యాధికి గురికావడంతో ఆ పేద తల్లిదండ్రులు కుమారుడి ఆరోగ్యం కోసం ఉన్నదంతా ఖర్చు చేశారు. ప్రైవేటు వైద్యశాలల చుట్టూ తిరిగి చివరికి సీఎంసీ వైద్యశాలలో చేర్పించారు. ప్రస్తుతం రూ.15లక్షల ఖరీదైన వైద్య చికిత్స చేయిస్తేనే అతను బతుకుతాడని వైద్యులు చెప్పడంతో ఖిన్నులైన ఆ తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

మా కుమారుడిని బతికించండి..

- గ్యాంగ్రీనస్ ఇలియోస్టమీ అనే పేగు వ్యాధి బారిన యువకుడు
- వైద్యానికి రూ.15లక్షలు అవసరం
- తమిళనాడులోని రాయవేలూరు సీఎంసీలో చికిత్స పొందుతున్న బాధితుడు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు



రాయవేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విక్రాంత్ మోజెస్

నాగులుప్పలపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు మండలం మట్టిగుంట గ్రామంలోని దళితకాలనీకి చెందిన దుడ్డు నవీన్‌కుమార్ ఆటో నడుపుకొని జీవనం సాగిస్తుంటాడు. భార్య స్వప్న కూలీ పనులకు వెళుతుంది. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాత్విక్‌మోజెస్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. చిన్న కుమారుడు విక్రాంత్‌మోజెస్(18)బీటెక్ రెండో ఏడాది పూర్తి చేశాడు. ఇటీవల విక్రాంత్‌మోజెస్‌కు కడుపునొప్పిగా ఉండటంతో బాపట్లలోని ఓ వైద్యశాలలో చూపించగా కొద్దిరోజులు అక్కడే చికిత్స అందిస్తున్న క్రమంలో నొప్పి తీవ్రత అధికమవడంతో అక్కడి వైద్యులు అరుదుగా వచ్చే గ్యాంగ్రీనస్ ఇలియోస్టమీ పేగు సంబంధ వ్యాధిగా గుర్తించారు. శస్త్రచికిత్స అవసరమని తల్లిదండ్రులకు సూచించారు. దాంతో వారు తమ కుమారుడిని గుంటూరులోని జీజీహెచ్‌లో చేర్పించగా అక్కడి వైద్యులు విక్రాంత్ మోజెస్‌కు శస్త్రచికిత్స నిర్వహించారు. అయితే చికిత్స అనంతరం విక్రాంత్‌మోజెస్ పేగు మరోమారు లీక్ అవుతూ డీహైడ్రేషన్‌కు గురై ఎంట్రోక్యూటేనియస్ ఫిస్టులా అభివృద్ధి చెంది పరిస్థితి విషమంగా మారింది. దాంతో వైద్యులు తక్షణమే తమిళనాడులోని రాయవెల్లూరు సీఎంసీ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించారు. అక్కడ విక్రాంత్‌మోజెస్‌ను పరిక్షించిన వైద్యులు ఐవి న్యూట్రిషియన్ చేయాలని, మూడు నెలలు వైద్యం అందించాలని సూచించారు. అనంతరం మరో శస్త్రచికిత్స చేస్తేనే కోలుకొంటాడని, అందుకు రూ.15లక్షలు అవుతుందని సూచించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. నిరుపేదలమైన తాము తమ కుమారుడి ప్రాణాలను కాపాడుకునే ఆర్థికస్థోమత లేక కన్నీరుమున్నీరు అవుతున్నారు. దాతల సాయం కోసం దీనంగా వేడుకొంటున్నారు. విరాళాలు పంపించేవారు జి.స్వప్న ఇండియన్‌బ్యాంక్ ఖాతా నంబరు : 7903388350 ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐడిఐబి 000పి286 లేదా ఫోన్‌పే నంబరు 9381114501కు అందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు విద్య, మే 31 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ప్రారంభమైంది. మూల్యాంకనానికి నియమితులైన 300 మంది సబ్జెక్టు టీచర్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు హాజరయ్యారు. మూల్యాంకనానికి 12వేల జవాబు పత్రాలు వచ్చాయి. సంస్కృతం సబ్జెక్టు జవాబు పత్రాలన్నీ ఇక్కడకు వచ్చాయి. ప్రకాశంజిల్లా సంస్కృతం పేపర్లు కూడా ఇక్కడే మూల్యాంకనం చేస్తారు. మూల్యాంకనం పక్కాగా నిర్వహించాలని, నిబంధనల మేరకు విద్యార్థులకు మార్కులు కేటాయించాలని డీఈవో కిరణ్‌కుమార్ కోరారు. మూల్యాంకనంలో తప్పులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతులు పొందే సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో జరిగింది. జడ్పీలో 46, ప్రభుత్వంలో మూడు, మునిసిపాలిటీల్లో 12, ఒంగోలు కార్పొరేషన్‌లో ఏడు కలిపి 68 పోస్టులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది.

రైతులకు పరిహారం చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి) : వైపాలెం నియోజకవర్గ పరిధిలోని గురిజేపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి నంటనునష్ట పర్చారని,బాధిత రైతులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. జిల్లా పరిషత్ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. బొప్పాయిపంటను ధ్వంసం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి మేలు చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ జాబితాలో 320 మంది పేర్లు లేవని, వాటిని పరిశీలించి ఆ పేర్లను జాబితాలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైపాలెం నుంచి ఒంగోలుకు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

రేపు డీఈఈ సెట్

ఒంగోలు విద్య, మే 31 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహిస్తున్న డీఈఈసెట్ పరీక్ష సోమవారం ఒంగోలులో జరుగుతుందని డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ఎస్‌సీసీఎస్‌ఏఐసంస్థలో, రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. 380 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

6 నుంచి మెగా డీఎస్సీ

ఒంగోలు విద్య, మే 31 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 6నుంచి 30 వరకు రోజూ రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుంది. పరీక్ష ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు జరుగుతుంది. జూన్ 30తో డీఎస్సీ పరీక్షలు ముగుస్తాయి. డిఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్ టిక్కెట్లు, వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచారు. సబ్జెక్టు, ఈడీఎం పోస్టువారీగా పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించారు.

4న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, సభలు

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించినందుకు నిరసనగా ఈనెల 4వతేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శిశాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ ర్యాలీల్లో ప్రజలు, రైతులు, మహిళలు, యువత వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటి వరకు మహిళలకు అన్యాయంచేసిన ప్రభుత్వం ప్రస్తుతం రైతులు అనేక ఇబ్బందుల్లో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు, కనిగిరి ఇన్‌చార్జిలు చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ, కేవీ రమణారెడ్డి, వేమా శ్రీనివాసరావు, దుంపా రమణమ్మ, మన్నం శ్రీధర్ తదితరులు ఉన్నారు.



వెన్నుపోటు దినం పోస్టర్‌ను అవిష్కరిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, మాజీమంత్రులు

పండుగలా రేషన్ సరుకుల పంపిణీ

నేటి నుంచి ప్రారంభం
ఏర్పాట్లు చేసిన అధికారులు


రేషన్‌దుకాణం(ఫైల్)

సంతనూతలపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): పండుగ వాతావరణంలో రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా వీధి చివరలో, రోడ్డు పక్కనో నిత్యావసర సరుకులను కార్డుదారులకు అందజేసింది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరి రేషన్ దుకాణాల ద్వారా ఈ నెల 1వ తేదీ నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించింది. రేషన్ గోడౌన్ నుంచి ప్రస్తుతం బియ్యం, పంచదార సరుకులను దుకాణాలకు చేరవేశారు.

ఈ-పోస్ మిషన్లు, తూకాలు సిద్ధం

ఈ-పోస్ మిషన్లు, తూకం పరికరాలను డీలర్లు సిద్ధం చేసుకున్నారు. ధరలు, నిల్వల పట్టిక అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని, అధికారులను సంప్రదించేందుకు ఫోన్ నెంబర్లను ప్రదర్శించాలని సూచనలు వచ్చాయి. రేషన్ దుకాణాల ద్వారా ఇకపై ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకుల పంపిణీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు కార్డుదారులకు అందుబాటులో ఉంటాయి. రేషన్ దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని 1న పూలతో అలంకరించాలని ప్రజాప్రతినిధులు, వయోవృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని అధికారులు చెప్పినట్లు సమాచారం.


గత శుక్రవారం కొండపిలో తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

తాగునీరు, బల్లలు ఏర్పాటు

రేషన్‌దుకాణల వద్ద లబ్ధిదారుల కోసం తాగునీరు, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయనున్నారు. 65 ఏళ్లు దాటిన వారు, దివ్యాంగులకు ఇళ్లకు ప్రతి నెలా 5వ తేదీలోగా రేషన్ సరుకులు అందజేయాలన్నది మార్గదర్శకం. వీరందరిని వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ-పోస్ మిషన్లలో సాంకేతిక సమస్యలు వస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అధికారులు చెబుతున్నారు. వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా, మాస్కులు ధరించేలా చైతన్యం చేయాలని డీలర్లుకు అవగాహన కల్పించారు.

రేషన్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పొన్నలూరు: గ్రామాల్లోని రేషన్ షాపుల వద్దనే కార్డుదారులకు సబ్సిడీ సరుకులను ఆదివారం నుంచి అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ వి.పుల్లారావు తెలిపారు. మండలంలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తామన్నారు. కార్డుదారులు నేరుగా దుకాణాల వద్దకు వచ్చి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి డాక్టర్ స్వామి
చిలంకూరులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ
జరుగుమల్లిలో మారిటైం బోర్డు చైర్మన్ సత్య
సంతనూతలపాడులో ఎమ్మెల్యే బీఎన్ చేతుల మీదుగా అందజేత

మర్రిపూడి, మే 31(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం చిలంకూరు గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా పింఛన్ సొమ్మును పెంచి ఇస్తున్నామని తెలిపారు. త్వరలో అమ్మకు వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఖరీఫ్ ఆరంభంలోనే అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి నిధులు అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పక్కాగృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా నియోజకవర్గంలో ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నాని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను మంజూరు చేయించిన టంగుటూరు-పొదిలి రహదారి పనులు పూర్తి చేయించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. అర్ధంతరంగా ఆగిపోయిన రహదారులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ జ్వాలా నరసింహం, ఎంపీడీవో జగదీష్, టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, చేరెడ్డి నర్సారెడ్డి, రేగుల వీరనారాయణ, తుళ్లూరు నరసింహారావు, గొంటు హనుమారెడ్డి, మాకినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పింఛన్ సొమ్మును అందజేస్తున్న సత్య


వృద్ధురాలికి పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఠంచన్‌గా పింఛన్లు : సత్య

జరుగుమల్లి: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి సీఎం చంద్రబాబు నాయుడు కట్టుబడి పింఛన్ నగదును పెంచి ఠంచన్‌గా ఇస్తున్నారని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఒకటో తేదీ సెలవు వస్తే ముందురోజే ఇస్తున్నారని చెప్పారు. జరుగుమల్లిలో శనివారం ఏర్పాటు చేసిన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో సత్య పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలో తొక్కి పింఛన్‌దారులను మోసం చేసిందని విమర్శించారు. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడుతున్నారని, ఆయనకు అండగా ప్రజలు నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రబాబు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో శనివారం ఉదయాన్నే ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ లబ్ధిదారుల ఇళ్లకు ఎన్టీఆర్ భరోసా రూ.4 వేల పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 1వ తేదీ లోపే పెన్షన్ నగదు లబ్ధిదారుల చేతుల్లోకి వెళ్లిపోతోందన్నారు. ఒకవేళ ఒకటో తేదీ ఆదివారం వస్తే ముందురోజే పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ లోని సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు రంపతోటి అంకారావు, తన్నీరు శ్రీను, ముప్పరాజు శ్రీను, చెరుకూరి శ్రీను, అంజయ్య పాల్గొన్నారు. కాగా మండలంలో శనివారం సాయంత్రానికి 91.35 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. 6,643 మందికి గాను 6068 మందికి సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు అందించినట్లు చెప్పారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం పింఛనుదారులకు అండగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. శనివారం కొలచనకోట, బసవన్నపాలెంలో ఆయన సామాజిక పెన్షన్లు అందజేశారు. వెల్లంపల్లి బీసీ కాలనీలో ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ ఇంటింటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండవ గోపీనాథ్, ఎంపీటీసీ అద్దేపల్లి భవాని, సర్పంచ్ మండవ శివానందరావు, మారెళ్ల హరికుమార్, దేవభక్తుని ప్రసాద్, పాటిబండ్ల అజయ్‌బాబు, చుండూరి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలం ప్రథమస్థానం

ఒంగోలు(రూరల్): జిల్లాలో జరిగిన పెన్షన్ల పంపిణీలో ఒంగోలు మండలం ప్రథమస్థానంలో నిలిచిందని ఎంపీడీవో రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీని ఆయన పలు గ్రామాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 3,715 మంది పింఛనుదారులు ఉండగా 92శాతం పైగా నగదును అందజేసినట్లు చెప్పారు. సోమవారం నాటికి పూర్తిస్థాయిలో అందజేస్తామన్నారు.


వెల్లంపల్లిలో పింఛను అందజేస్తున్న జయంత్‌బాబు, టీడీపీ నాయకులు


దేవరంపాడు ఎస్సీకాలనీలో పింఛను అందజేస్తున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

● తాలుకా సీఐ విజయకృష్ణ

ఒంగోలు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని తాలుకా సీఐ విజయకృష్ణ శనివారం హెచ్చరించారు. ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విధంగా ఇసుక తరలిస్తున్నవారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవడంతోపాటుగా వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న సమాచారం తెలిసినవారు 112 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

యోగాంధ్రలో భాగస్వాములు కావాలి

● ఎంపీ మాగుంట పిలుపు


పేరు నమోదు చేసుకుంటున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-25 మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పిలుపుచ్చారు. స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శనివారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో ఎంపీ మాగుంట తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారశాఖ ఉద్యోగికి వీడ్కోలు


ఇందిరాకుమారిని సత్కరిస్తున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): సమాచార శాఖలో 38 ఏళ్ళ పాటు టైపిస్టుగా విధులు నిర్వహించి శనివారం ఉద్యోగ విరమణ చేసిన ఒ.ఇందిరకుమారిని సమాచార, పౌర సంబంధాలశాఖ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. మార్కాపురం డివిజన్ కార్యాలయంతో పాటు ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో ఆమె విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలులోని జిల్లా సమాచారశాఖ కార్యాలయంలో ఇందిరకుమారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో వేణుగోపాల్, డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో దుర్గాప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు రమణమూర్తి, నారాయణ పాల్గొన్నారు.

ఒంగోలు పొగాకు వేలం కేంద్రం షెడ్యూల్

ఒంగోలు(రూరల్), మే31(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో ఏడవ రౌండ్‌లో పొగాకు రైతులు బ్యారన్‌కు నాలుగు బేళ్లు వంతున వేలానికి తీసుకురావాలని నిర్వాహక అధికారి జె.తులసి శనివారం తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన చీర్వానుప్పలపాడు, దొడ్డవరప్పాడు, వెంకటరాజుపాలెం, ఏడుగుండ్లపాడు, ఉలిచి, 3న టి.అగ్రహారం, వలేటివారిపాలెం, మద్దిరాలపాడు, 4న చేకూరపాడు, ఇనమనమెళ్లూరు, ఆలూరు, గాదెపాలెం, 5న దశరాజుపల్లి, గుడిమెళ్లపాడు, బొద్దులూరివారిపాలెం, దేవరంపాడు, కరవది, త్రోవగుంట, పానకాలపాలెం గ్రామాల రైతులు బేళ్లు వేలానికి తీసుకురావాలన్నారు. ప్రతి బేలు 150కేజీలు మించరాదన్నారు, రైతులు బోర్డు నిబంధనలు పాటించాలని కోరారు.

నిబద్ధత గల ఉద్యోగి హనుమంతరావు


ప్రసంగిస్తున్న మారుతిరావు, వేదికపై హనుమంతరావు

మద్దిపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): నిబద్ధత గల ఉద్యోగి పోతుల హనుమంతరావు అని పొగాకు బోర్డు విశ్రాంత మేనేజర్ మారెళ్ల మారుతీరావు పేర్కొన్నారు. చదలవాడలో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా పనిచేసిన పోతుల హనుమంతరావు ఉద్యోగ విరమణ సభ ఏడీ డాక్టర్ బసవశంకరం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మారుతీరావు మాట్లాడుతూ హనుమంతరావు సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. డిప్యూటీ డైరక్టర్ ఎ.రమేష్ మాట్లాడుతూ పోతుల హనుమంతరావు రైతులతో మమేకమై విస్తృత సేవలు అందించారని అభినందించారు. పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రవి మాట్లాడుతూ హనుమంతరావు ఎంతోమంది ఉద్యోగులకు ఆదర్శమని అన్నారు. అనంతరం హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ టీవీ.రమేష్‌బాబు, ఎం.కోటేశ్వరరావు, బి.ప్రభావతి, ఆర్.సుశీల, పి.వెంకట్రావు, పి.శ్రీనివాసరావు, కె.శంకర్రావు, ఏడీ వెంకట్రామిరెడ్డి, డాక్టర్ అనూరాధ, తొట్టెంపూడి వెంకటశేషయ్య, మండవ శివానందరావు, ఏడీ నాగభూషణం, మాజీ జేడీ రవీంద్రనాథ్‌ఠాగూర్, హనుమంతరావు బంధుమిత్రులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరధి పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా శనివారం ఒంగోలులో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పతుల వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఫ్లోరోసిస్ వైద్యాధికారి అనిల్, జిల్లా మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి శిద్దా వివాహ వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి, మే31 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల నిర్వహణ తమకు ఎంతో సంతృప్తిని ఇస్తున్నదని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతిల వివాహ వార్షికోత్సవం శనివారం చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబసభ్యులు, అభిమానుల సమక్షంలో శిద్దా దంపతులు భారీ కేక్‌ను కట్ చేశారు. తొలుత అర్చకులు శిద్దా కుటుం బసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విశేషపూజలు జరిపారు. తదుపరి పాటిమీదపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ, అనారోగ్యంతో బాధ పడుతున్న వృద్ధ మహిళలకు మందులు కొనుగోలు నిమిత్తం నగదు అందజేశారు. పేద మహిళలకు గృహనిర్మాణానికి సిమెంట్ బస్తాలు అందించారు. వృద్ధ బ్రాహ్మణ దంపతులకు వస్త్ర బహూకరణ తదితర కార్యక్రమాలను శిద్దా దంపతులు, యువపారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్‌ల చేతుల మీదుగా నిర్వహించారు. కార్యక్రమంలో గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరిబాబు, కాట్రగడ్డ రమణయ్య, మన్నం ప్రసాద్, బొమ్మిశెట్టి రవికిరణ్, గ్రానైట్ వ్యాపారులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో మహాలక్ష్మి సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్


మహాలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, హరిబాబు

నాగులుప్పలపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా యార్ల మహాలక్ష్మి ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఎంపీడీవో మహాలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మాన సభ శనివారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో తిరుమలశెట్టి రవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించిన ఉద్యోగికి ఎల్లప్పుడు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన మహాలక్ష్మి ఎంపీడీవోగా ప్రకాశం జిల్లాకు వచ్చారని, అనేక ప్రాంతాలలో పనిచేసి తన ఉద్యోగ బాధ్యతలు ఎంతో సమర్ధవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగికి సహజమని, విశ్రాంత జీవితం అనంతరం కుటుంబంతో సంతోషంగా, ఆయురారోగ్యాలతో గడపాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ జడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు మాట్లాడుతూ ఎంపీడీవో మహాలక్ష్మి సాటి ఉద్యోగులకు మార్గదర్శిగా నిలిచారన్నారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ మహాలక్ష్మి అంకితభావం, కార్యదీక్షతతో అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. అనంతరం ఎంపీడీవో మహాలక్ష్మి మోహన్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఈవోఆర్డీ మురళీ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

ఒంగోలు కల్చరల్, మే 31(ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ కృష్ణ 83వ జయంతిని సూపర్‌స్టార్ కృష్ణ కళాపరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కళాపరిషత్ అధ్యక్షుడు జాలాది మోహన్ అధ్యక్షత కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, నగర అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, చిత్రకారుడు తిమ్మిరి రవీంద్ర, తిమ్మిరి శిరీష, పెరిక ఇమ్మానుయేలు, కత్తుల వెంకటఆనందబాబు, డీవీ.సుబ్బారావు, మెత్తాళ్ల అభిషేక్, లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, డి.సందీప్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేంయ్య, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న కళాకారులు


మద్దిపాడులో రిటైర్డ్ ఉద్యోగుల నివాళులు

శివం ఫౌండేషన్‌లో..

స్థానిక అన్నవరప్పాడులోని శివం శరణాలయంలో కృష్ణ జయంతిని నిర్వహించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో కృష్ణ విగ్రహావిష్కరణ ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, మారెళ్ల సుబ్బారావు, ఉలిచి బాబూరావు, పాలేటి కోటేశ్వరరావు, మల్లవరపు శ్రీనివాసరావు, కావేటి వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్, కె.రాము, పి.శ్రీనివాసరావు, మల్లెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక నటరాజ్ కళాకేంద్రంలో కృష్ణ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో పీవీ.రాఘవరావు, షేక్ కలాం, నట్టే వెంకటసుబ్బారావు, జజ్జర శరత్‌బాబు, గంగిశెట్టి నరసింహారావు, గంట కోటేశ్వరరావు, కటకం వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, బడితల వెంకటేశ్వర్లు, రంకెల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు


పోలీసులను సత్కరించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖలో సుదీర్ఘ కాలం సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సురేష్, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పనిచేసిన హెడ్ కానిస్టేబుళ్ళు ఎ.వెంకటేశ్వరరావు, బీవీ.భాస్కర్‌రెడ్డి, కె.వెంకటరంగారావు, కేవీ.రంగారెడ్డి ఉద్యోగ విరమణ చేయగా వారిని శనివారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ దామోదర్ శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను ఆయన కొనయాడారు. ఎలాంటి సహకారం కావాలన్న పోలీస్ శాఖ అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐలు పాండురంగారావు, ప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరపతిస్వామి పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ సూచించారు. నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయ ముఖ ద్వారం వద్ద ఎంపీపీ నలమలపు అంజమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీజీ, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే, టంగుటూరి ప్రకాశంపంతులు, ఏకలవ్య, గురు సంత్‌రవిదాస్ తదితరుల విగ్రహాలను శనివారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే బీఎన్‌ను వైసీపీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి శాలువా కప్పి సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి, తెలగతోటి జాన్సన్, చాట్ల నారాయణ, ఏడుగుండ్ల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకోవాలి

కొండపి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, మతసామరస్యానికి మద్దతుగా ప్రజలు నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం పెరిదేపి ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో 'పహల్గాం ఉగ్రదాడులు-అనంతర పరిణామాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆంజనేయులు మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, ఆపార్టీ మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, ముప్పరాజు బ్రహ్మయ్య, ఎం.చినపేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య, పుట్టా రామారావు, గుమ్మళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రసాంకేతిక రంగాల్లో నైపుణ్యం పెంచుకోవాలి


బుచ్చయ్యచౌదరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రసాంకేతిక రంగాలలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని పీపుల్స్ ఎన్విరాన్మెంట్ మాసపత్రిక సంపాదకుడు పొత్తూరి నారాయణరావు, ప్రగతి మెడికల్స్ అధినేత ఇండ్లమూరి రామయ్య పేర్కొన్నారు. శనివారం ఆసరా ఆధ్వర్యంలో జరిగిన 9,10 తరగతుల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మారెళ్లగుంటపాలెం ఆసరా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మాజీ సర్పంచ్ బుచ్చయ్యచౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్, యు.ప్రకాష్‌రావు, ఎం.అన్నపూర్ణ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఒంగోలు(రూరల్), మే31(ఆంధ్రజ్యోతి): యోగాతో మంచి ఆరోగ్యం పొందవచ్చని వివేకానందా హఠయోగా కేంద్రం మాస్టర్ జి.హరిబాబు అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం యోగాపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు, ఏవో శేషుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

గిద్దలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని పలు దేవాలయాలలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానం, వీరాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణాలలో శనివారం ప్రత్యేక పూజల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రతిష్ఠ కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామి వారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా సాయంత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి వారి గ్రామోత్సవాన్ని కోలాట ప్రదర్శనల నడుమ నిర్వహించారు.

ఇంటికే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు


మార్కాపురంలో పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల, దోర్నాలలో పంపిణీ చేస్తున్న గూడూరి, పెద్దారవీడులో నగదు అందజేస్తున్న ఎంపీడీవో

ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో ఇంటికే ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శాంతి క్లినిక్ ఏరియాలో శనివారం పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు రెండు వీధుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పెంచిన పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4 వేల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. దాదాపు ఇంటికే వెళ్లే ప్రతి నెలా 1వ తేదీనే అందజేస్తున్నట్లు తెలిపారు. జూన్‌కు సంబంధించి 1వ తేదీ ఆదివారం వస్తున్నందున మే 31వ తేదీ శనివారం తెల్లవారేసరికి పింఛన్‌లు అందజేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలన్నీ ఒకొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, మాలపాటి వెంకటరెడ్డి, నాలి కొండయ్య, పఠాన్ ఇబ్రహీం, షేక్ మౌళాలి పాల్గొన్నారు.

పేదలకు అండగా

పెద్దారవీడు : ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ పేదలకు అండగా నిలుస్తుందని ఎంపీడీవో జాన్ సుందరం అన్నారు. మండలంలో శనివారం సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. దేవరాజుగట్టులో వృద్ధులకు ఆయనే పింఛన్‌లు పంపిణీ చేశారు. శివాపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, యువ నాయకులు ఆనెకాళ్ల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి పింఛన్లను పంపిణీ చేశారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెద్ద దోర్నాల : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. మండలంలోని ఐనముక్కల గ్రామం ఎస్సీ కాలనీలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆయన వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పేదల బాగు కోసం పథకాలను ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ అయితే, వాటిని మెరుగ్గా అమలు చేయడంలో చంద్రబాబు ఇతర రాష్ట్రాలకు ఆదర్శులయ్యారన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తున్నారన్నారు. జూన్‌లో విద్యాకానుక, అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఈవో శివ కోటేశ్వరరావు, సర్పంచి చిత్తూరి హారిక, టీడీపీ నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, షేక్ సమ్మద్ బాషా, ఈదర మల్లయ్య, షేక్ మంజూర్‌బాషా, చంటి, దేసునాగేంద్రబాబు, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, కటికల శ్రీనివాసులు, జంగిలి పిచ్చయ్య, చెంచయ్య పాల్గొన్నారు.


కృష్ణకు పింఛన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

నాలుగోసారి పింఛన్ డబ్బులు అందజేత

కంభం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన వాగ్దానం మేరకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గత 4 నెలలుగా కంభానికి చెందిన ఓ వృద్ధుడికి నెలకు రూ.4వేల చొప్పున పింఛన్‌ను అందచేస్తున్నారు. కంభం మండల టీడీపీ అధ్యక్షుడు తోట వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీ కంభంలో జరిగిన ప్రజాదర్బార్‌లో కంభం అర్బన్‌కాలనీకి చెందిన రాచపూటి కృష్ణ ఎమ్మెల్యేను కలిసి గత వైసీపీ తన వృద్ధాప్య పింఛన్‌ను తొలగించిందన్నారు. తనకు ఎవరూ లేరని, అనాథనని, నెలనెలా వచ్చే పింఛన్‌తోనే జీవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి నీకు పింఛన్ మంజూరయ్యేవరకూ తన సొంత డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చిన మేరకు వరుసగా నాలుగోనెల కూడా రూ.4వేలను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచి నడవడికతో ఉన్నతస్థితి

గిద్దలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : చిన్నప్పటి నుంచే మంచి నడవడికను అలవాటు చేసుకుంటే ఉన్నత స్థితిలో ఉంటారని సబ్‌జైలు ఎస్‌ఐ యు.లింగారెడ్డి అన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానంతోనే మెరుగైన జీవితాన్ని, అనుకున్న లక్ష్యాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి, ఫ్యాకల్టీలు నిత్యసాయి, సాయికుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామిరెడ్డి, యువప్రగతి పథం సంస్థ ప్రతినిధి ఫరూఖ్ పాల్గొని ప్రసంగించారు.

ఎంపీడీవో విజయలక్ష్మికి సన్మానం


ఎంపీడీవో విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఈవోఆర్డీ, సిబ్బంది

పొదిలి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ఎంపీడీవో ఈదర విజయలక్ష్మి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా ఈవోఆర్డీ శోభన్‌బాబు మాట్లాడుతూ విజయలక్ష్మి ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తించారన్నారు. సహచర అధికారులు, సిబ్బందిని కలుపుకుంటూ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం విజయలక్ష్మిని సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ వినతి

పెద్ద దోర్నాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్యశాలలో నీళ్ల సౌకర్యం, బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సంజీవ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ దోర్నాల మీదుగా శ్రీశైలం వెళ్తుండగా మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న సమస్యలను తెలియజేశారు. ప్రహరీగోడను నిర్మించాలన్నారు. చెంచు గిరిజన సంఘం కోఆర్డినేటర్ భూమని మంతన్న సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిని మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన శ్రీశైలం వెళ్లారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డాక్టర్ సూరిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, షేక్ సమ్మద్ భాషచంటి, షేక్ ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, జంగిలి పిచ్చయ్య,బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి, జనసేన అధ్యక్షులు కేతి మురళి, నాయకులు గుర్రం ప్రసాద్ పాల్గొన్నారు.

మనోజ్‌కుమార్‌ను సన్మానించిన డాక్టర్ మన్నె


రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మన్నె

ఎర్రగొండపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : యూపీఎస్సీ గ్రూప్ 1లో ఉత్తమ ఫలితాలు సాధించి గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం పొందిన పీ మనోజ్‌కుమార్‌ను రవీంద్ర వైద్యశాలలలో డాక్టరు మన్నె రవీంద్ర శనివారం సన్మానించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు, ఆమ్రాబాద్, మండలం మాచారం గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ సహాయ ఖనిజాల పరిశోధనాధికారిగా ఎంపిక అయ్యారని తెలిపారు. శనివారం ఎర్రగొండపాలెం రవీంద్ర ఆసుపత్రికి మనోజ్ వైద్యం కోసం రాగా డాక్టరు రవీంద్ర దుశ్శాలువా, పూలమాలవేసి అతడిని సన్మానించారు.

రమణీయం చెన్నయ్య కల్యాణం


చెన్నకేశవస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం శాంతి కల్యాణం రమణీయంగా, కనులపండువగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణం తిలకించారు. రాయలసీమ నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కల్పించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా నీలంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల


అమ్మవారికి పూజలు చేస్తున్న అన్నా రాంబాబు

తర్లుపాడు, మే 31 ఆంధ్రజ్యోతి: తర్లుపాడులో వెలసియున్న శ్రీనీలంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఓరుగంటి సాయి శ్రీరాం అమ్మవారికి ప్రాతఃకాల పూజ, ఆకు పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే అన్నావెంకటరాంబాబు, మార్కాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లకు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేటి నుంచి చౌక డిపోల వద్దే రేషన్

గిద్దలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండలంలో జూన్ 1వ తేదీ నుంచి చౌక డిపోల వద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 17 దుకాణాలతో పాటు మండలంలోని 53 రేషన్‌షాపుల పరిధిలో 23,472 రేషన్‌కార్డులు ఉన్నట్లు తెలిపారు. రేషన్ కార్డుదారులందరికీ బియ్యం, చక్కెర పంపిణీ చేసేందుకు వీలుగా సరుకులను తరలించినట్లు తెలిపారు. కార్డుదారులు తమకు దగ్గరలో ఉన్న ఏ రేషన్‌షాపులోనైనా సరుకులు పొందవచ్చని తహసీల్దార్ సూచించారు.

రేపు వైద్య శిబిరం

గిద్దలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఈనెల 2వ తేదీ సోమవారం ఉదయం 9గంటల నుంచి క్యాన్సర్ వ్యాధికి సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాలకు చెందిన ఉదయానంద ఆసుపత్రి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల క్యాన్సర్ వ్యాధులను పరీక్షించేందుకు స్పెషలిస్టు డాక్టర్లు వస్తున్నందున ఈప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉచిత ఓపీ కోసం 9705958656 పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

అర్హులకు కౌలు కార్డులు

పొదిలి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పంటసాగు చేసే ప్రతి రైతు కౌలుకార్డులను పొందాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ, గ్రామ వ్యవసాయ సహాయకులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఉన్న 32 రెవెన్యూ గ్రామాలలో కౌలు రైతులకు అర్హత కార్డులు ఇవ్వాలని ప్రభుత్వ కౌలుదారుల చట్టం 2019 ద్వారా నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా వీఆర్వో, వీఆర్‌ఏలకు కౌలుకార్డు నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. కౌలుకార్డుల మంజూరులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అర్హులైన వారికి మాత్రమే కౌలుకార్డులు అందేలా చూడాలన్నారు. కౌలుకార్డు పొందిన రైతుకు కార్డు 11 నెలలు మాత్రమే అర్హత కలిగి ఉంటుందన్నారు. కౌలుకార్డు వలన కౌలుదారులకు భూమిపై ఎలాంటి హక్కులు ఉండవన్నారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలకు మాత్రమే కౌలుకార్డు ఉపయోగపడుతుందన్నారు. కనుక కౌలుకార్డు వలన పలురకాల ప్రయోజనాలు ఉంటయాన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్ జైన్‌లాబ్దీన్ పాల్గొన్నారు.

అతివేగమే ప్రమాదాలకు కారణం


మాట్లాడుతున్న సీఐ రామకోటయ్య

కొమరోలు, మే 31 (ఆంధ్రజ్యోతి) : అతివేగం ప్రమాదాలకు కారణమని గిద్దలూరు సీఐ రామకోటయ్య అన్నారు. పోలీసు స్టేషన్‌ను శనివారం సీఐ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరోలు మండలంలో ఇటీవల రెండు రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారని, ఆ ప్రమాదాలకు అతివేగమే ప్రధానకారణమని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ నాగరాజును ఆదేశించారు. గిద్దలూరు సర్కిల్ పరిధిలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలో దొంగతనాలు, సైబర్ నేరాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొమరోలు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారిలో ప్రైవేటు ట్రావెల్స్ ఆగివుండడంతో ట్రాఫిక్ నిలిచిపోతుందని, వారితో మాట్లాడి వేరే ప్రదేశంలో ఆ బస్సులను నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సైకి తెలిపారు. స్టేషన్‌లో సిబ్బంది తక్కువగా ఉండడంతో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ఇబ్బందులు ఉన్నాయని వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.


యోగా ర్యాలీని నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి, వీవోఏలు, సిబ్బంది

యోగాతో ఆరోగ్యం..ఆనందం


యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

కంభం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే ప్రతి రోజు యోగా చేయాలని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. కంభం జూనియర్ కళాశాల ఆవరణలో యోగా చేస్తున్న ఉద్యోగులతో ఎంపీడీవో మాట్లాడుతూ యోగా వలన శారీర దృఢత్వం, ఆరోగ్యం ఉంటుందన్నారు.

మార్కాపురం రూరల్ : యోగాతో ఆరోగ్యంతోపాటు ఆనందంగా ఉం డవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో ఏవో భాగ్యవతి అన్నారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్వాక్రా బజార్ నుంచి వీవోఏలతో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొని తమ పరిసర ప్రాంతాల వారికి కూడా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, వెలుగు ఎల్‌సీ నాగభూషణం, సీసీ నాగయ్య, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : యోగాతో శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందని యోగా సాధకులు రామకృష్ణ అన్నారు. స్థానిక రెయిన్‌బో అకాడమీలో శనివారం విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. యోగా సాధన, ప్రాణాయామం వలన పిల్లలలో అనేక రోగాల భారీ నుంచి కాపాడుకోవచ్చని అన్నారు. యోగా ద్వారా మంచి తెలివితేటలు, జ్ఞాపకశక్తి, సత్వ, రజో, తమో గుణాలను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెయిన్‌బో అకాడమీ డైరెక్టర్ కొండవీటి విశ్వనాథ శర్మ, పర్యవేక్షకులు మీనాక్షి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. జూన్ 1 నుంచి 21 వరకు యోగా సాధన క్లాసులు పూర్తి ఉచితంగా నిర్వహిస్తామని ఆసక్తి గల వారు 9347161143, 9493267484 నెంబర్లను సంప్రదించాలని డైరెక్టర్ విశ్వనాథ శర్మ తెలిపారు.

రేపు కిసాన్ మోర్చా సమావేశం


మాట్లాడుతున్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణ

మార్కాపురం వన్‌టౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి) : కిసాన్ మోర్చా జిల్లా సమావేశం జూన్ 2వ తేదీ ఒంగోలులో జరుగుతుందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ తెలిపారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగే జిల్లా కార్యవర్గ సమావేశానికి కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి సురేశ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామి హాజరవుతారని తెలిపారు. కిసాన్ మోర్చాను గ్రామస్థాయి నుంచి పటిష్ఠ పరచడం, నూతన కమిటీల ఏర్పాటు, రైతుల సమస్యలపై దృష్టి, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు ప్రణాళికలు ఉంటాయాన్నరు. నాయకులు కృష్ణారావు, సరోజిని, చెన్నయ్య, సతీష్ పాల్గొన్నారు.

గిద్దలూరు : మార్కాపురంలోని వివేకానంద విద్యాపీఠం ఆవరణలో ఈనెల 2వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కిసాన్ మోర్చా జిల్లా, రాష్ట్ర నాయకులు హాజరు కానున్నందున సమావేశానికి బీజేపీ, కిసాన్ మోర్చా, ఇతర అనుబంధ సంఘాల ముఖ్యనాయకులందరూ హాజరు కావాలని కోరారు.

సినిమా హాళ్ల తనిఖీ


సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

గిద్దలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమా థియేటర్లు, ఎల్పీజీ గ్యాస్ గోడౌన్‌లు, టపాసుల దుకాణాలు, రైస్ మిల్లులు, ఆర్వో ప్లాంటను వివిధ శాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సినిమా థియేటర్లలో ఎమ్మార్పీ ధరలకు మించి తినుబండారాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రామనారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సాల్మన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్‌లు పంపిణీ

ఎర్రగొండపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) మండలంలో శనివారం 94 శాతం వృద్ధులకు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారని ఎంపీడీవో బీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మిగిలిన 6శాతం పింఛన్‌లు ఆదివారం పంపిణీ చేస్తారని తెలిపారు.

ఫ్రాంక్లిన్‌కు నివాళి

కంభం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల ఉద్యమంలో పశ్చిమ ప్రకాశంలో కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వానికి ఎదిగిన జంగంగుంట్లకు చెందిన జిల్లా మాజీ అధ్యక్షుడు పులుగుజ్జు ఫ్రాంక్లిన్ అనారోగ్యంతో మరణించడం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరనిలోటని ఉసురుపాటి బ్రహ్మయ్య తెలిపారు. శనివారం ఉదయం జంగంగుంట్లలో ఆయన మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో శాలెంరాజు మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పొడిచెర్ల రాజు, నేదురుమల్లి జయరాజ్, ఆంజనేయులు, భాస్కర్, కంభం భాస్కర్, థామస్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కంభం, మే 31 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం అర్ధవీడులో జరిగినట్లు ఎస్‌ఐ సుదర్శన్‌యాదవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. అర్ధవీడు గ్రామానికి చెందిన సయ్యద్ మహబూబ్‌వలి (39) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. మహబూబ్‌వలికి 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్య జుమ్మాబీ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్‌యాదవ్ తెలిపారు.



నేరేడుపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి పానకాలరావు

పీసీపల్లిలో 89 శాతం పింఛన్ల పంపిణీ

పీసీపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ మండలంలో 89శాతం పూర్తయింది. ప్రతినెలా ఒకటో తేదీ పంపిణీ చేస్తున్న పింఛన్లు ఆదివారం కావడంతో శనివారమే పంపిణీ చేశారు. మండలంలో 4,679మంది వివిధ రకాల పింఛన్‌లు పొందే లబ్ధిదారులు ఉన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి 4,148మందికి పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన 11శాతం మందికి సోమవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. నేరేడుపల్లిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పానకాలరావు పాల్గొన్నారు.

పామూరులో..

పామూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. బొట్లగూడూరులో జరిగిన కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సర్పంచ్ వై.బాల, పార్టీ గ్రామ అధ్యక్షుడు కోటపాటి వెంకటేశ్వర్లు, కంబాలదిన్నె గ్రామంలో మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య, పామూరు పట్టణంలో మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, షేక్ ఖాజారహంతుల్లా, షేక్ హజీగౌస్, బండ్ల నారాయణతో పాటు వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవో బదిలీ

పీసీపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ఒ.ప్రభాకరశర్మ కనిగిరికి బదిలీ అయ్యారు. ఈమేరకు జడ్పీ సీఈవో కార్యాలయం నుంచి పీసీపల్లి ఎంపీడీవో కార్యాలయానికి ఉత్తర్వు కాపీలు పంపించారు. ప్రభాకరశర్మ సోమవారం ఇక్కడ రిలీవ్ కానున్నారని కార్యాలయ సిబ్బంది తెలిపారు. హెచ్ఎంపాడు మండలంలో అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హనుమంతరావుకు ఎఫ్ఏసీతో పీసీపల్లి ఎంపీడీవోగా నియమించారు.

విద్యుదాఘాతంతో రూ.3 లక్షల ఆస్తి నష్టం

తాళ్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపురం యానాదికుంట వీధిలోని నల్లపాటి చంద్రశేఖర్‌రావుకు చెందిన బంక్ శనివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. మధ్యాహ్నం సమయంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఒకసారిగా మంటలు వ్యాపించారు. మంటలను గమనించి ఆర్పేందుకు యత్నించినా పూర్తిగా కాలిపోయింది. బంక్‌లో ఉన్న ఫ్రిజ్, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బంక్ యజమాని చంద్రశేఖర్ వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండా లని ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథి పేర్కొ న్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సంద ర్భంగా శనివారం ఒంగోలులో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పతుల వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్రజ లకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సి పాల్ డాక్టర్ సుధాకర్, ఫ్లోరోసిస్ వైద్యాధికారి అనిల్, జిల్లా మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

కొండపి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి వ్యతిరేకంగా, మతసామరస్యానికి మద్దతుగా ప్రజలు నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం పెరిదేపి ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో 'పహల్గాం ఉగ్రదాడులు-అనంతర పరిణామాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆంజనేయులు మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, ఆపార్టీ మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, ముప్పరాజు బ్రహ్మయ్య, ఎం.చినపేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య, పుట్టా రామారావు, గుమ్మళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాసోత్సవాల్లో భాగస్వాములు కావాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-25 మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పాత జిల్లాపరిషత్ సమావేశపు హాలులో శనివారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో ఎంపీ మాగుంట తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, సెట్ప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం

» పొలం పనుల్లో రైతులు బిజీ బిజీ

దొనకొండ, మే 31(ఆంధ్రజ్యోతి): ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. తొలకరి వర్షాలు కురుస్తూ సాగుకు అనుకూలంకావటంతో రైతులు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేసుకునే పనిలో బిజీ అయ్యారు. ఇందుకోసం ట్రాక్టర్లతో దుక్కులు దున్నుకుంటూ మరోగట్టి వర్షం కురిస్తే విత్తనం వేయాలనే ఆలోచనలో ఉన్నారు. గత ఏడాది ఆశించిన మేర దిగుబడి, గిట్టుబాటు ధరలేక రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. ఈఏడాదైనా ఆశాజనకంగా ఉంటుందనే నమ్మకంతో సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో రెండువేల హెక్టార్లలో పత్తి, మూడువేల హెక్టార్లలో కంది, 300 హెక్టార్లలో ఆముదం, 200 హెక్టార్లలో వరి, 120 హెక్టార్లలో సజ్జ సాగు చేయనున్నారు. వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఏ పంటలు సాగు చేయాలి, ఎంత మోతాదులో ఎరువు వాడాలో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తనాల ఎంపికలో రైతులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎరువుల దుకాణాల్లో ఏదికొన్నా రసీదు తీసుకొని భద్రపర్చుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.



ఎస్ఎస్‌పల్లి గ్రామంలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, మే 31(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలేవీ! శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దర్శి-అద్దంకి రోడ్డులోని 340/5 సర్వే నెంబర్‌లో గల ప్రభుత్వభూమిని కొంతమంది ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిటాల శ్రీనివాసరావు సిబ్బందితో వెళ్లి అక్కడ నిర్మించిన టాయిలెట్‌ను తొలగించారు. మిగిలిన స్థలంలోని నాపరాళ్లను తొలగించారు.



దర్శి -అద్దంకి రోడ్డులో తొలగిస్తున్న ప్రభుత్వ స్థలంలోని నిర్మాణం

బండిదారి ఆక్రమణ గురించి పట్టించుకోని అధికారులు

దర్శి-అద్దంకి రోడ్డులో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించిన అధికారులు కురిచేడు రోడ్డులోని బండిదారి ఆక్రమణల గురించి పట్టించుకోలేదు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంలో దర్శి పట్టణంలో ఆక్రమణలకు గురైన అనేక స్థలాల గురించి వివరించగా, ఒకచోట మాత్రమే అధికారులు చర్యలు తీసుకొని మిగిలినవాటి గురించి పట్టించుకోలేదు. దర్శి-కురిచేడు రోడ్డులోని బండిదారి భూమిలో సుమారు ఐదు ఎకరాలు ఆక్రమించిన విషయం తెలిసిందే. గతంలో బండి స్థలం ఆక్రమణ తొలగింపునకు మార్కింగ్ కూడా ఇచ్చారు ఆతర్వాత ఏకారణం చేతనో వదిలేశారు. దర్శి రెవెన్యూలోని 244, 247, 248, 266 సర్వే నెంబర్లల్లో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉన్న విషయం తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికశాతం భూమిని ఆక్రమించి గృహాలు నిర్మించారు. మరికొందరు గొడౌన్‌లు కట్టుకున్నారు. నాటి పాలకులు ఆక్రమణల గురించి పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కుల భరతం పడతారని అందరూ భావించారు. అయితే, అధికారులు పూర్తిస్థాయిలో స్పందించటంలేదు, పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే తాత్కాలిక చర్యలు చేపట్టి ఆతర్వాత వదిలేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులకు భయం లేకుండాపోయింది. ఇప్పటికైన అధికారులు స్పందించి దర్శిలోని అనేక ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని శివరాంపురం గ్రామంలో పలువురికి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్ సహకారంతో దర్శి నియోజక అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్టు చెప్పారు.



ముండ్లమూరులో కార్డుదారులకు రేషన్ సరుకులు అందజేస్తున్న డాక్టర్ లక్ష్మి

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. తాళ్లూరు వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద సబ్సిడీపై మంజూరయిన వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. పలు గ్రామాల రైతులకు రూ.8కోట్ల 30లక్షల విలువైన 18సబ్సిడీ యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, బి.ఓబుల్ రెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పేదలు సద్విని యోగ పరుచుకొని అభివృద్ధి చెందాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శనివారం ముండ్లమూరులో రేషన్ షాపులను సందర్శించి నిత్యావసర సరుకులను కార్డుదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు అందాల్సిన నిత్యావసర సరుకులు పక్కదారి పట్టాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రుల కమిటీతో అధ్యయనం చేసి గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న పాత పద్ధతిని ప్రవేశపెట్టినట్టు చెప్పారు. రేషన్ షాపు డీలర్లు అక్రమాలకు పాల్పడకుండా కార్డుదారులకే సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లయితే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పలువురు వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి, డీలర్ వీరపనేని నాగేశ్వరరావు, మండల రేషన్ షాపుల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగసూరి సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

దర్శి, మే 31(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని 20వ వార్డులో శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచి క్రమం తప్పకుండా ఒకటో తేదీనే అందిస్తున్నట్టు చెప్పారు. కొన్ని సమయాల్లో 1వ తేది ఆదివారం వచ్చిన సందర్భాల్లో ముందురోజే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈనెలలో కూడా ఒక రోజు ముందుగానే పింఛన్లు అందిస్తుండటంతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందన్నారు. వృద్ధులకు పింఛన్లు అందుతుండటంతో వారి కుటుంబసభ్యులు గౌరవంతో చూస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి ఉద్దండులైన పారిశ్రామిక వేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెడుతున్నారన్నారు. దీనిని వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారానికి తెర తీశారన్నారు. ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకుల తీరు మారకుంటే భవిష్యత్తులో పుట్టగతులుండవని స్పష్టం చేశారు.



దర్శిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, తదితరులు

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు యాదగిరి వాసు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

పీసీపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యం పొందడంతో పాటు ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం యోగాంధ్రలో భాగంగా ఆసనాలు సాధన చేశారు. యోగాసనాలు వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు యోగాసనాలు చయడం వల్ల ఎన్నో రుగ్మతల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, ఏపీవో జహంగీర్ బాషా, ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవి, ట్రైనర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.



పీసీపల్లిలో యోగాసన శిక్షణలో పాల్గొన్న ఉద్యోగులు

యోగాతో మానసిక ప్రశాంతత

పామూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా మనస్సు ప్రశాంతత చేకూరుతుందని డాక్టర్ గద్దె ఏడుకొండలు సూచించారు. స్థానిక గ్రామ సచివాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం యోగాసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, జీవీ అరవిందారెడ్డి, కేఎల్ శ్రీనివాసరావు, జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు మల్లికార్జునరాజు

» ఎంఈవో జె.ప్రసాదరావు

సీఎస్‌పురం(పామూరు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిని ఉద్యోగంగా కాకుండా పాఠశాలను దైవంగా భావించి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఆదర్శప్రాయుడు గుంటిమడుగు మల్లికార్జునరాజు అని ఎంఈవో జె.ప్రసాదరావు కొనియాడారు. సీఎస్‌పురం మండలంలోని రెడ్డిగారిపల్లి పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసిన గుంటిమడుగు మల్లికార్జున రాజు దంపతులకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. 38 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి విద్యాబుద్ధులు నేర్పినవారిలో మల్లికార్జునరాజు మొదటి వరుసలో ఉంటారని ఎంఈవో కొనియాడారు.

కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, అంబాల చినవెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ జి.శ్రీనివాసులు, అంబాల చంద్రశేఖర్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, నాగార్జున, నారాయణ, ఉపాధ్యాయులు పటాన్ నాయబ్‌రసూల్, వెంకటసుజాత, బి.శివప్రసాదచారి, పి.మాల కొండయ్య, సీహెచ్ సునీత, ఎలికా శ్రీనివాసులు, యోగి రాములు, ఖాజా హుసేన్, ఖాజా రహంతుల్లా, మస్తాన్‌వలి, చెన్నయ్య, జి.పుల్లయ్య, కె.రామసుబ్బారావు, కె.రవీంద్రనాథ్, ముప్పాళ్ల ప్రసాద్, మల్లికార్జున, పెంచల నరసయ్య, సీఆర్పీ శివ, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



గుంటిమడుగు మల్లికార్జునరాజు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రైతులకు మట్టినమూనా పత్రాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

లోదుక్కులు చేపట్టాలి

దొనకొండ, మే 31(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు సిద్ధమైన రైతులు ముందుగా పొలాల్లో లోదుక్కులు చేపట్టాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. దీనివల్ల భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని చెప్పారు. మండలంలోని కొచ్చెర్లకోట, పుల్లాయిపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం ప్రీఖరీఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేయూతగా అందించే పథకాల గురించి వివరించారు. పశుసంవర్ధకశాఖ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ షణ్ముగం మాట్లాడుతూ పశువుల్లో సీజనల్‌లో వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం రైతులకు మట్టి నమూనా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే నోడల్ ఆఫీసర్ కె.సంధ్యారాణి, జీసీహెచ్ నారాయణ, రమేష్‌దాస్, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), మే 31 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలో వెలసిఉన్న రాచూరి పెద్దమ్మ తల్లి తిరునాళ్ల వేడుకల్లో భాగంగా శనివారం శ్రీవెంకటేశ్వరస్వామి జలధి ఉత్సవం, పూజ, పొంగళ్ల కార్యక్రమాలను ఘనంగా జరుపుకొన్నారు. తిరునాళ్ల సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వర దేవస్థానం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో రాచూరి పెద్దమ్మతల్లి ఆలయం

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

పామూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో జూన్ 5 నుంచి 13వరకు జరిగే శ్రీమదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, ఎస్వీ నారాయణ, మన్నం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఐ ధర్నా



పామూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పామూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై జూన్ 2న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి అన్నారు. ఇందుకుసంబంధించి శనివారం స్థానిక జీవైఆర్ భవనంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. అలాగే, లబ్ధిదారులకు రూ.5 లక్షలు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల కార్యదర్శి పోతుల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

టీబీరహిత పంచాయతీలుగా బొద్దికూరపాడు, లక్కవరం



జేసీ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న బొద్దికూరపాడు సర్పంచ్ శ్యాంసన్

తాళ్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ నిర్వహించిన సర్వే ఆధారంగా క్షయవ్యాధి విముక్తి గ్రామాలుగా మండలంలోని బొద్దికూరపాడు, లక్కవరం గ్రామపంచాయతీలను గుర్తించారు. ఎలాంటి టీబీ కేసులు లేనట్లుగా గుర్తించారు. ఒంగోలులో నిర్వహించిన టీబీముక్తభారత్ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మందా శ్యాంసన్, నన్నం వరలక్ష్మికి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ టీబీ ముక్త భారత్ అభియాన్ కింద అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్‌లను వార్డు సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

పీసీపల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు గాయపడిన ఘటన మండలంలోని చినవరిమడుగులో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చినవరిమడుగు గ్రామంలో ఆర్డీఎస్ఎస్ వర్క్‌ల్లో భాగంగా కొత్తలైను వేస్తున్నారు. పనులు జరుగుతున్న క్రమంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే వైరు తగలడంతో షాకిమ్ అనే యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. కనిగిరి వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు

ఉష్ణోగ్రత (అంచనా)


1-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	28
తెనాలి	40	28
నరసరావుపేట	41	28
బాపట్ల	40	28
రెంటచింతల	40	28
చీరాల	40	28



ఓ తండ్రి తన కొడుక్కి.. పక్కింటి కుర్రాడి కంటే ఖరీదైన బైక్ కొనిచ్చాడు. ఆ కుర్రాడి కంటే మార్కులు తక్కువ వచ్చినప్పుడు.. 'వాడి కంటే మంచి బైక్ కొనిచ్చాను. ఎక్కువ మార్కులు ఎందుకు రాలేదు..' అని కొడుకుపై తిట్ల పురాణం ఎత్తుకున్నాడు. కానీ, బైక్‌కు, మార్కులకు ఉన్న సంబంధం ఏంటో గుర్తించలేక పోయాడు.

పిల్లల మనసు తెల్లకాగితం లాంటిది. దాని మీద ఏమి రాస్తే.. అదే వారి జీవితం అవుతుంది. రాసేది ఎప్పటికీ చెరిగిపోకుండా.. మంచి పెన్నుతో ఒకేసారి రాయండి. అంతేగాని కావాల్సినప్పుడల్లా చెరిపివేసే పెన్సిల్‌తో రాయకండి.

- రూసో, ఫ్రెంచి తత్వవేత్త(1712-1798)



sunday special

పోలికలే పసి ప్రాయానికి ప్రమాదం

- పిల్లలపై పెరుగుతున్న తల్లిదండ్రుల ఒత్తిడి
- స్పష్టతలేని లక్ష్యాల వేటలో చిన్నారులకు శిక్షణ
- మానసిక వేదనలో కౌమారం
- ఆరోగ్యంపై పడుతున్న ప్రభావం

పెంపకంలో పెరుగుతున్న వ్యత్యాసాలు

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అంతర్జాతీయ స్థాయిలో రాణించి, ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు సాధించింది. ఆమెను స్ఫూర్తి పొందిన చాలా మంది తల్లిదండ్రులు వెంటనే తమ పిల్లలను బ్యాడ్మింటన్ అకాడమీల్లో చేర్పించారు. సమయం కుదరకో.. ఇతర ఇబ్బందుల వల్లనో నాలుగైదు నెలల తరువాత కొంతమంది ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ఇటీవల ఐపీఎల్‌లో 14 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవన్షి రాజస్థాన్ రాయల్స్ తరపును ఎంట్రీ ఇవ్వడంతో.. మరికొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్ అకాడమీలకు శిక్షణ కోసం పంపిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), మే 31 (ఆంధ్రజ్యోతి): ఇతరుల పిల్లలు చదువు, క్రీడలు తదితర రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిస్తే.. తమ పిల్లలను కూడా అదే స్థాయిలో చూసుకోవాలని చాలామంది తల్లిదండ్రులు భావిస్తారు. వారిని స్ఫూర్తి పొంది ఆయా రంగాల్లో రాణించాలని తమ చిన్నారులకు కొత్త మార్గాలను నిర్దేశిస్తుంటారు. కొంతకాలానికి మరో చోట ఎవరో ఏదో సాధిస్తే.. మీరు కూడా అది నేర్చుకోవాలంటూ అందులో శిక్షణ ఇప్పిస్తుంటారు. తల్లిదండ్రుల ఈ ఆలోచనా ధోరణే.. ప్రస్తుత తరాన్ని గందరగోళంలోకి నెట్టేస్తోంది. తమను ఎలా చూసుకోవాలని అమ్మ నాన్నలు అనుకుంటున్నారో అర్థం కాక.. పసి వయసులోనే.. మానసిక వేదనకు (మిగతా 8వ పేజీలో)

కాల్వలకు కాసులు

ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక.. తూటికాడ, నాచుతో నిండిపోయి.. సాగునీరు పారుదలకు అవకాశం లేక అధ్వానంగా మారిన కాల్వలకు మోక్షం కలిగింది. ముందస్తు రుతు పవనాలతో వర్షాలు పడుతుండగా.. పదునెక్కిన పొలాలను రైతులు సాగుకు సిద్ధం చేస్తుండగా.. సాగునీటికి దిగులు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కాల్వల మరమ్మతులకు నిధులు కేటాయించింది. సాగునీటి కాల్వల దుస్థితిపై సమగ్రంగా అవగాహన ఉన్న సాగునీటి సంఘాలకే నిర్వహణ, మరమ్మతులు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాగునీటి సంఘాలు ముందుకు రాని ప్రాంతాల్లో స్వల్పకాలిక టెండర్లు నిర్వహించి కాల్వల మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆయా మరమ్మతు పనులు సత్వరం చేపట్టాలని రైతు లు కోరుతున్నారు. మరమ్మతు పనులు సక్రమంగా.. సమగ్రంగా జరిగితే ఆయకట్టులోని చివరి భూములకు కూడా పుష్కలంగా సాగునీరు అందే అవకాశం ఉంటుంది. మరి పనులు ఏవిధంగా జరుగుతాయో చూడాలి.

- ఎట్టకేలకు మరమ్మతులకు మోక్షం
- సాగర్ పరిధిలో 801 పనులు గుర్తింపు
- రూ.37.44 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- సాగునీటి సంఘాలకు పనులు కేటాయిస్తూ ఆదేశాలు
- సంఘాలు ముందుకు రాని చోట స్వల్పకాలిక టెండర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నరసరావుపేట : ఇది మైనర్ కాలువే.. కాల్వ కనిపించనంతగా పెరిగిన జమ్ము

(నరసరావుపేట, బాపట్ల - ఆంధ్రజ్యోతి)

అధ్వానంగా ఉన్న సాగర్ కాల్వల బాగుకు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది. 'కాసుల పారుదల కనిపించడం లేదు' అనే శీర్షికతో కాల్వల అధ్వాన స్థితిపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై ప్రభుత్వం స్పందించింది. రూ.37.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. జల వనరుల శాఖ గుర్తించిన 801 అత్యవసర పనులు చేపట్టేందుకు అధికారులు (మిగతా 8వ పేజీలో)

ఈ పనులు చేపట్టాలి..

- కాల్వల్లో ఐదేళ్లుగా పెరిగిన కంప చెట్లను, అల్లుకుపోయిన జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలను తొలగించాలి.
- పగిలిపోయి దెబ్బతిన్న డ్రాపులు, షట్టర్లకు మరమ్మతులు చేయాలి.
- షట్టర్లు లేక పోవడంతో సాగునీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. వృథాను అరికట్టేందుకు షటర్ల ఏర్పాటు తక్షణావసరం.



తరగతి మారదా?

- గుంటూరులోని కేవీపీ కాలనీలోని కొల్లిశారదా మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్ దుస్థితి

- మరో పది రోజుల్లో బడులు ప్రారంభం
- పాఠశాలల్లో అసంపూర్తిగానే నిర్మాణాలు
- అరకొర పనులతో గతేడాది విద్యార్థులకు ఇక్కట్లు
- ఈ ఏడాదీ గదుల కొరతతో ఇబ్బందులు
- తప్పేలా లేవని ఆందోళన
- వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని ఉపాధ్యాయుల ఆవేదన

గుంటూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి): మరో పది రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. అయితే గత ఏడాది గదులు కొరత.. పాఠశాల ఆవరణలో నిర్మాణ సామగ్రితో.. విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా నిర్మాణాలు పూర్తి చేసుకుని గదుల కొరత తీరి సాఫీగా బోధన జరుగుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురైంది. ఈ ఏడు కూడా (మిగతా 8వ పేజీలో)

నిలిచిన కంటి వైద్య పరీక్షలు

- ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్న పేదలు

అద్దంకి, మే 31 (ఆంధ్రజ్యోతి): పేదలకు కంటి వైద్యం దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గతంలో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో వైద్యపరీక్షలు చేశారు. సీహెచ్‌సీలలో గతంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల అద్దాలు అందజేసేవారు. అయితే గత ఏడాది సెప్టెంబరులో అపోలో సంస్థ గడువు ముగియడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో కంటి పరీక్షలకు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించాల్సి వచ్చింది. కొన్ని చోట్ల ఆప్తమాలమిక్ అధికారులు అందుబాటులో ఉన్న చోట మాత్రం మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. అత్యధిక శాతం సీహెచ్‌సీలో కంటి పరీక్షలు నిర్వహించడం లేదు. జిల్లాలో అద్దంకి, మార్టూరు, పర్చూరు, నగరం, కూచినపూడి, వేమూరు, పిట్టలవానిపాలెం, నిజాంపట్నంలలో సీహెచ్‌సీల్లో గతంలో కంటి పరీక్షలు నిర్వహించేవారు. పరీక్షలు తర్వాత నివేదికల ఆధారంగా 15 రోజుల నుంచి నెల రోజుల లోపు కళ్లజోళ్లు అందేవి. దీంతో పేదలకు ఎలాంటి ఖర్చు లేకుండానే కంటి పరీక్షలతో పాటు అద్దాలు లభించేవి. ప్రస్తుతం ప్రైవేట్ వైద్యశాలలను ఆ శ్రయించి పేదలు వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. దీంతో పలువురు పేద కుటుంబాలు కంటిచూపు తగ్గినా ఎలాంటి పరీక్షలు చేయించుకోకుండా మిన్నకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి గతంలో వలే అన్ని సీహెచ్‌సీలలో కంటి పరీక్షలు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అద్దంకి సిహెచ్‌సీలో ఫ్లెక్సీ కే పరిమితమైన సదరం క్యాంప్


సదరం పరీక్షలకు కష్టాలే...

గతంలో సదరం పరీక్షలు సీహెచ్‌సీలలో నిర్దేశించిన తేదీలలో జరిగేవి. ఆయా తేదీల్లో ఇతర ప్రాంతాల నుంచి వైద్యులు వచ్చి స్లాట్‌లు బుక్ చేసుకున్న అంగవైకల్యం ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే వారు. అయితే ప్రస్తుతం కొన్ని వైద్యశాలలకు మాత్రమే ఆ సేవలను పరిమితం చేశారు. దీంతో సదరం పరీక్షల కోసం దూరప్రాంతం వెళ్లాల్సి వస్తోంది.

యోగా సాధనతో ఆరోగ్యం

కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగా సాధన వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, అందరూ యోగా సాధన చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. శనివారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో యోగా కార్యక్రమం జరిగింది. తొలుత యోగా గురువు పతంజలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన కలెక్టర్ అందరితో కలిసి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పూర్వీకులు, మహర్షులు వేల సంవత్సరాల క్రితం యోగాను అభివృద్ధి చేసి ఒక పరంపరగా ప్రపంచానికి అందించారన్నారు. ఆరోగ్యాన్ని, జీవనశైలిని మెరుగుపర్చుకోవడానికి యోగాను అలవర్చుకోవాలన్నారు. క్యాన్సర్, బీపీ, షుగర్, గుండెజబ్బులు, కీళ్లనొప్పులు, వెన్నుపూస సంబంధిత వ్యాధులను యోగా ద్వారా తగ్గించుకోవచ్చని తెలిపారు. జిమ్‌లు కంటే యోగా వల్ల జీవకళ, ధైర్యం, ప్రశాంతత లభిస్తాయన్నారు.



యోగ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

● ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వల్ల ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. అధికారులు, విద్యార్థులతో పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, ఆర్డీవో పి.గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది, అధికారులు



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న మినీస్టేడియం

మినీస్టేడియం ఎప్పటికో?

- గత ఐదేళ్లూ నిలిచిన పనులు
- ఏడాదిగా పట్టించుకోని పాలకులు

రేపల్లె, మే 31 (ఆంధ్రజ్యోతి): రేపల్లెలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మినీ స్టేడియం ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియడంలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులు, క్రీడాకారుల కోసం మినీ స్టేడియాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లు నిధులను విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపివేశారు. మినీస్టేడియం అందుబాటులోకి వస్తుందని ఆశించిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. కూటమి ప్రభుత్వంలో అయినా పనులు జరుగుతాయని ఆశించారు. అయితే ఏడాదిగా ఆ పనుల ఊసే ఎత్తకపోవడంపై క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నిధులు విడుదల చేసి మినీ ఆడిటోరియాన్ని పూర్తి చెయ్యాలని అటు విద్యార్థులు ఇటు క్రీడాకారులు కోరుతున్నారు.

ఒకరోజు ముందే పెన్షనోత్సాహం

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

చీరాల, అమృతలూరు, బాపట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 1న పంపిణీ చేయాల్సిన పిం ఛన్లను ఒక రోజు ముందుగానే శనివారం జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేశారు. పండుగ వాతావరణం లో అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఒకరోజు ముందే నగదు చేతికి రావడంతో అవ్వాతాతల కళ్లల్లో ఆనందం వెల్లివిరిసింది. బాపట్ల 9వవార్డు చిల్లర గొల్లపాలెంలో కలెక్టర్ వెంకటమురళి, 24వవార్డు ఇమ్మడిశెట్టివారిపాలెంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అమృతలూరు మండల పరిధిలోని మోపర్రులో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, చీరాల మున్సిపాల్టీ 26, 27 వార్డుల్లో, వేటపాలెం, దేశాయిపేట తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కొండయ్య పింఛన్లను పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో ఆనందబాబు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారిగంగాధర్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, ఎంపీటీసీ కొడాలి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

బాపట్లలో పింఛన్ల పంపిణీ సందర్భంగా వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టి వారి అవసరాలు గుర్తించి ముందుగానే పెన్షన్లు ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కుట్టుబోయన రమేష్, నాయకులు అల్లం గోపికృష్ణ, కూచిపూడి శ్యామ్‌సుందర్, మందపాటి ఆంద్రేయ, అశోక్, భీమా లీలాకృష్ణ, శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి, ఫరీద్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. చీరాలలో పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మె ల్యే కొండయ్య పాల్గొన్నారు. దేశాయిపేట పోలేరమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.



మోపర్రులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



బాపట్లలో పెన్షన్‌లు పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

అవీ..ఇవీ..

రాతిమండప నిర్మాణానికి విరాళం


వెంకటరావుకు రసీదును అందజేస్తున్న ఈవో తిమ్మానాయుడు

అద్దంకి, మే31 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ రాతిమండపం నిర్మాణానికి బల్లికురవ మండలం వి.కొప్పెరపాడుకు చెందిన కామినేని వెంకటరావు, సుచరిత దంపతులు రూ.1,00,116లను ఈఓ తిమ్మానాయుడుకు శనివారం అందజేశారు. ముండ్లమూరుకు చెందిన మేదరమెట్ల శేషగిరిరావు, దేవకిదేవి దంపతులు, కుమారుడు, కోడలు రామకృష్ణ, సౌజన్య దంపతులు శింగరకొండ లోని టీటీడీ కళ్యాణ మండపంలో వరుని గది ఆధునీకరణకు అవసరమైన ఏసి,డబుల్‌కాట్, బెడ్, గ్రీజర్ ల ఏర్పాటు కు అవసరమైన 1.25 లక్షల రూపాయలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి


సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న నాగరాజస్వామి

మేదరమెట్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణేశ్వర స్వామి షష్టిని మండలంలోని కృష్ణరాజువారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ధ్వజారోహణం, హోమాలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం గణపతిపూజ, మహాన్యాస పూర్వ రుద్రాభిషేకం, సహస్ర నామావళి, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామి కళ్యాణోత్సవాన్ని నాగరాజస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో రథోత్సవం జరిపారు. రాత్రి ఊంజల్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 50 సంవత్సరాల నుండి కృష్ణంరాజువారి పాలెం(రెడ్డిపాలెం) శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామి క్షేత్రం ప్రసిద్ధి చెందింది. పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు, కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

దళితుల హక్కులపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

అద్దంకి, మే31 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని వసతి గృహ సంక్షేమ అధికారి సీహెచ్‌వీ నారాయణ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీ లో ఎస్సీ, ఎస్టీల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షురాలు పిన్నింటి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ


విద్యార్థులతో యోగా చేయిస్తున్న శిక్షకులు

బల్లికురవ. మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో వచ్చే నెల 21వ తేదీవరకు యోగా కార్యక్రమాలను అధికారులు చేపడుతున్నారు. శనివారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో విద్యా ర్థులకు యోగాంధ్రకు సంబందించి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబడిపూడి ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ శేషసాయి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి రోజు వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చు అని తెలిపారు.

నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

మార్టూరు, మే31 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలకవర్గం నూతన కమిటి శనివారం సాయంత్రం దేవస్థానంలో బాధ్యతలు స్వీకరించారు.వారిలో కమిటి అధ్యక్షులుగా కనమర్లపూడి సాంబ శి వరావు,సెక్రటరీగా కనమర్లపూడి కోటేశ్వరరావు,ట్రెజరర్ గా మోదడుగు మురళీ లు బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గుడివాడ సుబ్రమణ్యం, గుర్రం శ్రీను, నాని తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతుల కన్నెర్ర


కొండపిలో రాస్తారోకో చేస్తున్న పొగాకు రైతులు

కొండపి, మే 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు కన్నెర్ర చేశారు. వ్యాపారుల తీరుకు నిరసనగా కొండపిలో కొనుగోళ్లను బహిష్కరించారు. స్థానిక వేలం కేంద్రం వద్ద రాస్తారోకోకు దిగారు. నెన్నూరుపాడు గ్రామానికి చెందిన రైతులు శనివారం పొగాకు బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. మేలిమి రకాన్ని నాణ్యతను బట్టి కిలో రూ.200పైన కొనుగోలు చేయాల్సి ఉండగా ఆ ధర ఇవ్వకుండా అత్యధిక బేళ్లను వ్యాపారులు నోబిడ్ చేశా రు. అదేసమయంలో లోగ్రేడ్ రకానికి కిలోకు రూ.200 ఇచ్చారు. దీంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నాణ్యమైన పొగా కును కొనుగోలు చేయకుండా లోగ్రేడ్‌కు అధిక ధరలు ఇవ్వడం ఏమిటని వ్యాపారులను, బోర్డు అధికారులను నిలదీశారు. వేలాన్ని నిలిపివేసి రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం వేలం పునఃప్రారంభమైంది. శనివారం వేలం కేంద్రా న్ని రైతుకూలీ సంఘం నాయకులు సందర్శించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సిరిగిరి లలితకుమారి, జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు బెజవాడ శివరామ కృష్ణయ్య, గొల్లపల్లి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు

సాదాసీదాగా సాగిన మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ, హాజరైన కౌన్సిలర్లు

అద్దంకి,మే31(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పదవీ కాలం దగ్గర పడుతున్నందున ఆ లోపు మంజూరైన అన్ని పనులు పూర్తి చేయించాలని కోరారు. దీనికి స్పందించిన కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ కృషితో ఇటీవల మంజూరైన రూ.3కోట్లలకు సంబంధించిన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్నారు. గతంలో బిల్లులు చెల్లింపులు ఆలస్యమైనందున కాంట్రాక్టర్లు పనులు చేయడం ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం బిల్లుల చెల్లింపు వేగవంతం అయినందున మిగిలిన పనులు కూడా వెంటనే పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచనున్నట్లు తెలిపారు.

సాదాసీదాగా సమావేశం

అద్దంకి మున్సిపల్ సమావేశం సాధాసీదాగా సాగింది. అజెండా లోని 58 తీర్మానాలను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్లు దేసు పద్మేష్, అనంతలక్ష్మి, కౌన్సిలర్ లు, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల మిషన్లు ఆన్‌లైన్‌కు అనుసంధానం


మిషన్లను అనుసంధానం చేస్తున్న అధికారులు

పంగులూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 34 రేషన్ షాపులకు సంబంధించిన కొలత మిషన్లు, ఈ-పాస్ యంత్రాలను అప్‌డేట్ చేసి ఆన్‌లైన్‌కు అనుసంధానం చేసినట్లు జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ పి.లిల్లీ తెలిపారు. మండల డీలర్లతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మిషన్ల ఆన్లైన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్రాలజీ లిల్లీ మాట్లాడుతూ మండలంలోని 34 రేషన్ షాపులకు సంబంధించిన కాటామిషన్లను స్థానిక రెవెన్యూ కార్యాలయానికి తీసుకొచ్చి తెచ్చి ఆన్లైన్ చేయడం జరిగిందన్నారు. కాటాలు ఆన్‌లైన్ చేయడం ద్వారా రేషన్ పంపిణీ పారదర్శకంగా జరిగేందుకు వీలుంటుందన్నారు. రేషన్ పంపిణీలో జాప్యం జరుగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ రేషన్ దుకాణాల మిషన్లు ఆన్లైన్ చేయడం ద్వారా రేషన్‌పంపిణీ సమాచారం అందుబాటులో ఉండటంతో పాటు అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. సరుకు ఏ ధరకు అమ్ముతోంది, నిల్వ ఉన్న స్టాక్ వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు గుడిపాటి సుబ్బారెడ్డి, మండల డీలర్లు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు చౌక దుకాణాల ద్వారా అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని బాపట్ల పార్లమెంట్ తెలుగుమహిళా అధికారిక ప్రతినిధి రావిపాటి సంధ్య అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.1600 కోట్లతో వాహనాలను కొనుగోలు చేసి నెలలో రెండు రోజులు మాత్రమే రేషన్ పంపిణీ అరకొరగా చేసి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి పేదకు రేషన్ అందించాలని ప్రతి నెల 1వతేది నుండి 15వ తేదీ వరకు సరుకులు అందించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి ఇంటివద్ద రేషన్ అందించే సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విశ్వహిందూ పరిషత్ సేవాసమితి సేవలు అభినందనీయం


విశ్వహిందూ పరిషత్ సేవాసమితి బృందం

ఇంకొల్లు,మే 31,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు విశ్వహిందూ పరిషత్ సేవాసమితి సేవలు అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. వేసవికాలం ప్రారంభం మార్చి 31వ తేదీ నుంచి మే 31 వరకు ఇంకొల్లు బస్టాండులో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి 60 రోజులపాటు నిరంతరాయంగా సేవలందించడం పట్ల సేవా సమితి అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావును అభినందించారు. ప్రతి రోజు దాతల సహకారంతో ప్రయాణికులకు నిత్యం మజ్జిగ,మంచినీటిని అందించామని సహకరించిన దాతలకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజు శనివారం దాతలు జాగర్లమూడి శివప్రసాద్, వేణుబాబు చలివేంద్రంలో మజ్జిగ అందజేయగా, అరటిపండ్లు అన్నెం ఆదియ్య, నాని అందజేసినట్లు అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. దాతలను సేవాసమితి సభ్యులు అభినందించారు.

95 శాతం పింఛన్ల పంపిణీ


పంగులూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పంగులూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. జూన్ ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం 21 గ్రామ పంచాయితీలలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ చేపట్టారు. మండలంలో 7,744 మందికి రూ.3,24,43,500ల మొత్తాన్ని పింఛన్‌గా అందజేసినట్లు ఆమె తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అద్దంకిలో 93 శాతం

అద్దంకి : పట్టణంలో పింఛన్ల పంపిణీ మొదటి రోజు శనివారం 93 శాతం పూర్తయినట్లు కమిషనర్ రవీంద్ర తెలిపారు. మొత్తం 3994 మందికి రూ.1.66 కోట్ల పంపిణీ చేయాల్సి ఉండగా 93 శాతం పూర్తయిందన్నారు. ఆదివారం సెలవు కావడంతో ముందస్తు గానే శనివారం పంపిణీ జరిగింది.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండా లని ఎన్‌సీడీ నోడల్ అధికా రి డాక్టర్ భగీరధి పేర్కొ న్నారు. ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సంద ర్భంగా శనివారం ఒంగోలులో ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఉత్పతుల వల్ల క్యాన్సర్ వస్తుందని, ప్రజ లకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఫ్లోరోసిస్ వైద్యాధికారి అనిల్, జిల్లా మాస్‌మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోలికలే.. పసిప్రాయానికి ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

గురువుతున్నారు. దీంతో ముఖ్యమైన కౌమార దశ తీవ్ర ఒత్తిడిలో నలిగిపోతోంది.

స్పష్టత లేని లక్ష్యం..

సమాజంలో నిలిచే ప్రతి విజయం తమ ఇంట్లోనే జరగాలనే భావన కొత్తగా ప్రతి ఒక్కరిలో మొదలైంది. ఇది ఒక్క క్రీడల్లోనే కాదు.. అన్ని విషయాల్లోనూ ఇలానే జరుగుతోంది. ఒక విద్యార్థి ఐఐటీలో ర్యాంకు సాధించినా, రూ.లక్షల వేతనంతో ఉద్యోగం పొందినా.. ఆఖరికి యూ ట్యూబ్ వీడియోలతో ఫేమస్ అయినా.. మీరు కూడా అలా చేయండి అంటూ పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారు. అంతేగాక తాము జీవితంలో కోల్పోయింది.. తమ పిల్లలు సాధించాలని అనుకుంటూ ఉంటారు. కాకాపోతే ఏ రంగంలో రాణించాలో సరైన నిర్దేశం చేయలేకపోతున్నారు. ఏదో ఒకటి సాధించాలని చెబుతున్నారే కానీ, అది ఎంటి అనేది స్పష్టంగా పిల్లలకు చెప్పలేకపోతున్నారు.

తల్లిదండ్రుల పాత్రే కీలకం

పిల్లలు సాధించిన విజయాల్లో తల్లిదండ్రుల పాత్రే కీలకం. చాలా మంది తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. విజేతల కథలను స్ఫూర్తి పొంది.. తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని పిల్లలకు చెప్పాలి. కానీ, వారి ఆసక్తిని గమనించకుండా ఆయా రంగాల్లోకి వెళ్లి విజయాలు సాధించమంటే ఎంతవరకు సాధ్యమవుతుందో ఆలోచన చేయాల్సిన అవసరం చాలా ఉంది.

చులకన చేయొద్దు..

పరీక్షల ఫలితాల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించినా.. ఆ ఒక్క శాతం ఎందుకు వదిలేశావని పిల్లలను ప్రశ్నించే తల్లిదండ్రులు సమాజంలో చాలామందే ఉన్నారు. అంతటితో ఆగక.. ఖర్చుల లెక్క బయటకు తీస్తారు. ఇంకెవరినో ఉదహరణగా చూపుతూ చులకన చేస్తారు. దీనినే విశ్వామిత్ర పెంపకం అంటారు. ప్రస్తుతం 50 శాతం పైన తల్లిదండ్రులు ఇదే పెంపకాన్ని అనుసరిస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు.

కౌమర దశ కీలకం...

మానసిక వ్యాధి ప్రమాదం

కౌమర దశ చేరుకునే పిల్లల్లో అనేక సందేహాలు తలెత్తుతుంటాయి. వాటి నివృత్తికి తల్లిదండ్రులే చొరవ చూపాలి. అనుమానాలను, వారిలో ఉండే మానసిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. ఒత్తిడి తట్టుకోలేక ఈ మధ్య యువత సెబ్లింగ్ రైవలరీ అనే మానసిక వ్యాధి భారిన పడుతున్నారు. ఈ వ్యాధి భారిన పడినవారు.. ఒక దశలో తల్లిదండ్రులు చెప్పినవన్నీ సాధించినట్లు వారిలో వారే మాట్లాడుకుంటూ ఉంటారు. గొప్పవాళ్లం అయ్యామని అనుకుని చేతులు ఊపడం, ఆటోగ్రాఫ్‌లు ఇవ్వడం వంటివి చేస్తుంటారు. ఈ వ్యాధిని తొలిదశలో గుర్తించలేకపోతే కొంతకాలం తర్వాత పిచ్చివాళ్లుగా మారే ప్రమాదముంటుందని మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న ఆత్మహత్యలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో దాదాపు 220 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు ఎక్కువగా వీక్షించడం. ఒంటరితనం, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

పోలికలతోనే ప్రమాదం

పిల్లలను నేరుగా తిడితే వారికి భరించే శక్తి ఉంటుంది. కానీ, ఇతరులతో పోల్చుతూ మాట్లాడితే మాత్రం తీవ్ర మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఆ సమయంలో వారికి ఆత్మహత్య చేసుకోవాలనేంత బాధగా ఉంటుంది. 'మీ పిల్లవాడు వృద్ధిలోకి రాలేకపోతున్నాడు.' అన్న బంధువులు మాటలకు వారికి సమాధానం చెప్పలేక.. ఇంటికి వచ్చి పిల్లలనే తిట్టే తల్లిదండ్రులే ప్రస్తుతం ఎక్కువ. స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటారుగాని.. వాటి అమల్లో మాత్రం మధ్య తరగతి మనస్తత్వం తల్లిదండ్రులకు అడ్డుగా మారుతుంది. చివరికి దుస్తుల విషయంలో కూడా ఎదురింటి వారిని, పక్కింటి వారిని అనుసరిస్తుంటారు. చదువులో కూడా ఎదురింటి పిల్లలు ఎక్కడ చదివితే అక్కడే చదివిస్తుంటారు.

పిల్లల పెంపకంలో పెరిగిన వ్యత్యాసాలు

పిల్లల పెంపకంలో 2005 నాటికి, అంతకు ముందు తల్లిదండ్రులకు ఎంతో వ్యత్యాసం ఉందని మానసిన నిపుణులు చెబుతున్నారు. వృత్తి, ఉద్యోగంలో మరింత ఉన్నతంగా రాణించేలా నాటితరం తల్లిదండ్రుల పెంపకం ఉండేదని, ప్రస్తుతం భిన్నంగా ఉందని అంటున్నారు. 2005 తర్వాత పుట్టిన పిల్లలకు కౌమారం వచ్చే నాటికి నిర్దిష్టమైన లక్ష్యాలు లేవు. పూర్తి యాంత్రిక జీవితంలో తల్లిదండ్రులు ఉండటం వల్ల.. ప్రస్తుత ప్రపంచంలో ఎక్కడ వెనుక బడిపోతారో అనే ఆందోళనతో ఒకటి కంటే ఎక్కువ లక్ష్యాలను వారి ముందు ఉంచుతున్నారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

- ఇన్నర్ వీల్ మాజీ అధ్యక్షురాలు కోటా ప్రసన్న
- ప్రతిభ చూపిన విద్యార్థినికి రూ.40వేల నగదు బహూకరణ


విద్యార్థికి నగదును అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

పర్చూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : బాలికలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు, సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని ఇన్నర్ వీల్ మాజీ అధ్యక్షులు వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న అన్నారు. ఇటీవల విడుదలైన పది పరీక్షల ఫలితాల్లో 596 మార్కులు సాధించి అగ్రగామిలో నిలిచిన ఎన్.హర్షితకు రోటరీ క్లబ్ కార్యదర్శి కోమటి ఆర్థిక సహకారంతో సమకూర్చిన రూ.40,000 నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక బొమ్మల కూడలిలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రం వద్ద రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాబోలు వెంకటేశ్వర్లు, కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కాసా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


ఎంపీడీవో శ్రీనివాసమూర్తిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చినగంజాం, మే 31(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని తహసీల్దార్ జె.ప్రభాకరరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్యలు అన్నారు. స్థానిక వెంకటేశ్వర కల్యాణమండపంలో ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈవోపీఆర్డీ రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న ఎంపీడీవో దంపతలను తహసీల్దార్, మండల పరిషత్ అధికారులు, టీడీపీ నాయకులు, బంధువులు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పలు మండలాల ఎంపీడీవోలు, గ్రామ సర్పంచ్‌లు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, చినగంజాం, నీలాయపాలెం, పెదగంజాం, మోటుపల్లి, కొత్తపాలెం గ్రామ సర్పంచులు రాయని ఆత్మారావు, తూమాటి శ్రీనివాసరావు, నక్కల కృష్ణ, వి.సాంబశివరావు, ఆసోది బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, పలు మండలాల ఎంపీడీవోలు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, మే 31 (ఆంధ్రజ్యోతి): మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ సూచించారు. నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయ ముఖ ద్వారం వద్ద ఎంపీపీ నలమలపు అంజమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీజీ, అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే, టంగుటూరి ప్రకాశంపంతులు, ఏకలవ్య, గురు సంత్‌రవిదాస్ తదితరుల విగ్రహాలను శనివారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే బీఎన్‌ను వైసీపీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి శాలువా కప్పి సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, ఒమ్మెవరం సర్పంచ్ పాలపర్తి బాలకోటి, తెలగతోటి జాన్సన్, చాట్ల నారాయణ, ఏడుగుండ్ల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు కాసులు

(5వ పేజీ తరువాయి)

సమాయత్తమవుతున్నారు. ప్రతి నియోజకవర్గం పరిధిలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో కాల్వల మరమ్మతులు చేపట్టనున్నారు. కాల్వల బాగుకు ప్రభుత్వం నడుంకట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వ పరిధిలో అధ్వానంగా ఉన్న మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వల చివరి భూములకు పూర్తిస్థాయిలో సాగు నీరందించే లక్ష్యంతో పనులు చేపట్టనున్నారు. విత్తనాలు విత్తుకునే సమయం ఆసన్నమయ్యేలోగా కాల్వల్లో పూడికతీతతోపాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టి పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం, సాగునీటి సంఘాలు సమాయత్తమయ్యాయి. నీటి సంఘాలు పనులు చేసేందుకు ముందుకు రాని పక్షంలో అటువంటి చోట్ల రూ.10 లక్షల విలువైన పనులకు స్వల్పకాలిక టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. యుద్ధప్రాతిపదికన కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని కాడా కమిషనర్ సూచించారు. రుతు పవనాలు విస్తరించిన నేపథ్యంలో పనులకు ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇప్పటికే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కొన్ని కాల్వల పనులు ముందస్తుగా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో శనివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి.

పనులు వేగవంతం

డెల్టా పరిధిలో కాల్వల మరమ్మతులకు ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఉండటంతో నీటి సంఘాల ఆధ్వర్యంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారుల బృందంతో కలిసి ఆయా పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు కూడా చేశారు. రూ.10 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిన చేపట్టే అవకాశం కల్పించడంతో నీటి సంఘాలు పనులకు శ్రీకారం చుట్టాయి. ఎక్స్‌కవేటర్లతో పీటీ ఛానల్, న్యూ ముత్తాయపాలెం, లంక, తుమ్మలశాఖ, అడవిబ్రాంచ్ తదితర కాల్వల మరమ్మతులు జరుగుతున్నాయి. ఇరిగేషన్, డ్రెయినేజి పరిధిలో 109 పనులను రూ.3.01 కోట్లతో చేస్తున్నారు.

తరగతి మారదా?

(5వ పేజీ తరువాయి)

వరండాలు, చెట్ల కింద చదువులు తప్పవని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పునః ప్రారంభానికి గడువు ముంచుకొస్తున్నా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు నేడు పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదట్లో కొద్దిరోజులు పనుల్లో వేగం పెరిగినా అది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో రాబోయే విద్యా సంవత్సరంలో కూడా తరగతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని ప్రధానోపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో రెండు విడతల్లో నాడు నేడు పనులు అనేక పాఠశాలల్లో అసంపూర్తిగానే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.1000 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టారు. అయితే పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికీ అనేక పాఠశాలల్లో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పటికీ వందల సంఖ్యలో పాఠశాలల్లో అసంపూర్తి గదులు నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. పూర్తయిన భవనాలకు ప్లాస్టింగ్, విద్యుత్ కనెక్షన్లు, ఫ్లోరింగ్, ప్లంబింగ్ తదితర పనులు కూడా ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో బోధన ఎలా చేయాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయా పనులపై పర్యవేక్షణ లేకుండా పోయింది. గుంటూరు నగరంలోనే దాదాపు పది పాఠశాలల్లో నిర్మాణాలు పూర్తి కాలేదంటే మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల్లో పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

అవీ..ఇవీ..

మంత్రి గొట్టిపాటి కృషి ప్రశంసనీయం


ముప్పవరంలో సమావేశమైన టీడీపీ నేతలు

పంగులూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడు విజయవంతం చేయడంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషిని పలువురు మండలనేతలు ప్రశంసించారు. ముప్పవరం పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశమైన నేతలు మహానాడు కార్యక్రమానికి జనసమీకరణ కమిటీ కన్వీనర్‌గా మంత్రి గొట్టిపాటి రవికుమార్ కనబరిచిన పనితీరును మండల నేతలు గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు.

నాపరాయితో వ్యక్తిపై దాడి

చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు


చికిత్స పొందుతున్న బాధితుడు

చినగంజాం (చీరాల), మే 31 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై మరొక వ్యక్తి నాపరాయితో విచక్షణ రహితంగా దాడిచేసిన ఘటన చినగంజాం పరిధిలోని సోపిరాలలో చోటు చేసుకొంది. అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినగంజాం మండల పరిధిలోని సోపిరాల గ్రామానికి చెందిన పర్వతరెడ్డి మురళీకీ, అదేగ్రామానికి చెందిన గోకన నాగరాజుకు ఉదయం సమయంలో మద్యందుకాణం సమీపంలో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో దారికాచి ఇంటికి సైకిల్‌పై వెళుతున్న మురళీ ముఖంపై నాపరాయితో నాగరాజు దాడి చేశాడు. దీంతో బాధితుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

గణనీయంగా తగ్గిన ఆలయ భూముల కౌలు

పంగులూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : గతేడాది పంటల సాగుకు ప్రతికూలంగా ఉండడంతో ఆ ప్రభావం ఆలయ భూముల కౌలువేలంపై పడింది. గత ఏడాది మూడేళ్లకు జరిగిన కౌలు వేలంలో భూములు దక్కించుకున్న రైతులు, ఈ ఏడాది అదే కౌలుతో పంట సాగుచేసేందుకు ముందుకు రాలేదు. దీంతో పంగులూరులోని ఆలయ భూముల కౌలువేలం శనివారం మరోసారి నిర్వహించారు. భీమలింగేశ్వరస్వామి దేవస్థానం భూములు 46 ఎకరాలకు గత ఏడాది రూ.11.21 లక్షలు కౌలు పలకగా, ఈ ఏడాది అదే భూమికి కౌలు రూ.6.96 లక్షల కౌలు దక్కింది. గ్రామంలోని శ్రీ వీరేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 10 ఎకరాలకు గత ఏడాది రూ.3.28 వేలు కౌలు దక్కగా తిరిగి ఈ ఏడాది అదే భూమి కౌలు రూ.1.66 లక్షలు దక్కింది. కార్యక్రమంలో అద్దంకి ఏరియా ఇన్‌స్పెక్టర్ యం.వెంకటేశ్వరరావు, ఈవో శ్రీనివాసరావు, మేదరమెట్ల ఈవో వాసుబాబు, రైతులు పాల్గొన్నారు.

నేడు సృజన సాహిత్య సమావేశం

అద్దంకిటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): సృజన సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక కమఠేశ్వరస్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కథాసంపుటి ఆవిష్కరణ సభ, పలు రంగాలలోని వారికి సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున సాహితీ మిత్రులందరు హజరు కావాలని కోరారు.

సరిహద్దు రాళ్ల తొలగింపుపై కేసు నమోదు

గవినివారిపాలెం(చీరాల), మే 31 (ఆంధ్రజ్యోతి) : పొలం సరిహద్దు రాళ్ల తొలగింపుపై యజమాని ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించాడు. మండల పరిధిలోని గవినివారి పాలెంకు చెందిన నక్కల నరేష్‌కు చెందిన పొలానికి సంబంధించిన హద్దు రాళ్లను అదే గ్రామానికి చెందిన దబ్బకూటి వెంకన్న, శ్రీను తొలగించారు. దీంతో యజమాని ఫిర్యాదు చేయడంతో ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సత్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన 38వ వార్షికోత్సవంలో భాగంగా కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా హరిప్రసాద్, కార్యదర్శిగా రామిరెడ్డి, సహాయకార్యదర్శిగా పూర్ణ చంద్రరావు, ట్రెజరర్‌గా సుబ్బారావు ఎన్నికయ్యారు. నెల్లూరు డివిజన్ అధ్యక్షులు సుందరబాబు, జనరల్ సెక్రటరీ ప్రసాద్ మంజుల ముఖ్య అతిథులుగా హాజరై ఎన్నిక నిర్వహించారు. కమిటీ ప్రతినిధులను సన్మానించారు.

సీహెచ్‌వో ఉద్యోగ విరమణ

యద్దనపూడి,(మార్టూరు)మే31(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేసిన టీవీ శివప్రసాద్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శ్రీహర్ష ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సత్కరించారు.

సాగర్ నీటితో చెరువులకు జలకళ

● తాగునీటికి సమృద్ధిగా సాగర్ జలాలు ● సరఫరాను పర్యవేక్షిస్తున్న అధికారులు


రాంకూర్ రెగ్యూలేటర్ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎన్ఎస్‌పీ అధికారులు

మార్టూరు, మే31 (ఆంధ్రజ్యోతి): సాగర్ జలాలతో మండలంలోని వివిధ గ్రామాలలోని మంచినీటి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువులకు సాగర్ జలాలు సమృద్ధిగా చేరడంతో నీటితో చెరువులు కళకళలాడుతున్నాయి. ఈ వేసవిలో గ్రామాలలో తాగునీటిసమస్య తలెత్తకుండా ఉండడానికి సాగర్ జలాలను విడుదల కావడంతో కోనంకి ఎన్ఎస్‌పీ పరిధిలోని మార్టూరు మండలంలోని మంచినీటి చెరువులలోనికి నీరు సమృద్ధిగా చేరుతోంది.


యద్దనపూడి చెరువుకు చేరిన సాగర్ జలాలు

మండలంలో 13 నాన్‌నోటిఫైడ్ చెరువులు ఉండగా వాటిలో దాదాపుగా 75 శాతం మేర సాగర్ జలాలతో నిండాయి. మేజరు పంచాయతీ మండలంలోనే పెద్ద చెరువు మార్టూరు చెరువులో ముప్పాతికవంతు నీటితో నిండింది. అదేవిధంగా జొన్నతాళి, వలపర్ల, కోలలపూడి, తాటివారిపాలెం, బొల్లాపల్లి, చిమ్మిరిబండ, ద్రోణాదుల గ్రామాలలోని చెరువులు దాదాపుగా నిండిపోయాయి. రాజుపాలెం మేజరు పరిధిలోని నాగరాజుపల్లి, మార్టూరు, రాజుపాలెం చెరువులకు నీరు చేరుతోంది. రైతులకు వ్యవసాయం, పంటల కోసం ప్రస్తుతం నీటితో అవసరం లేకపోవడంతో చెరువులకు చేరే సాగర్ జలాలను కాలువల నుండి రైతులు పొలాలకు మళ్లించుకోవడం లేదు.

యద్దనపూడి మండలంలో

యద్దనపూడి మండలంలో కూడా దాదాపుగా 14 చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి. మండలంలో సూరవరపుపల్లి మినహా మిగిలిన గ్రామాల చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి. మండలంలోని గన్నవరం, పూనూరు గ్రామాలలోని చెరువులు నూరుశాతం నిండిపోయాయి. అనంతవరం గ్రామంలోని ఒక చెరువు పూర్తిగా నిండింది. ఇక మున్నంగి వారిపాలెం, తనుబొద్దివారిపాలెం, చిలుకూరి వారిపాలెం, చింతపల్లిపాడు, వింజనంపాడు, పోలూరు గ్రామాలలోని చెరువులు దాదాపుగా 75 శాతం నిండాయి. యద్దనపూడి చెరువుకు సమృద్ధిగా జలాలు చేరుతున్నాయి.

నూతలపాడు మేజరుకు నిలిచిన నీటి సరఫరా

శుక్రవారం నుంచి నూతలపాడు మేజరుకు సాగర్ జలాలను నిలిపివేశారు. బొల్లాపల్లి జీఎస్‌టీ వద్ద 250 క్యూసెక్కులు, పమిడిపాడు మేజరుకు 220, కోటపాడు మేజరుకు 90, ద్రోణాదుల మేజరుకు 120, రాజుపాలెం మేజరుకు 35 క్యూసెక్కులు సాగర్ జలాలు వెళుతున్నాయి. ఇక దిగువకు సక్రమంగా సాగర్ జలాలు సరఫరా జరిగేవిధంగా ఎన్ఎస్‌పీ డీఈ స్వామి, ఏఈ బాలకృష్ణ నాయక్ తదితరులు శనివారం రామకూరు రెగ్యులేటరు వద్ద పరిశీలించారు.

గ్రామీణ విద్య ఉన్నతికి ప్రభుత్వం పెద్దపీట

పర్చూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ విద్యను మెరుగు పరచడానికి ప్రజా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, భవనాల మరమ్మతులు తదితర అంశాలకు సంబంధించి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసింది. పాఠశాలల అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవ చూపి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసేవిధంగా కృషి చేశారు. సర్వశిక్షా అభయాన్ పథకం కింద నియోజకవర్గానికి రూ.1.14 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

మౌలిక వసతుల కల్పనా ఇలా

నియోజకవర్గంలోని పాఠశాలల్లో ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మతులకు నిధులు కేటాయించారు. అందులో పర్చూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.9,37,500, దగ్గుబాడు ఉర్దూ మండల పరిషత్ ఉర్దూ పాఠశాలకు రూ.9,37,500, గర్నెపూడి ప్రాథమిక పాఠశాలకు రూ.9,37,500, కొడవలివారిపాలెం ఎంపీపీ పాఠశాలకు రూ9,37,500, వీరన్నపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.9,37,500 చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. అలాగే మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.26,60,000 విడుదలయ్యాయి. వీటిలో తిమిడితపాడు, దగ్గుబాడు, గర్నెపూడి, అడుసుమల్లి అంజయ్య మండల పరిషత్ ప్రైమరీ స్కూల్, పర్చూరు గర్ల్స్ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి కేటాయించారు. ఒక్కొక్క పాఠశాలలకు రూ.3,80,000 చొప్పున నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా పర్చూరు నియోజకవర్గంలోని పలు పాఠశాల మరమ్మతులకు రూ.18,00,000 లక్షల నిధులు మంజూరయ్యాయి. చినగంజాం మండలంలోని మోటుపల్లి స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.13 నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.


ప్రభుత్వ పాఠశాలలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ఇచ్చిన మాటకు కట్టుబడే నాయకుడు ఏలూరి

తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బారెడ్డి


ఏలూరి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

చినగంజాం, మే.31(ఆంధ్రజ్యోతి) : సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కరించడానికి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఉంటాడని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడు ఎమ్మెల్యే ఏలూరిసాంబశివరావు అని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, పర్చూరు నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షులు కోకి ఉదయభాస్కరరెడ్డిలు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం నుంచి పెదగంజాం గ్రామం వరకు, పెదగంజాం గ్రామం నుంచి ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామం వరకు రోడ్లు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా పెదగంజాం గ్రామం నుంచి ఎన్టీఆర్ వారధి వరకు పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు శనివారం మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ వారిధిపై ఎమ్మెల్యే ఏలూరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడు తూ అనేక ఏళ్లగా సరైన రహదారి, వంతెనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎమ్మెల్యే ఏలూరి 'నేనున్నానంటూ' భరోసా ఇచ్చి ఎన్టీఆర్ వారిధి నిర్మాణం చేపట్టారన్నారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను ఎమ్మెల్యే నెరవేర్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మరమ్మత్తులకు నోచుకొని పెదగంజాం, రాజుబంగారుపాలెం వయా ఎన్టీఆర్ వారిధి, పెదగంజాం, ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.15కోట్ల రూపాయిలు మంజూరు చేయడంతో ప్రభుత్వానికి ఆ ప్రాంతవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెదగంజాం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు ఆసోది బ్రహ్మారెడ్డి, బీసీ సెల్ నాయకులు వాటుపల్లి ఏడుకొండలు, మున్నంవారిపాలెం, కొత్తపాలెం ఎంపీటీసీలు నాగాంజనేయులు, రాంబాబురెడ్డి, భోగిరెడ్డి కోటిరెడ్డి, ఆసోది వెంకటఅంజిరెడ్డి, కొక్కిలిగడ్డ విష్ణు, మాచవరపు రాజేష్, కొడూరి శ్రీనివాసులు, గడ్డం కోటయ్యలు పాల్గొన్నారు.

ఇలా అయితే రాకపోకలు సాగేదెలా..?

● అధ్వానంగా దేవరపల్లి అర్‌అండ్‌బీ రోడ్డు


రాళ్లు తేలి అధ్వానంగా మారిన దేవరపల్లి రోడ్డు

పర్చూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలోని అర్‌అండ్ బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోక పోవడంతో రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టక పోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో ఎక్కడ చూసిన పెద్దపెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు అల్లాడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించి కనీస మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోలలపూడిలో నేత్రదానం


సుబ్బాయమ్మ (ఫైల్)

మార్టూరు, మే31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన కందిమళ్ల సుబ్బాయమ్మ (90) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఆమె కొంతకాలంగా చిలకలూరిపేటలో కుమారుడు అంజిబాబు ఇంటిలో ఉంటున్నారు. ఆమె మృతదేహాన్ని కోలలపూడి గ్రామంలోని సొంతింటికి తీసుకువచ్చారు. అయితే కుమారుడు అంజిబాబు గతంలో రోటరీ క్లబ్ కు ఇచ్చిన మాట ప్రకారం చనిపోయిన తల్లి సుబ్బాయమ్మ నేత్రాలను పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి వారికి దానం చేశారు. దీంతో కంటి ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు సుబ్బాయమ్మ నేత్రాలను సేకరించారు. గతంలో మృతిచెందిన సుబ్బాయమ్మ భర్త వెంకటనారాయణ కూడా తన నేత్రాలను దానం చేయడం విశేషం. ఇదిలా ఉండగా సుబ్బాయమ్మ మృతదేహానికి సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, శ్రీశైలం కమ్మ సంఘం అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, తదితరులు సుబ్బాయమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దాతల సహకారంతో సీసీకెమెరాల ఏర్పాటు

● అభినందించిన పోలీసులు


బల్లికురవలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

బల్లికురవ. మే 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం బల్లికురవలో కొన్నేళ్లుగా సీసీకెమెరాలు మరుగున పడ్డాయి. ఇటీవల నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వై.నాగరాజు మండలకేంద్రంలో ప్రత్యేక నిఘా ఉండాలంటే సీసీ కెమెరాలు అవసరమని గుర్తించారు. బల్లికురవ గ్రామానికి చెందిన మండల టీడీపీ నాయకులు గొట్టిపాటి లక్ష్మయ్య, మరో దాత నాగబోయిన రాజాల సహకారంతో రూ.40 వేల విలువైన ఆరు సీసీ కెమెరాలను గ్రామానికి నలువైపులా ఏర్పాటు చేయించారు. ఈ కెమెరాతో గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ బల్లికురవ మండలంలో వేమరవరం, చెన్నుపల్లి గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ముందు ముందు అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేయిస్తామన్నారు. కొత్తవ్యక్తులు ఎవరైన గ్రామాలలో సంచరిస్తుంటే వెంటనే తెలియజేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు

● రోటరీక్లబ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో నిర్వహణ


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పంగులూరు, మే 31(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీక్లబ్, శంకర్ కంటి వైద్యశాల వారు పంగులూరు రోటరీ క్లబ్ భవన ప్రాంగణంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో శంకర్ కంటివైద్యశాలకు చెందిన డాక్టర్ శ్యామ్‌దీప్, డాక్టర్ రమ్య 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 140 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించినట్లు క్లబ్ అధ్యక్షులు షేక్ కాలేషావలి, కార్యదర్శి డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. గతంలో ఆపరేషన్లు చేయించుకున్న 10 మందికి ఉచితంగా కళ్ళజోళ్లు అందచేశారు. ప్రతి నెల ఆఖరి శనివారం రోటరీక్లబ్ భవన ప్రాంగణంలో కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ కంటి వైద్యశాల ఇన్‌చార్జ్ డాక్టర్ గంగాధర్, రోటరీ సభ్యులు రాయిణి రామారావు, కరణం హనుమంతరావు, విశ్రాంత ప్రొఫెసర్, బండారుపల్లి రమేష్, తాటి సుబ్బారావు, బాచిన వెంకటరామారావు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మార్టూరు, మే31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం 214 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల పర్చూరు మండలంలోని చెరుకూరులో ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో ఆపరేషను చేయించుకున్న రోగులకు పెదకాకాని శంకర కంటి వైద్యశాల నుంచి వచ్చిన ప్రత్యేక వైద్యులు రోగులకు కళ్లజోళ్లను, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయానికి వచ్చిన రోగులకు సేవాగ్రూప్స్‌గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.అదేవిదంగా రోగులకు బిపి,షుగర్ పరీక్షలు నిర్వహించారు.

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న కృష్ణ అభిమానులు

చీరాల, మే 31 (ఆంధ్రజ్యోతి) : దివంగత సినీహీరో ఘటమనేని కృష్ణ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు షేక్ అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డా.శ్రీకాంత్, డా. సుభాషిణి పాల్గొన్నారు.. ఈసందర్భంగా ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో అభిమానులు శ్రీధర్, వేణుగోపాల్‌రావు, శ్రీను, ప్రసాద్, సూరిబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు ట్రాక్టర్లతో .. ఇప్పుడు మోటార్లతో..!



నీటిని తోడిపోస్తున్న ట్రాక్టర్లు(ఫైల్), ప్రస్తుతం నీటిని తోడిపోస్తున్న మోటార్లు


ఇంకొల్లు,మే 31,(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం ఇంకొల్లులోని నాగులచెరువుకు నీటిని నింపేందుకు అధికారులు భగీరథ యత్నాలు చేస్తున్నారు. ఏటా వేసవిలో చెరువు నీరు ఎండిపోవడం, సాగర్ జలాలు వచ్చినప్పుడు నీటిని చెరువుకు తోడిపోయడం పరిపాటిగా మారింది. గతంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నీటిని నింపే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం మోటార్లతో నీటిని నింపుతున్నారు. తద్వారా కొంత మేర అధికారులు ఖర్చు తగ్గించుకున్నారు. అయితే శాశ్వత పరిష్కారంపై అధికారులు దృష్టిసారించలేదు. సాగర్ నీరు వచ్చిన ప్రతిసారి లక్షలకు లక్షలు వెచ్చించి నీటిని తోడిపోయాల్సి వస్తోంది.

సుమారు 20వేల జనాభా కలిగిన ఇంకొల్లులో నీటి వినియోగం ఎక్కువగా ఉంది. ఇక్కడ ఏడాదిలో మూడునాలుగు విడతలుగా చెరువును నింపాల్సి వస్తోంది. ఇందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు శాశ్వత పరిష్కారం కోసం దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు. మార్కెట్ యార్డు సమీపంలో సాగర్ కాలువ నుంచి కిలోమీటరు మేర కాల్వను ప్రతిసారి జెసిబితో పూడికతీయాలి. అంతేకాకుండా చెరువును నీటితో నింపే క్రమంలో సైడ్‌డ్రైన్ ద్వారా చెరువుకు నీటిని నింపాల్సిన పరిస్థితి. తద్వారా మురుగునీరు, త్రాగునీరు కలసి చెరువులోకి చేరుకుంటున్నాయి. ప్రస్తుతం చెరువులు నింపేందుకు సాగర్ జలాలు విడుదల కావడంతో నాలుగు రోజులుగా నీటిని పంపింగు చేస్తున్నారు. నీరు కలుషితం అవుతున్నప్పటికీ, అనివార్య పరిస్థితుల్లో ప్రజలు ఈ నీటిని వినియోగిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 1 జూన్ 2025

ఏం జరుగుతుందో!?

- బదిలీలపై ఉపాధ్యాయుల్లో వీడని ఆందోళన
- భారీగా వస్తున్న అభ్యంతరాలు
- ఎస్జీటీల స్థానచలనాలపై సందిగ్ధత



బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతోపాటు భారీగా అభ్యంతరాలు కూడా వస్తుండటంతో అధికారులు సమావేశాలు, సరిచేయడంతోనే బీజీగా ఉంటున్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో వారికి కేటాయిస్తున్న ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు ఎంతో కీలకంగా మారుతున్నాయి. న్యాయబద్ధంగా రావాల్సిన పాయింట్ల కోసం రాజీ పడకుండా, ఇతరులు అక్రమంగా పాయింట్లు పొందకుండా అన్ని శక్తులు ఉపయోగిస్తున్నారు. అలాగే ఎస్జీటీల కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా!? లేదా మాన్యువల్‌గానే ముగిస్తారా అన్నదానిపై అనిశ్చితి నెలకొంది. దీనిపై విద్యాశాఖ అధికారులకు కూడా స్పష్టత లేకపోవడంతో ఉన్నతాధికారులతో చర్చిస్తూ తర్జనభర్జన పడుతున్నారు. మొత్తమ్మీద ఇప్పటిదాకా 174 మంది ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించారు.

- వివరాలు 8లో..



కొరిమెర్ల ఎత్తిపోతల పథకం

అన్నదాతల ఆదర్శం!

ఎత్తిపోతల పథకం నిర్వాహణలో స్ఫూర్తి పథం

పూర్తిగా మెట్టప్రాంతం. పంటలు సాగు చేయాలంటే నీటి కొరత. ఏం చేయాలో దిక్కుతోచని దైన్యస్థితి. ఇది మూడు దశాబ్దాల మాట. ఇప్పుడు ఆ ప్రాంతం డెల్టాతో పోటీపడుతోంది. ఇందుకు ఆ రెండు గ్రామాల రైతుల కృషే ఇందుకు కారణం. సంగం మండలం కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాల రైతుల్లో వేర్వేరు రాజకీయ పార్టీలు, వర్గాలు ఉన్నా వ్యవసాయం విషయంలో మాత్రం ఏకతాటిపై నడుస్తారు. ఎప్పుడో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అదెలాగో ఈ కథనం చదవండి...

8

రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా మునిశంకరయ్య

నెల్లూరు (హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీగా మునిశంకరయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని డీఐజీ కార్యాలయంలో అప్పటిదాకా అక్కడున్న పుష్పలత నుంచి మునిశంకయ్య బాధ్యతలు స్వీకరించారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పుష్పలతను శాలువాతో సత్కరించారు. మునిశంకరయ్యకు పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు.

నెల్లూరుపై మూడో కన్ను

- 300 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
- మంత్రి నారాయణ చొరవతో నిధుల సమీకరణ
- కార్పస్ ఫండ్ కింద రూ.3 కోట్లు ఇచ్చిన యూబీఐ
- పోలీస్, కార్పొరేషన్లలో కమాండ్ కంట్రోల్ రూమ్స్
- నెల రోజుల్లో అందుబాటులోకి...

8



నెల్లూరు నగరంలో పెరుగుతున్న నేరాలు.. చోరీల అదుపునకు పోలీసు వ్యవస్థ చేతిలోకి శక్తివంతమైన ఆయుధం రాబోతోంది. సువిశాలమైన నగరంలో పారిశుధ్య నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి కార్పొరేషన్‌కు ఊరంతా కళ్లు చేసుకొని చూసుకునే గొప్ప సౌకర్యం అక్కరకు రానుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కేవలం ఒక నెల రోజుల్లో నగరం మొత్తం నిఘా నేత్రాల పర్యవేక్షణలోకి రాబోతుంది. మంత్రి పొంగూరు నారాయణ చొరవ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నిధులతో నెల్లూరు నగరం సురక్షితంగా...పరిశుభ్రంగా ఉండటానికి ఆస్కారం ఏర్పడుతోంది.



సంగం : లబ్ధిదారుకు పింఛను నగదు అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

92 శాతం పెన్షన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను 92 శాతం మందికి అందజేశారు. మొత్తం 3,04,827 మందికిగాను 2,78,000 మందికి పంపిణీ చేశారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు ఈ పంపిణీ నిరంతరంగా సాగింది. సంగం మండలం వీర్లగుడిపాడులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరులోని జాఫార్‌సాహెబ్ కాలువకట్ట ప్రాంతంలో మంత్రి నారాయణ లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు.

3న ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల జట్లను జూన్ 3న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపిక చేస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బీ.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే సబ్‌జూనియర్స్ బాల, బాలికలు జనవరి 2012 నుంచి డిసెంబర్ 2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. జూనియర్స్ విభాగంలో 2010 జనవరి నుంచి 2011 డిసెంబర్ మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు స్టేడియంలో హాజరు కావాలన్నారు.

జిల్లాలో సగటు వరపాతం 7.9 మిమీ

నెల్లూరు (హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సగటు వర్షపాతం శనివారం 7.9 మిమీగా నమోదైంది. అత్యధికంగా ఇందుకూరుపేటలో 33.8 మి.మీ వర్షం పడగా, అత్యల్పంగా ముత్తుకూరు, ఏఎస్‌పేటలలో 1.6 మి.మీ వర్షం కురిసింది.

అంతా పకడ్బందీగా..

- నేటి నుంచి షాపుల్లో రేషన్ పంపిణీ
- 1-15వ తేదీ వరకు సరుకుల అందజేత
- 5వ తేదీలోపు వృద్ధులు, దివ్యాంగులకు..
- సమస్య ఉంటే కార్డుదారు ఫోన్ చేయొచ్చు!
- షాపు ముందు సరుకు నిల్వతోపాటు ఫోన్ నెంబర్ల ప్రదర్శన
- డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం
- జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి విజయకుమార్

ఇంటర్వ్యూ...



"ఎండీయూ వ్యవస్థ రద్దుతో కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేరుగా రేషన్ షాపుల వద్దనే సరుకులు తీసుకోవచ్చు. ఇందుకు పరిధి అంటూ ఏమీ లేదు. షాపులోనైనా సరుకులు అందుకోవచ్చు. ఇక అక్రమాలకు తావు లేకుండా కార్డుదారు చేసే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలిస్తాము. డీలర్లు పరిధి దాటితే అప్పటికప్పుడే కఠిన చర్యలు తీసుకుంటాము.' అని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్. విజయకుమార్ స్పష్టం చేశారు. రేషన్ షాపుల్లో ఆదివారం రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

? కొత్త విధానంలో సరుకుల పంపిణీ ఎలా

! రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియ ఆదివారం ప్రారంభమవుతుంది. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు సరుకుల పంపిణీ ఉంటుంది. ఈపాస్‌తోపాటు తూకం పరికరాలను సిద్ధం చేసుకోవాలని డీలర్లకు ఆదేశాలు ఇచ్చాం. షాపుల వద్ద డీలర్ల ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని ఆదేశాలు ఇచ్చాం. ఆదివారం షాపులను పూలతో అలంకరించి, ప్రజా ప్రతినిధులు, వయోవృద్ధులను ప్రారంభ కార్యక్రమాలకు ఆహ్వానించాలని డీలర్లకు సూచించాం. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి షాపులు ఉంచుతారు. ఆదివారం కూడా సరుకులు తీసుకోవచ్చు.

? షాపులోనైనా సరుకులు తీసుకోవచ్చా?

! తీసుకోవచ్చు. ఆ వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రేషన్ తీసుకోకపోయినా కార్డు రద్దు కాదు. ఒక వేళ సరుకులు ఇవ్వమని డీలర్ చెబితే ఫిర్యాదు చేయవచ్చు.

? షాపులకు సరుకులు చేరిపోయాయా

! బియ్యం, పంచదార తదితర సరుకులు స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు చేరాయి. డీలర్లు ఈపాస్ ద్వారా సరుకులు తీసుకుంటారు. ఖచ్చితమైన తూకం ప్రకారం సరుకులను చేరవేశాం. డీలర్లు కూడా కార్డుదారులకు ఖచ్చితమైన తూకంతో అందచేయాలి. కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే అప్పటికప్పుడే చర్యలు తీసుకుంటాము.

? షాపుల వద్ద సరుకు నిల్వల బోర్డు ఏర్పాటు చేయించారా?

! రేషన్ షాపుల వద్ద సరుకుల నిల్వల స్థితిగతులు తెలిపే బోర్డులతో పాటు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నాం. ఫిర్యాదులను తెలిపేందుకు అధికారుల ఫోన్ నెంబరునూ ఏర్పాటు చేయించాం. దీనికితోడు షాపుల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచనలు జారీ చేశాం. వినియోగదారులు సామాజిక దూరం పాటించేలా, మాస్కులు ధరించేలా చూడాలని కోరాం.

? జిల్లాలో ఎంత బియ్యం, చక్కెర అవసరం

! జిల్లాకు 10,953 టన్నుల బియ్యం, 380 టన్నుల చక్కెరను కేటాయించారు. రేషన్ షాపులలో కార్డుల సంఖ్యను బట్టి సరుకులను కేటాయించాం. ఒక వేళ కార్డుదారు మరోషాపులో సరుకులు తీసుకుంటే ఆ సరుకు సంబంధిత డీలరు వద్ద మిగిలి ఉంటుంది. మరుసటి నెలలో లెక్కప్రకారం సరుకులు కేటాయిస్తాం. డీలర్లు కూడా సక్రమంగా సరుకు నిల్వ లెక్కలు చెప్పాలి. అలా చేయకుంటే చర్యలు తప్పవు.

? జిల్లాలో ఎన్ని షాపులు, కార్డులు ఉన్నాయి

! జిల్లాలో 1513 షాపులు, 7,22,524 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 6,25,119 మంది సరుకులను తీసుకుంటున్నారు. మే నెలలో 86.63 శాతం సరుకుల పంపిణీ జరిగింది. కొత్త విధానం ద్వారా పంపిణీ ఎంత జరిగిందనేది జూన్‌లో తెలుస్తుంది. కార్డుదారులందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

? దివ్యాంగులు, వృద్ధులకు ఎలా

! 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇళ్ల వద్దకే డీలరు వెళ్లి సరుకులు అందజేస్తారు. జిల్లాలో 89,127 మంది వయోవృద్ధులు, 33,148 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ లోపు సరుకులు అందేలా ఏర్పాట్లు చేశాం. వీరందరికీ వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది.

? బయోమెట్రిక్, ఐరిస్ పరికరాల మాటేమిటి

! కాటాలు, బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలకు మరమ్మతులు చేయించారు. వాటి పనితీరులో లోపాలు లేకుండా సరిచేశాం. ఈ పాస్ యంత్రాలను ఆధునీకరించాం. సరుకులకు యూపీఐ, డిజిటల్ విధానంలో నగదు చెల్లించేలా ప్రోత్సహిస్తాం. ఈ పాస్‌లు మొరాయించకుండా ట్రయల్ రన్ కూడా నిర్వహించాం.

? తనిఖీలు ఎలా ఉంటాయి?

! రేషన్ షాపుల పరిశీలన, తనిఖీలకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్‌ల ద్వారా షాపులలో ఏరోజుకారోజు సరుకుల నిల్వలు, పంపిణీ తదితర వివరాలు స్పష్టంగా తెలుసుకుంటాం. ఎప్పటికప్పుడు తనిఖీలు కూడా ఉంటాయి. డీలరు అక్రమాలకు పాల్పడ్డాడని తెలిస్తే గతంలోలా కాకుండా తక్షణమే చర్యలు తీసుకుంటాం. శిక్షలు కూడా ఉంటాయి.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



కోవూరు : షాపునకు చేరిన బియ్యం బస్తాలు, ఫిర్యాదు చేసే ఫోన్ నెంబర్లు కలిగిన ఫ్లెక్సీ వద్ద డీలరు

లంచం ఇస్తేనే మ్యుటేషన్!

- జమ్మవరం వీఆర్వో డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితులు
- పక్కా ప్రణాళికతో అదుపులోకి...



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వీఆర్వో గంగాధర్

ఏఎస్ పేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : అడిగినంత ఇస్తేనే మ్యూటేషన్ చేస్తానన్న వీఆర్వో చివరకు ఏసీబీకి పట్టుబట్టాడు. ఏఎస్‌పేట మండలం జమ్మవరం వీఆర్వో గంగాధర్ ఓ రైతు వద్ద రూ.15వేలు లంచం తీసుకుంటుండగా శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శిరిష తెలిపారు. వివరాల్లోకి వెళితే..

జమ్మవరం పంచాయతీ పరిధిలోని కాకర్లపాడు గ్రామానికి చెందిన టి పద్మమ్మకు చెందిన 1.78 ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ భూమికి సంబంధించి మ్యుటేషన్ కోసం 10 రోజుల క్రితం తహసీల్దారు శ్రీరామకృష్ణకు పద్మమ్మ అర్జీ పెట్టుకున్నారు. అయితే, రోజులు గడుస్తున్నా తన పని కాకపోవడంతో ఆమె వీఆర్వో గంగాధర్‌ను కలిశారు. కార్యాలయంలో పనులు త్వరగా జరగాలంటే రూ.25 వేలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అయితే, తాను అంత ఇచ్చుకోలేనని పద్మమ్మ ప్రాధేయపడింది. చివరకు రూ.15వేలు ఇవ్వాల్సిందేనని వీఆర్వో పట్టుబట్టడంతో ఒప్పుకుంది. ఈ విషయం ఆమె తన చెల్లి కుమారుడు అశోక్‌కుమార్‌కు చెప్పుకుని బాధపడింది. పొలానికి సంబంధించిన కాగితాలన్నీ సక్రమంగా ఉన్నా డబ్బులు డిమాండ్ చేయడం, లంచం ఇవ్వడం ఇష్టంలేని అశోక్‌కుమార్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

పక్కా వ్యూహంతో..


బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్న ఏసీబీ డీఎస్పీ శిరీష పక్కా వ్యూహం రచించారు. శనివారం ఉదయం జమ్మవరం సచివాలయం వద్ద మాటు వేశారు. అశోక్ కుమార్‌కు రూ.15వేల నగదు ఇచ్చి సచివాలయనికి పంపించారు. కార్యాలయంలో లోపల వీఆర్వో గంగాధర్‌కు నగదు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శిరీష తన సిబ్బందితో కలిసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీఆర్వో నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయనపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆమె వెంట ఏసీబీ సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల తీవ్ర అనారోగ్యాలు



పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి) : పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల తీవ్ర అనారోగ్యం వస్తుందని, వెంటనే దాని వాడకాన్ని విడనాడాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ శనివారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బోసుబొమ్మ వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వల్ల ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ధూమపానం వల్ల గుండె వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు ఉత్పత్తుల నివారణకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్‌సీడీ పీవో డాక్టర్ యశ్వంత్, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్, ఎన్‌సీసీ అధికారి బాలసుబ్రహ్మణ్యం, నేవల్ అధికారి నాగేంద్ర బాబు, డాక్టర్ దివ్య, ఎన్‌సీడీ విభాగం అధికారి హాసిని, తదితరులు పాల్గొన్నారు.



చాముండేశ్వరి ఆలయం

గంగపట్నంలో బ్రహ్మోత్సవాల శోభ

- రేపటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహణ
- ముస్తాబైన చాముండేశ్వరి ఆలయం

ఇందుకూరుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి) : గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. కోరిక కోరికలు తీర్చే అమ్మవారిగా పేరొందిన చాముండేశ్వరి దేవిని దర్శనం చేసుకునేందుకు వేలాదిమంది భక్తులు గంగపట్నానికి తరలివస్తుంటారు. ఉత్సవాలకైతే భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. అమ్మవారిని సేవించిన మానసిక వ్యాధులు, గ్రహదోషాలు, దీర్ఘ రోగాల బారిన నుంచి బయటపడవచ్చని భక్తుల నమ్మకం. అంతేగాక సంతానం లేనివారు అమ్మవారి దేవస్థానానికి వచ్చి స్నానం ఆచరించి భక్తితో 40 రోజులు 108 ప్రదక్షిణ చేస్తే సంతానం కలుగుతుందన్న నమ్మకమూ ఉంది. ఇక గ్రామ ఆచారం ప్రకారం ఉత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఒక్కరూ మాంసాహారానికి దూరంగా ఉంటారు. శుచి శుభ్రత నియమ నిష్టలతో అమ్మవారి కల్యాణాన్ని తిలకిస్తారు. కాగా అమ్మవారి బ్రహ్మోత్సవాలు జూన్ 2 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభంగా జరుగుతాయి. 10న కల్యాణం, 11న త్రిశూలేశ్వరస్వామి గంగోత్సవం, 12న రథోత్సవం, నిప్పులగుండం, 13న తెప్పోత్సవం జరగనుంది.

భక్తులతో కిక్కిరిసిన కోన



శ్రీవారి ఆలయంలో భక్తులు

పెంచలకోన బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన మూడవ శనివారం కావడంతో పెంచలకోన క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పెంచలో, గోవింద నామస్మరణలతో క్షేత్రం మారుమోగింది. తెల్లవారుజాము నుంచి పంచామృతాబిషేకాలు, నిత్య కల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం, సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ, క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి 2 గంటలకుపైగా సమయం పట్టింది. ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

మాలకొండకు పోటెత్తిన భక్తులు

వలేటివారిపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. నరసిహంహస్వామి జయంత్యుత్సవాలు పూర్తయి రెండు వారాలు అయింది. జయంత్యుత్సవాలకు రాలేకపోయిన భక్తులు శనివారం తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు రాకతో క్యూలైన్లు కిటకిటలాడాయి. కాగా, స్వామివారికి శనివారం భక్తుల నుంచి రూ.11,93,209 ఆదాయం లభించనట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక దర్శనం ద్వారా రూ.5,53,700, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,12,290, అన్నదానం ద్వారా రూ. 2,33,214, తలనీలాల ద్వారా రూ. 88,375 లభించినట్లు పేర్కొన్నారు.



అమ్మవారి ఆలయానికి వెళ్లే మెట్లదారిలో కిక్కిరిసిన భక్తులు

ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కావలిటౌన్, మే 31(ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలతో పట్టణంలోని జేబీ డిగ్రీ కళాశాలలోని డీఆర్ క్రీడా ప్రాంగణంలో మే1 నుంచి నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు శనివారంతో ముగిశాయి. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో బాస్కెట్ బాల్, వాలీబాల్, టెన్నిస్ క్రీడాంశాలలో 12 నుంచి 16ఏళ్ల లోపు 90 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ దాతృత్వంతో బీఎమ్మార్ ట్రస్ట్‌చే అందించిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. బీఎమ్మార్ దాతృత్వాన్ని పలువురు నాయకులు కొనియాడారు. ముగింపు సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్వోదయ ఈసీ మెంబర్ మన్నేపల్లి వెంకటేశ్వర్లు, పీడీలు మణికంఠ, హమ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరికో విద్యుత్ సమస్య..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండలంలోని జమ్మలపాలెం ఎస్టీ కాలనీలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనం. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగే 11కేవీ లైనుకు సంబంధించిన స్తంభం ఏళ్లతరబడి ఇలానే ఒరిగి ఉంది. ఇది ఎక్కడ తమ ఇంటిపై పడుతుందోనని పక్కనున్న ఇంటి యజమాని దానికి సపోర్టుగా పాత ద్వారబంధం, తలుపు, రెండు సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు. రోజురోజుకి అది కూడా శిథిలమవుతోంది తప్ప దానికి మరమ్మతులు చేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపడుదామన్న ఆలోచన ఆ శాఖ అధికారులు, సిబ్బందికి లేకపోవడం గమనర్హం. ఈ విషయంపై పలుదఫాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే ట్రాన్స్‌కో సిబ్బంది పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. ఎక్కడో పంట పొలాల్లో అయితే పోనీలే అనుకున్నా నివాసగృహాల మధ్యే ఇలా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. ఇదిలాఉండగా చిన్నపాటి గాలి వీచినా ఇక్కడ స్థానికులు ఎక్కడ స్తంభం పడి ఇళ్లపై విద్యుత్ తీగలు పడి ఏ ప్రమాదం పొంచి వస్తుందోనని గిరిజనులు భయాందోళన చెందుతున్నారు.

● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో ప్రజలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం మండలంలోని బ్రాహ్మణక్రాక బస్టాండ్ సెంటర్‌లో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తరచూ మంటలు రావడం, పేలుడుశబ్దాలతో పాటు వైర్లు తెగి కింద పడుతుండడంతో ఆ ప్రాంతంలో నివాసాల వారితో పాటుగా ప్రయాణికులు బీతిల్లుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రజలు తిరుగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. జనావాసాల మధ్య కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ వేరే ప్రాంతంలో జన సంచారం లేని చోట ఏర్పాటు చేయాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇవి మచ్చుకు ఓ ఉదాహరణ మాత్రమే. ఇలా ఎన్నో.. ఎన్నెన్నో.. విద్యుత్ సమస్యలతో గ్రామీణ ప్రాంతా ప్రజలు అల్లాడిపోతున్నారు.

జలదంకి, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇలాంటి విద్యుత్ సమస్యలు లేని గ్రామం అంటూ ఒక్కటి కూడా లేదు. ప్రతి గ్రామంలో ఏదో ఒక రకమైన విద్యుత్ సమస్యతో పల్లె ప్రజలు నిత్యం అల్లాడుతున్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని గ్రామస్థులు అడిగితే వారు పెడచెవిన పెడుతున్నారు. దీంతో ప్రజలు ఏమి చేయాలో తెలియక స్థానిక రాజకీయ పార్టీల నాయకులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ విద్యుత్ సమస్యలు తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆ గ్రామం.. ఈ గ్రామం అని లేకుండా పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికందే అంత కిందక వేలాడుతోన్నాయి. వీటిని సరిచేయాల్సిన బాధ్యత స్థానిక లైన్‌మన్లపై ఉన్నా వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన మండల ట్రాన్స్‌కో ఏఈలు పల్లెల వైపు కన్నెత్తి చూడడం మానేసి కేవలం కార్యాలయాలకే పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణం.

● వ్యవసాయానికీ తరచూ అంతరాయం

ప్రస్తుతం కావలి కాలువకు రెండో పంటకు సాగునీరు విడుదల అయింది. ఈ నీటిని విద్యుత్ మోటార్లతో పొలాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదు. పడమటి గాలులకు సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని రైతులు లైన్‌మెన్‌లను అడిగితే వారిలో స్పందన లేకుండా పోతోందన్న ఆరోపణలు ఉన్నాయి. వారికి ఇష్టం వచ్చినపుడు వచ్చిపునరుద్ధరిస్తున్నారు. దీంతో వ్యవసాయ పనులు సక్రమంగా సాగడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా చినక్రాక రైతులకు ఇదే సమస్య తలెత్తడంతో వారి పొలాలకు రోజుల తరబడి సాగునీటి సరఫరా నిలిచి వ్యవసాయ పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి పల్లెల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తీర్చాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

శివుడు నెలకొన్న శ్మశానం దేవాలయంతో సమానం

● స్వర్గధామంలో దహనశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి భూమిపూజ



దహనశాలల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి) : శివుడు నెలకొన్న శ్మశానం దేవాలయంతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. దాత అంకినపల్లి రమేష్‌రెడ్డి దాతృత్వంతో రూ.40 లక్షల వెచ్చించి కావలిపట్టణ ఉత్తరశివార్లలో రోటరీక్లబ్ స్వర్గధామంలో నిర్మించనున్న నాలుగు దహనశాలలకు శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ శ్మశాన వాటికను ఆధునికీకరణకు ముందుకు వచ్చిన దాతను ఆయన అభినందించారు. గతంలోనూ దరిశిసేవా సంస్థ, అభ్యుదయసేవా సంస్థ, ఈవీఎస్, కనమర్లపూడి కోటేశ్వరరావు తదితరులు ముందుకు వచ్చి శ్మశానం అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అలాగే బాలక్రిష్ణారెడ్డినగర్, పాపిరెడ్డి చెరువు పక్కన ఉన్న శ్మశాన వాటికలను కూడా అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు వచ్చి జన్మభూమికి రుణం తీర్చుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని 22వ వార్డు వెంగళరావునగర్‌లోని షాదీమంజిల్ ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

పట్టణంలోని 18, 29 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఒకటో తేదీకి ముందే పింఛన్లు పంపిణీ చేయటం వృద్ధులు, దివ్యాంగుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, రోటరీ బాధ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ

● ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కాకర్లపాలెంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లపాలెంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి శనివారం రామాలయం ముదు ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. ఆ మహోత్సవాలకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరావును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నల్లమోతు లక్ష్మీనరసింహం, హరికృష్ణ, లక్ష్మి, బ్రహ్మయ్య, రమణయ్య తదితరలుఉ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

అవ్వా, తాతల కళ్లలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కాకర్లపాలెంలో శనివారం వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాను హర్ష, నల్లబోతు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు మైండ్‌సెట్ మార్చుకోవాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అములులో అధికారులు తమ మైండ్‌సెట్‌ను మార్చుకొని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని వీరనకల్లులో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డు చేర్పులు, మార్పులకు సంబంధించి నిబంధనలు అడ్డుగా ఉన్నాయంటూ సిబ్బంది తమను సచివాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు పథకాలు అందచేసే విషయంలో అధికారులే చొరవ తీసుకొని ప్రభుత్వ పథకాలు మంజూరయ్యేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, చీమల తాతయ్య, లెక్కల రాంబాబు, యర్రగొండ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకి ఉద్యోగ విరమణ సన్మానం



ఎంఈవో శ్రీధర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

జలదంకి, మే 31(ఆంధ్రజ్యోతి): జలదంకి ఎంఈవోగా సుదీర్ఘ కాలం పనిచేసిన కే.శ్రీధర్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎంఈవో దంపతులను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన రాజకీయపార్టీల నాయకులు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరిప్రసాద్, ఎంఈవో-2 నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ పాత విగ్రహంపై కలకలం

కందుకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ పాత మూలవిరాట్‌ను నిమజ్జనం చేయకుండా అలాగే ఉంచటం, అమ్మవారికి అపచారం జరుగుతుందన్న ప్రచారం సోషల్ మీడియాలో జరగటం కలకలం రేపింది. గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంకు సంకల్పించి గత ప్రభుత్వంలో మూలవిరాట్‌ను తొలగించి నవధాన్యాల రాశిలో ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. అయితే పునః ప్రతిష్ఠకు ఆ విగ్రహం అనువుగా లేదని స్థపతి, ఇతర పండితులు నిర్ధారించటంతో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసిన విషయం తెలిసిందే. అయితే నూతన విగ్రహ ప్రతిష్ఠానంతరం పాత విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉండగా ఆ ప్రక్రియ జరగలేదు. అయితే ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యుడిగా, దశాబ్దాలపాటు ఆలయ ధర్మకర్తగా వ్యవహరించిన దివి లింగయ్యనాయుడు పాత విగ్రహాన్ని నిమజ్జనం చేయటం పట్ల అభ్యంతరం తెలపటం వల్ల అప్పట్లో కార్యక్రమం వాయిదా పడిందని కమిటీ సభ్యులు చెబుతున్నారు. అయితే శనివారం అమ్మవారి దీనావస్థ అంటూ చిత్తుకాగితాల మధ్యలో పాత అంకమ్మ మూలవిరాట్ ఉన్నట్లు ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయటంతో భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే అమ్మవారి మూలవిరాట్‌ను ఓ గదిలో ధాన్యరాశిలో ఉంచటంతో పాటు కనిపించకుండా వస్త్రాలు కప్పి ఉన్నాయని ఎవరో కావాలనే అలా చిత్రీకరించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

'ఎమ్మెస్సార్'లో జాబ్‌మేళా

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): కావలిలోని ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాలలో శనివారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ మెగా జాబ్‌మేళాను నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగాలు, ఉపాధిలేక నిర్వీర్యమై రోడ్లమీద తిరిగే పరిస్థితులు వచ్చాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే దృఢసంకల్పంతో యువనాయకుడు నారా లోకేష్‌బాబు కృషి చేస్తూ ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకు వస్తున్నారన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లబ్బుల్ ఖయ్యూం, సీడప్ జేడీఎం హైమావతి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు సుమారు 761 మంది నిరుద్యోగులు హాజరు కాగా వివిధ కంపెనీలకు 289 మందిని ఎంపికచేసి నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, ఎమ్మెస్సార్ డిగ్రీకళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ టీ.ఉమా, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు శనివారం మండలం నార్తుఆములూరులోని చైల్డ్ అనాథ బాలల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాపనబోయిన జగన్, దానం రజిని, రవ్వా హరి కుమార్, దేసు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం దారి మూత


● పట్టణ వాసులకు ఇక్కట్లు



అన్నపుగుంట తూముల వద్ద పైపులు అడ్డువేయడంతో వెనుదిరుగుతున్న వాహనదారులు

కావలి రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ వైకుంఠపురంలో అన్నపుగుంట పూడిక తీత పనుల్లో భాగం పెద్దపవని రోడ్డు గుండా అన్నపుగుంట మీదుగా పట్టణంలోకి వెళ్లే దారిలో శనివారం పైపులు అడ్డువేసి దారి మూసి వేశారు. దీంతో వైకంఠపురం, జనతాపేటతో పాటు పెద్దపవని రోడ్డు గుండా పట్టణానికి వచ్చే వాళ్లు దారిలేక పోవటంతో ఉదయగిరి రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా చుట్టు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే టౌన్‌లో పనులు ముగించుకుని గ్రామాలకు వెళ్లే వారు కూడా రాకపోకలకు దారి లేక ఇబ్బందులు పడ్డారు. అధికారులు, పాలకులు స్పందించి వైకుంఠపురంలో ఎన్నో ఏళ్లుగా అసంపూర్తి నిర్మాణంతో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని తొలగించి అండర్ బ్రిడ్జి ఏర్పాటు చెయ్యాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల



విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలు

లింగసముద్రం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల వైభంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా శుక్రవారం రాత్రి భక్తులు స్వామి వారిని గ్రామంలో ఊరేగించి, నేతికడవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు కట్ట దిగువన ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. గ్రామానికి చెందిన దూర ప్రాంతాల్లో ఉంటున్న అనేక మంది గ్రామానికి వచ్చి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ మంగారావు, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు ఎస్‌ఐలు ఎం నారాయణ, వెంకట్రావు, అంకమ్మ, 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కందుకూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ తక్షణం నివాస స్థలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈనెల 2న తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో నిరుపేదలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి పీ. మాలకొండయ్య ఒక ప్రకటనలో కోరారు. సొంత ఇల్లులేని పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున నివాస స్థలాలు ఇవ్వటంతో పాటు గృహనిర్మాణం కోసం ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షలు ఆర్థికసహాయం అందించాలని డిమాండ్ చేశారు.

అశ్లీల నృత్యాలు నిర్వహించడం తప్పే

● బహిరంగ క్షమాపణ కోరిన శంభునిపాలెం కాపులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శంభునిపాలెం గ్రామ కాపులు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22న ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు కార్యక్రమం పొరపాటున జరిగిందని, ఈ పొరపాటుకు తమ గ్రామం తరపున క్షమాపణ కోరుతున్నామని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని శంభునిపాలెం గ్రామపెద్దలు అన్నారు. శనివారం ఆ గ్రామంలో గ్రామ కాపులు, పెద్దలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే సమయంలో హిజ్రాల నృత్యాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ క్రమంలో హఠాత్తుగా వర్షం కురవడంతో గ్రామస్థులంతా ఎవరి ఇళ్లల్లోకి వారు వెళ్లిపోవడంతో మద్యం సేవించి ఉన్న హిజ్రాలను స్థానిక ఆకతాయిలు కొంతమంది వివస్త్రాలుగా నృత్యం చేయాలని కోరడంతో వారు వస్త్రాలను తొలగించి 7 నిమిషాల పాటు నృత్యాలు చేశారన్నారు. వర్షం తగ్గిన వెంటనే గ్రామ కాపులు అక్కడకు చేరుకొని వారిని నిలువరించి పారితోషికం ఇచ్చి అక్కడి నుండి పంపించేశామని తెలిపారు. ఇటువంటి సంస్కృతి తమ గ్రామంలో ఎన్నడూ లేదని, ఇది పొరపాటుగా జరిగిందని తెలిపారు. ఇందులో రాజకీయ నాయకుల చొరవ కానీ, పోలీసు అధికారుల సహకారం కానీ ఏమీ లేదని, అనుకోకుండా జరిగిన పొరపాటు మాత్రమేనన్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రసారమై తమ గ్రామం సభ్య సమాజం ముందు తలదించుకోవలసి వచ్చిందని ఆవేదన చెందారు. ఇందుకు బహిరంగ క్షమాపణ కోరుతున్నామని గ్రామ పెద్దలు, కాపులు తెలిపారు. చట్టపరంగా అధికారులు తీసుకొనే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు ఆట ఆంజనేయులు, పుచ్చలపల్లి వాసు, నాటారు హజరత్తయ్య, పురిణి శీనయ్య, నాటారు సుధ, పెద్దలు దేవరాజ్, నాటారు వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బీసీ నేత జనిగర్ల రాజీనామా



తన అనుచరులతో కలిసి రాజీనామా ప్రకటిస్తున్న బీసీ నేత జనిగర్ల మహేంద్రయాదవ్

కావలి, మే 31(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన బలమైన బీసీ నేత 5వ వార్డు ఇన్‌చార్జి జనిగర్ల మహేంద్ర యాదవ్, మరో ఐదుగురు ముఖ్యనాయకులతో కలిసి పార్టీకి రాజీనామా చేశారు. దీంతో కావలిలో వైసీపీకి మంచి షాక్ తగిలినట్లయింది. ఈ పట్టణంలోని మహేంద్ర లేఅవుట్‌లో శనివారం సాయంత్రం ఆయన తన అనుచరులతో సమావేశమై వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయనతోపాటు ఆయన అనుచరులుగా ఉన్న 9వ వార్డు ఇన్‌చార్జి తోట శ్రీహరి, 36వ వార్డు ఇన్‌చార్జి సమాధి రవి, 4,5 వార్డుల వైసీపీ ముఖ్య నాయకుడు ఓ శ్రీను, 21వ వార్డు నాయకుడు జలదంకి మాల్యాద్రి, 32వ వార్డు నాయకుడు కొండలరావు తదితరులు పార్టీకి రాజీనామాను ప్రకటించారు. గత కొంత కాలంగా వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న జనిగర్ల మహేంద్ర యాదవ్ ఎట్టకేలకు ఆ పార్టీకి రాజీనామా ప్రకటించగా ఆయనకు మద్దతుగా వారి అనుచరులు కూడా రాజీనామ చేశారు. ఈ సందర్భంగా మహేంద్ర యాదవ్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంగ్రెస్, వైసీపీలో కొనసాగిన తాను తన వ్యక్తిగత కారణాల వలన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా ఐదుగురు కూడా వ్యక్తిగత కారణాలవలన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన అనుచరులు, అభిమానులు, వార్డు ప్రజల అభిప్రాయాల మేరకు ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

ముమ్మరంగా ఎడగారు వరినాట్లు



వరి నాట్లు వేస్తున్న మహిళలు

అల్లూరు, మే 31(ఆంధ్రజ్యోతి) : మండల రైతులు ఎడగారు సాగులో నిమగ్నమయ్యారు. ఈ సీజన్‌లో 19 వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. మోపూరు మట్టం, అల్లూరు చెరువు, రామన్న చెరువు ఆయకట్టుల పరిధిలోని భూముల్లో అధికారికంగా అనధికారికంగా 40 వేల ఎకరాల్లో రబీ సీజనులో వరిసాగు చేపడుతారు. అయితే అత్యధిక విస్తీర్ణం లోతట్టు ప్రాంతంలో ఉండగా ఆ ప్రాంతంలో వరికోతల సమయంలో వర్షాలు సంభవిస్తే గింజ ధాన్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి కారణంగా స్వాంపు ప్రాంతాల్లోని భూముల్లో రైతులు ఎడగారు వరిసాగు చేపట్టేందుకు ఆసక్తి చూపరు. ఈ క్రమంలో మిగిలిన ప్రాంతమంతా భూముల్లో రైతులు 10 శాతం మంది భూములను చదును చేసి విత్తనాలను నేరుగా పొలాల్లో చల్లగా మరికొంత మంది డ్రమ్‌సీడర్‌ను వినియోగిండం, మిగిలిన 90 శాతం మంది వరినాట్లుకే మొగ్గు చూపుతున్నారు. ఖర్చులను తగ్గించుకునే క్రమంలో విత్తనాల చల్లకం, డ్రమ్‌సీడర్ వినియోగిం చేపడుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

నెల్లూరుపై మూడో కన్ను నిఘా

- 300 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ
- పోలీస్, కార్పొరేషన్లలో కమాండ్ కంట్రోల్ రూమ్స్

నెల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరులో కొన్నేళ్లుగా అశాంతి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేగా మంత్రి నారాయణ దీనికి పరిష్కారం కోసం పోలీస్ అధికారులతో చర్చలు జరిపారు. నగరం మొత్తాన్ని కాపుకాచే శక్తివంతమైన నిఘా నేత్రాల వ్యవస్థ ఏర్పాటు చేస్తే చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చని గుర్తించారు. ఈ వ్యవస్థ ద్వారానే నగరంలో పారిశుధ్య పరిస్థితులు మరింత మెరుగుపరచవచ్చని నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన నిధుల వితరణ కోసం యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశారు. కార్పస్ ఫండ్ కింద రూ.3 కోట్లు ఇవ్వడానికి వారు అంగీకరించారు. ఆ నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేసింది.

300 కెమెరాలు

నగర వ్యాప్తంగా కీలకమైన ప్రదేశాలను పోలీసులు, కార్పోరేషన్ అధికారులు గుర్తించారు. నగరం మొత్తం కవరయ్యేలా 300 సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయించుకున్నారు. ఈ విషయమై శుక్రవారం రాత్రి మంత్రి నారాయణ నివాసంలో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ, డీఎస్పీలు, కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఇతర సిబ్బందితో సమావేశమై తుది ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

శక్తివతమైన వైర్‌లెస్ కెమరాలు:


నేరస్థులను గుర్తించడానికి శక్తివంతమైన కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నేరాలకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇరుకు ప్రదేశాల్లో అమర్చడానికి వీలుగా లేటెస్ట్ ఫీచర్స్ కలిగిన కెమెరాలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా వైర్‌లెస్ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

రెండు కమాండ్ కంట్రోల్ రూములు

రక్షణ పరంగా అటు పోలీసు వ్యవస్థకు, పారిశుధ్య పరంగా ఇటు మున్సిపల్ కార్పొరేషన్‌కు అవసరాలను తీర్చే విధంగా రెండు కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాలన్నీ ప్రస్తుతం పాత ఎస్పీ ఆఫీసులో ఉన్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు, కార్పొరేషన్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించబడతాయి. ఈ రెండు శాఖలు తమకు సంబంధించిన అంశాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తాయి. నెల రోజుల్లో ఈ నిఘా వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

అన్నదాతల ఆదర్శం!

ఆదివారం ప్రత్యేకం



ఎత్తిపోతల పథకం నుంచి ప్రవహిస్తున్న నీరు

- ఎత్తిపోతల పథకం నిర్వహణలో స్ఫూర్తి పథం
- మూడున్నర దశాబ్దాలుగా ఏకతాటిపై నిర్వహణ
- వాటాలు వేసుకుని ఖర్చులు భరిస్తున్న వైనం
- డెల్టాకు పోటీగా 800 ఎకరాల్లో వరి సాగు

సంగం, మే 31 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలంలోని కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాలు మెట్ట ప్రాంతాలు. కొరిమెర్లలో రెండు, తలుపూరుపాడులో ఒక చెరువు ఉంది. ఈ చెరువుల కింద సుమారు 800 ఎకరాల ఆయకట్టు ఉండగా, వర్షం కురిస్తేనే చెరువుల్లోకి నీరు వచ్చేది. దీంతో ఈ రెండు గ్రామాల నాయకులు ఐకమత్యంతో మూడున్నర దశాబ్దాల కిందట ఐడీసీ పథకంలో నిధులు మంజూరు చేయించుకుని ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. 50 హార్స్‌పవర్ ఆరు మోటార్ల ద్వార బీరాపేరు వాగులో నుంచి నీటిని సరఫరా చేస్తారు. పొలాల వాటా ప్రకారం కొరిమెర్లలోని రెండు చెరువులకు మూడున్నర రోజులు, తలుపూరుపాడు చెరువుకు రెండున్నర రోజుల చొప్పున నీటిని సరఫరా చేసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. 24 గంటల కరెంటు సరఫరా, పెన్నానదిలోని బ్యాక్ వాటర్‌తో ఈ పథకం నడుస్తుంది. నీరు సమృద్ధిగా డెల్టాతో సమానంగా వరిసాగు చేస్తున్నారు.

నిర్వహణ రైతులదే

ఐడీసీ ప్రాజెక్టు అధికారులు పథకం నిర్మించి రైతులకు అప్పగించారు. ఆ తర్వాత నిర్వహణ బాధ్యతలు రైతులే భరించుకుంటున్నారు. పథకం ఆపరేటింగ్, కాపలాదారులకు ఏడాదికి రూ1.5 లక్షలు ఖర్చు అవుతుంది. మోటార్ల రిపేరు తదితర ఖర్చులు మరో 50 వేలు ఉంటుంది. అంటే ఏడాదికి సుమారు రూ.2 లక్షలు. దీన్ని రైతులే వాటాలు వేసుకుని భరిస్తున్నారు. కొరిమెర్ల, తలుపూరుపాడు గ్రామాల్లో పార్టీలు, వర్గాలు ఉన్నా ఎత్తిపోతల పథకం విషయంలో ఏడాదిలో ఏరువాక నాడు సమావేశమై సమష్టి నిర్ణయంతో వాటాలు వేసుకుంటున్నారు. దీంతో ఏడాది పొడవునా డెల్టాతో సమానంగా వరిసాగు చేసి మెట్టలో మూడు దశాబ్దాలుగా వరిసాగు చేస్తూ ఎత్తిపోతల పథకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న కొరిమెర్ల, తలుపూరుపాడు రైతులు ఆదర్శనీయులు.



ఎత్తిపోతల పథకానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

రాజకీయాలకు అతీతంగా నిర్వహణ



రెండు గ్రామాల్లో రైతులు వేర్వేరు రాజకీయ పార్టీలు, వర్గాలు ఉన్నా ఎత్తిపోతల పథకంలో మాత్రం ఏకతాటిగా నడుస్తాం. ఎప్పుడూ ఎలాంటి పేచీ లేదు. ఏడాదిలో ఒకసారి అందరం కూర్చొని సమష్టిగా నిర్ణయం తీసుకుని నడుస్తున్నందుకు ఆనందంగా ఉంది.

\- షేక్ బాబు, నీటిసంఘం అధ్యక్షుడు

పాలు.. పోషకాలు మెండు !



- రైతులకు జీవనోపాధిగా పాడిపరిశ్రమ
- నేడు ప్రపంచ పాల దినోత్సవం

నెల్లూరు(వ్యవసాయం), మే 31(ఆంధ్రజ్యోతి): పోషకాల పరంగా చూస్తే పాలకు మించిందేదీలేదు. ప్రతి రోజు గ్లాసు పాలు ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నది వైద్యులతోపాటు సన్నిహితులు సాధారణంగా చెప్పే మాట. ఎముకల ఆరోగ్యంతోపాటు కండరాల అభివృద్ధికి, రోగనిరోధక శక్తికి పాలు ఎంతో అవసరం అన్నది అందరికీ తెలిసిందే. అయితే పాడి పరిశ్రమ అభివృద్ధికి, ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జూన్ 1న (నేడు) ప్రతి ఏటా ప్రపంచ పాల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో లక్షమందికి ఉపాధి



జిల్లాలో సుమారు లక్ష మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గేదెలను పోషించేవారు 80వేలకు పైగా ఉండగా, కేవలం ఆవులను పోషించే వారు 15వేలకుపైగా ఉన్నారు. వీరంతా పాడిపైనే ఆధారపడినట్లు పశుసంవర్ధకశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో 6,46,116 నల్ల పశువులు, 57,746 తెల్ల పశువులు ఉన్నాయి. ఇందులో 5,96,393 నల్ల పశువులు, 47,131 తెల్ల పశువులు మాత్రమే పాలిచ్చేవి. సాధారణ పరిస్థితుల్లో తెల్ల పశువులు సరాసరి 5 నుంచి 7లీటర్ల వరకు పాలిస్తాయి. అలాగే నల్ల పశువులు 5 నుంచి 10లీటర్ల వరకు దిగుబడి ఉంటుంది. ఈక్రమంలో జిల్లాలో ఒక్క రోజులో సరాసరి పాలదిగుబడి 25.34లక్షల లీటర్లని పశుసంవర్ధకశాఖ అధికారుల అంచనా. లీటరు పాలు సరాసరి రూ.60ల నుంచి రూ.80ల వరకు బహిరంగ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. పాలతో పాటు పాల ఉత్పత్తులతో లక్షల మందికి జీవనోపాధి కలుగుతోంది.

పాలు సంపూర్ణ పోషకాహారం

పాలు సంపూర్ణ పోషకాహారం. అన్ని రకాల పిండి పదార్థాలు, కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు, లవణాలు, విటమిన్లు మొదలైనవి ఉంటాయి. ఇవన్నీ సులభతరంగా జీర్ణమయి శరీరానికి అవసరమయ్యే శక్తిని వెంటనే ఇస్తాయి. పాలలో విటమిన్స్, అమినో ఆమ్లాలు ఉండడం వల్ల వ్యాధినిరోధకశక్తి పెంపొందిస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులకు ఇవి చాలా ఉపయోగంగా ఉంటాయి.

\- డాక్టర్ బీ.కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్

ఏం జరుగుతుందో!?

- బదిలీలపై ఉపాధ్యాయుల్లో వీడని ఆందోళన
- భారీగా వస్తున్న అభ్యంతరాలు
- ఎస్జీటీల స్థానచలనాలపై సందిగ్ధత

నెల్లూరు(విద్య), మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటివరకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీలు, ఎస్ఏలకు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు ఉద్యోగోన్నతి ప్రక్రియ వివాదాల నడుమ పూర్తి చేశారు. ఇకపై అసలు గందరగోళం ప్రారంభం కానుంది. ఎస్ఏల బదిలీలు, ఎస్జీటీల బదిలీలతో జిల్లాలో కోలాహలం నెలకొననుంది. ఇప్పటికే వీరి దరఖాస్తు ప్రక్రియ పూర్తికాగా అభ్యంతరాలను స్వీకరించి పరిశీలిస్తున్నారు. వీటిలో అన్ని రకాల సమస్యలను పొందుపరిచి అప్రమత్తంగా లేకుంటే స్థానాలు పొందే విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా స్పౌజ్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు లబ్ది పొందారన్న ఆరోపణలున్నాయి వీటన్నిటిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



నేటి నుంచి ఎస్ఏల బదిలీలు

ఆదివారం నుంచి ఎస్ఏల బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు 1289 మంది 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో వీరు తప్పనిసరి బదిలీ కానున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయడంతో ప్రాథమిక సీనియారిటీ జాబితాను సబ్జెక్ట్‌ల వారీగా విడుదల చేశారు. వీటిపై భారీగా అభ్యంతరాలు రావడంతో వీటిని పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ శనివారం రాత్రికి సీనియారిటీ తుది జాబితాను సబ్జెక్ట్‌ల వారీగా ప్రకటిస్తామని అధికారులు చెపుతున్నారు. ఈ జాబితాలను ఆమోదిస్తే జూన్ 1, 2వ తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 4వతేదీన బదిలీ ఉత్తర్వులు అందచేస్తారు. 5న అర్హులైన ఎస్జీటీలకు ఎస్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. దీనికోసంగా ఎస్జీటీలు తాము కోరుకునే స్థానాలకు వెబ్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. 6వతేదీన స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందచేస్తారు.

174 మంది ఉద్యోగోన్నతులు

జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలకు 103 మంది బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు అందచేశారు. ఖాళీ అయిన స్థానాలను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జడ్పీ మేనేజ్‌మెంట్‌లో 89 మందికి, మున్సిపాలిటీలో 4 కలిపి మొత్తం 93 మంది ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 82 మంది దరఖాస్తు చేసుకోగా కౌన్సెలింగ్ నిర్వహించి 81 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. మొత్తం మీద 174 మందికి ఉద్యోగోన్నతి కల్పించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఎస్జీటీలకు ఆన్‌లైన్‌లోనేనా?

ఎస్జీటీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా!? లేదా మ్యాన్యువల్‌గా అన్నదానిపై అనిశ్చితి నెలకొని ఉంది. జిల్లాలో ఎస్జీటీలు 2,927 మంది దరఖాస్తు చేసుకోగా ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 1487 మంది ఎస్జీటీలు తప్పనిసరి బదిలీ కానున్నారు. మిగిలిన వారు బదిలీలు కోరుకుంటున్నారు. అయితే వీరి సంఖ్య అధికం కావడంతో పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సిన అంశం కీలకంగా మారనుంది. గరిష్ఠంగా 2వేల ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో వీరంతా తమకు మ్యాన్యువల్‌గానే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీరికి సంబంధించిన ప్రాథమిక సీనియారిటీ జాబితాను శనివారం విడుదల చేస్తారు. అభ్యంతరాలను స్వీకరించి 2వతేదీ వరకు పరిశీలన, జూన్ 6న తుది సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు. అయితే వీరికి వెబ్‌ఆప్షన్‌లా లేక మాన్యువల్‌గానా అన్న అంశంపై మాత్రం ఖచ్చితమైన ఆదేశాలు రావాల్సి ఉంది. దీనికోసం అందరూ వేచి చూస్తున్నారు. ఉత్తర్వులు వస్తే జూన్ 7 నుంచి 10వతేదీ వరకు ఎస్జీటీలు కోరుకున్న స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో అవకాశం కల్పించి. జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.



- ప్రీమియం తగ్గింపుతో తగ్గిన భారం
- పశువుల సంఖ్య రెట్టింపు

పాడి రైతుకు బీమా భరోసా!

ఉదయగిరి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయం తరువాత అధిక శాతం మంది రైతులకు పశువులు, గొర్రెలు, మేకల పెంపకమే జీవనధారం. అయితే, దాణా, పశుగ్రాసం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతోపాటు కొరత ఏర్పడుతోంది. దీంతో పాడి రైతుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. అధిక పెట్టుబడులు పెట్టి పశు పోషణ తలకు మించిన భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో పాడి రైతుకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పశు బీమా పథకంలో మార్పులు తీసుకొచ్చింది. జిల్లాలో 6,46,106 గేదెలు, 57,774 ఆవులు, 10.95 లక్షల గొర్రెలు, 3.86 లక్షల మేకలు ఉన్నాయి. వీటిని పోషించే యజమానులకు బీమా పథకంలో తీసుకొచ్చిన మార్పులు వరంగా మారాయి. రైతు చెల్లించాల్సిన వాటాను తగ్గించడంతోపాటు అధిక పశువులు, మూగజీవాలకు పథకం వర్తించేలా రూపకల్పన చేయడం గమనార్హం. గత నెల నుంచి ఈ మార్పులు అమలులోకి రాగా, అధికారులు పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- గతంలో ఐదు పశువులకే ఈ పథకం వర్తిస్తుండగా, ఆ సంఖ్యను పదికి పెంచారు. అలాగే గొర్రెలు, మేకలను సైతం 50 నుంచి 100 పెంచారు..
- గతంలో 20 శాతంగా ఉన్న రైతు వాటా ప్రీమియంను 15 శాతానికి కుదించి వారిపై ఆర్థిక భారం తగ్గించారు. అలాగే ఒకసారి ప్రీమియం చెల్లిస్తే చాలు మూడేళ్ల వరకు పథకం అమలులో ఉంటుంది.
- నాటు పశువులకు రూ.816, మేలుజాతి పశువులకు రూ.1,632 వరకు చెల్లించాల్సి ఉంటుంది.
- దరఖాస్తు చేసుకున్న వెంటనే బీమా వర్తిస్తుంది.
- పశు సిబ్బంది తమ వంతు బాధ్యతగా ప్రత్యేక సంఖ్యతో ఉన్న కమ్మను పశువులు, మూగజీవాల చెవులకు అమర్చి, వాటి ఆధారంగా బీమా నగదు అందేలా చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పశుబీమాలో ప్రభుత్వం తెచ్చిన మార్పులు పాడి రైతులకు ఎంతో అనుకూలం. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకొస్తున్నాం. పశువులు, జీవాల యజమానులు సైతం పథకం కింద ప్రీమియం చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు.

\- ఎస్వీ రాఘవేంద్రశర్మ, పశువైద్యాధికారి

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు

- డీలర్లు అక్రమాలకు పాల్పడితే అక్కడికక్కడే చర్యలు
- పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ పట్టాభి రామిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి చెప్పారు. శనివారం నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలోలా డీలర్లు అక్రమాలకు పాల్పడితే అక్కడికక్కడే చర్యలు తీసుకోవటం, కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. డీలర్లు కూడా సక్రమంగా సరుకులు పంపిణీ చేస్తూ ప్రజా మన్ననలను చూరగొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. కొత్తకార్డులు, ఉన్న కార్డులలో మార్పు చేర్పులకు కోసం ఇప్పటి వరకు 41,678 దరఖాస్తులు అందాయని చెప్పారు. వాటిలో 7,415 దరఖాస్తులను ఆమోదించారని తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు ఈ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వివరించారు. 7 నుంచి 21 రోజుల లోపు దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.



మలేరియా మాసోత్సవ పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

మలేరియా మాసోత్సవాలను సమర్థంగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం) మే 31 (ఆంధ్రజ్యోతి): జూన్ 1 (ఆదివారం) నుంచి జూన్ 30 వరకు జరిగే మలేరియా మాసోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తెలిపారు. మలేరియా మాసోత్సవాల పోస్టర్లను శనివారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల పట్ల జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు పీహెచ్‌సీల్లో జ్వరాలు ప్రబలకుండా చూడాలన్నారు. మలేరియా నివారణకు చర్యలు తీసుకుని, ప్రజలకు అవగాహన కలిగించాలని తెలియచేశారు. మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే జరగాలన్న నినాదంతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఎన్‌హెచ్ఎం పీవో డాక్టర్ రమేష్, డాక్టర్ భాస్కర్ రావు, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి దుర్మరణం



బావిలో పడి మృతి చెందిన మహబూబ్ బాషా

సీతారామపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంట మడుగు వాగు సమీపాన గల ఎర్రగుంట్ల బావిలో శనివారం చేపలు పట్టేం దుకు వెళ్లి రాజుగారి కాలనీ ప్రాంతంలోని మంగలి వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. స్థానికు ల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ బాషా దర్గాల వద్ద ముజావర్‌గా ఉంటూ గ్రామంలో పాత ఇనుముకి ఎర్రగడ్డలు ఇచ్చే వ్యాపారం చేసేవాడు. ఖాళీ సమయంలో చేపలు పట్టే అలవాటు ఉండడంతో శనివారం గాలం తీసుకుని ఎర్రగుంట్ల బావి వద్దకు చేరు కుని చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందాడన్నారు. సాయంత్రం బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన యువకులు నీళ్లపై తేలియాడుతున్న మృతదే హాన్ని చూసి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు బావి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఉదయగిరి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతూ యువతి మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన బత్తుల శివప్రియ (22) అనే యువతి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. అయితే ఆ యువతిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు, అనంతరం చెన్నైలోని మరో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆ యువతి శనివారం మృతిచెందింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

డీజీపీని కలిసిన పోలీసు అధికారుల సంఘం నేతలు



డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీహరి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మే 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తాను శనివారం మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో ఆంధ్రపదేశ్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా పోలీసు అధికారుల సంఘం అసోసి యేట్ అధ్యక్షుడు వై శ్రీహరి మాట్లాడుతూ కొంత కాలంగా ని లుపుదల చేసి ఉన్న మ్యారేజ్, ఎడ్యుకేషన్, మెడికల్ రుణా లను పెండుదల చేసి సున్నావడ్డీకి మంజూరు చేస్తూ డీజీపీ ఆదేశాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

వైసీపీ నాయకులపై కేసు నమోదు



కలెక్టరేట్ ఎదుట వైసీపీ నాయకులు, కార్యకర్తలు

నెల్లూరు (క్రైం), మే 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడం, వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పెట్టిన కేసును సీబీఐకు అప్పగించాలని కోరుతూ శనివారం కాకాణి కుమార్తె పూజితారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు ఆనం విజయ్‌కుమార్ తదితరులు కలెక్టరేట్‌లోని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో భారీగా కలెక్టరేట్‌కు చేరుకున్న వైసీపీ నాయకులు పోలీసులు వారిస్తున్నా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కలెక్టర్‌కు వచ్చిపోయే వారిని ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రజా శాంతికి భంగం కలిగే రీతిలో ప్రవర్తించారు. దీంతో చిన్నబజారు పోలీసులు వైసీపీ నాయకులు మందల వెంకటశేషయ్య, మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, ఇంద్రసేన గౌడ్, అబ్దుల్ మస్తాన్, షేక్ సిద్దిక్, బొబ్బల శ్రీనివాస యాదవ్, రావు శ్రీనివాసరావు ఉరాఫ్ ఆర్ఎస్ఆర్, సత్తార్, మోయళ్ళ సురేష్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, మరి కొందరిపై కేసులు నమోదు చేశారు.